
اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 1 సంచిక 3 | అక్టోబర్ 2009 | రూ. 15/-



## ఆధునిక విద్యా వ్యవస్థ ఈ కాలానికి చెందినదా? లేక శతాబ్దాలకు పూర్వమే ఏర్పడిందా?

# అల్లాహ్  ALLAH

## సకల లోకాలను సృష్టించిన ఆ సృష్టికర్త పేరు : అల్లాహ్

### ఇది అరబీ పదమా?

వాస్తవానికి మూసా(అ) [Moses] వారి మాతృభాషయైన హెబ్రూలో కూడా
ఆ పేరు 'అల్లాహ్'

ఈసా(అ) [Jesus] వారి మాతృభాషయైన అరమాయిక్ భాషలో కూడా
ఆ పేరు 'అల్లాహ్'

మూడు భాషలలోనూ అల్లాహ్ అనే పదానికి మూలం 3 అక్షరాలు
అరబీ - (అలిఫ్, ا లామ్, ل హ ه) అరమాయిక్ - (అలెఫ్, ܐ లామెద్, ܠ హే ܗ) హెబ్రూ - (అలెఫ్ א , లామెద్, ל హే ה)

పురాతన సెమిటిక్ భాషలలో సకల లోకాలను సృష్టించిన సృష్టికర్త పేరు "అల్లాహ్".
లిపిలో తేడా ఉండవచ్చు గాని పలకడం (ఉచ్ఛారణ) ఒకటే.

'ఆరాధ్యుడు' అనే పదానికి అరబీ, అరమాయిక్, హెబ్రూ భాషల మూడింటిలోనూ 'ఇలాహ్' అనే పిలుస్తారు.

అరబీ గ్రామర్ ప్రకారం 'అల్ + ఇలాహ్' = 'అల్ ఇలాహ్' అవుతుందేగాని,
ఆ పదాల కలయిక 'అల్లాహ్' అనే పదానికి సమానం కాదు. ఇది ఒక ప్రత్యేక పదం.

'అల్లాహ్' అనే పదం అసమాన (UNIQUE) పదం. మరి అల్లాహ్ ఎలా ఉంటారు?

ఆయన ఒక్కడు. ఆయన ఎవరికీ తండ్రి కాడు. ఆయన ఎవరికీ జన్మించనూ లేదు. ఎవరి సహాయం అవసరం లేనివాడు.
ఆయనను పోలినదేదీ ఈ విశ్వంలో లేదు. అల్లాహ్ నుద్దేశించి 'మేము' అని వాడబడిన పదం బహువచనం కాదు.
Royal Plural. ఆయనను పోలినదేదీ విశ్వంలో లేనప్పుడు ఇలా ఉంటారని ఊహించ సాధ్యం కాదు.

'దేవుడు' అనే తెలుగు పదానికి 'దేవుళ్ళు' అను బహువచన పదం ఉంది.
'అల్లాహ్' అనే పదానికి బహువచన పదం గాని, స్త్రీ లింగ పదంగాని లేదు.

గాలి, నీరు, భూమి, సూర్యుడు అందరికీ ఒకటే. వీటిని సృష్టించిన సృష్టికర్త కూడా ఒక్కడే!
సర్వాన్ని సృష్టించిన వానికి పేరు మార్చుకోవలసిన అవసరం ఎంతమాత్రం లేదు.
సృష్టి మొదలు నుండి సృష్టి అంతం వరకూ ఒకటే పేరు. ఆ పేరే "అల్లాహ్"

"సకల లోకాలను సృష్టించిన ఆ సృష్టికర్త పేరు ఏమిటి?" లో ప్రవక్తలందరూ ప్రార్థించింది 'అల్లాహ్'నే అని హెబ్రూ, అరమాయిక్ భాషా వాక్యాలతో నిరూపించడం జరిగింది. ఈ పుస్తకాన్ని ఉచితంగా పంపిణీ చేసినవారు: ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ (వైజాగ్), వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ (సామర్లకోట)

షవ్వాల్ - జిల్ ఖదా హి.1430

# శాంతిబాట

మాసపత్రిక రూ. 15/-

సంపుటి 1 సంచిక 3 అక్టోబర్ 2009

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

Phone:9347046090 Email:velugubaata@gmail.com

ఎడిటర్:

**ఎమ్‌డి. అతహరుల్లా**

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అఫ్ఫాన్ ఉమ్రీ

**సహాయకులు:**

**వెలుగుబాట**

ఎడ్యుకేషనల్ సొసైటీ

మరియు

**ట్రూవిజన్**

ఎడ్యుకేషనల్ సొసైటీ

సభ్యులు

**Printed by**
Md. Athaharullah

**Published by**
Md. Athaharullah

**Owned by**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**
'*Akash Industries*',G-14, Industrial Estate, Samalkot - 533440

and

**Published at**
2-8-31, Kota Bazar,
Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah

Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Title Code APTEL11019

ఈ పత్రికలో ప్రచురించిన
వ్యాసాల గురించిగాని,
లేదా ఇతర వివరాలకుగాని
సంప్రదించండి

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.*
**Cell : 9491103017**

**1 అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం :** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - తఫ్సీర్‌కి ముఖ్యమైన మూలాలు - ఖుర్'ఆన్ తఫ్సీర్‌పై అపోహలు

**4 ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం : ఇస్లామీయ జీవన విధానంలో నిషిద్ధమైన 'వడ్డీ/అధర్మసంపాదన' పై విశ్లేషణ (చివరి భాగం)

**9 తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). సోదరి ఏంజెలా కొలిన్స్ (అమెరికా) యొక్క సంతోషమయ జీవనం గురించి ...

**14 ఖుర్'ఆన్ మరియు సైన్స్ :** ఆధునిక సైన్స్ యొక్క ఇస్లామీయ మూలాలు గురించి .... చరిత్ర మడతలలో దాయబడిన నిజాలు ... నిజ చరిత్ర వెలుగు - ఇస్లాంలో మస్జిద్ యొక్క పాత్ర.

**18 డార్విన్ సిద్ధాంతం - శాస్త్రీయ వాస్తవం కాదు :** సృష్టికర్త యొక్క అద్భుత సృష్టిపై శాస్త్రీయ వర్ణన. అవాస్తవాల ప్రచారంపై ఖండన - కంటిలో అద్భుతం (2వ భాగం)

**21 జ్ఞానం - అజ్ఞానం :** జ్ఞానులనుకొనే వారి అజ్ఞానాన్ని బయటపెట్టడం. నాస్తికుల అజ్ఞానాన్ని దూరం చేసే ప్రయత్నం ..

**23 నాస్తికుని ఓ ప్రశ్న :** ఇస్లాంపై వచ్చే విమర్శలను చాలామంది ముస్లిములు చదవడానికి ఎందుకు భయపడతారు (లేదా) చదవడానికి ఎందుకు ఇష్టపడరు? - శాంతిబాట జవాబు

**25 ధర్మసందేశ ప్రచారం :** ప్రస్తుతం సమాజంలో అనుసరిస్తున్న కొత్త పోకడల గురించి .... ఖుర్'ఆన్ మరియు సున్నత్ వెలుగులో సందేశాన్ని అందించే విధానాల పరిచయం ...

**27 ఇంటర్‌నెట్‌లో ఇస్లాం కబుర్లు :** ఖుర్'ఆన్ గ్రంథంలో సూరహ్‌ల వరుసక్రమం

**30 టెర్రరిజం :** టెర్రరిజానికి ఏ మతం పేరును అతికించకుండా, 'ఇస్లాం'నే అతికించి ముస్లిములనే టార్గెట్‌గా ఎందుకు పెట్టుకున్నారు? కనులు మూసుకున్న మీడియా యొక్క కనులు తెరిపించే ప్రయత్నం. 20వ శతాబ్దంలో జరిగిన కొన్ని తీవ్రవాద దాడుల వివరాలు - పరిశోధనాత్మక వ్యాసం

**34 బాలబాలికలకు ప్రత్యేకం :** ఇస్లాం పరిచయం. పాఠ్య పుస్తకాలలో సైన్స్ డిస్కవరీల గురించి నేర్చుకున్న అసత్యాలను ఎత్తిచూపడం మరియు వాస్తవాల వివరణ

**36 ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్'ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని..

**37 ముస్లిం యువత - ఆలోచించండి! :** భార్యాభర్తలిద్దరూ సమానమేనా?

'శాంతిబాట' చందాదారులుగా చేరగోరువారు మీ పూర్తి ఎడ్రస్ మరియు ఫోన్ నెంబర్లతో సహా **రూ. 180/-** M.O. చేయవలసిన చిరునామా: **వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**, 2-8-31, కోట బజార్, సామర్లకోట-533440

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# ఎవరిని మెచ్చుకోవాలి?

రైతు విత్తనాలను నాటి ఆహారాన్ని ఉత్పత్తి చేస్తే, ఆ ఉత్పత్తిని బజారు వరకూ తీసుకొచ్చేది ఒకరయితే, బజారుకు చేరిన సరుకును విక్రయించేది మరొకరు. ఆ సరుకును ఇంటికి తీసుకువచ్చి 'అమ్మ'గాని లేదా 'భార్య'గాని వండిపెడితే, వాటిని మనం తింటున్నాము. అదేవిధంగా చిన్న పల్లెటూరిలో ఉండే కాకా హెుటల్ దగ్గరనుండి సిటీలో ఉండే ఫైవ్‌స్టార్ హెూటల్ రెస్టారెంట్స్ వరకూ, అన్నింటిలో అల్పాహారం నుండి భోజనం వరకూ వారి స్థాయిని బట్టి వివిధ సౌకర్యాలతో ఆహార పదార్థాలు లభ్యమౌతాయి. ఆకలి గొన్నవాడు అతని స్థాయిని బట్టి అందుబాటులో నున్న హెూటల్‌లో తన ఆకలిని తీర్చుకుంటాడు.

కాని భోజనప్రియులు ఈ తారతమ్యాలను, లెవెల్స్‌ను పట్టించుకోరు. ధనవంతులు సైతం కార్లలో వచ్చి తోపుడుబండి దగ్గర ఆగి, తినడం మనం చూస్తూ ఉంటాం.

వంట రుచిగా ఉంటే వండినవారిని మెచ్చుకుంటాం. రుచిగా ఉన్నవి చెట్టు క్రింద తిన్నా సరే లేదా ఫైవ్‌స్టార్ హెూటల్లో తిన్నాసరే భోజనప్రియులకు పెద్ద తేడా అనిపించదు.

అయితే రుచిగా వండటం, వండేవారి అనుభవం మీద, నైపుణ్యం మీద మాత్రమే ఆధారపడదు. నాణ్యమైన పదార్థాలను వంట చేసేవారికి అందించాలి. నాణ్యతలేని పదార్థాలతో ఎంతో నైపుణ్యం ఉన్నవారు వంటచేసినా ఫలితముండదు.

కాబట్టి రుచిగల పదార్థాన్ని మనం తినగలిగామంటే, మనం ఎవరిని మెచ్చుకోవాలి?

పండించిన రైతునా? నాణ్యమైన పదార్థాల నుండి బెడ్డు, మట్టి, ఇతర చెత్తను, పాడైపోయినవాటిని తొలగించి అందించే వారినా?

విత్తనం నాటిని దగ్గరనుండి, ఆహారం మన నోటిలోనికి వెళ్ళడానికి మధ్య పరిశ్రమించిన వారందరికీ ఈ ప్రశంసలో భాగం ఉంది. కాదంటారా?

నిజానికి వీరందరి సమిష్టి కృషి - మనకి రుచికరమైన ఆహారాన్ని అందించింది.

'శాంతిబాట' రెండవ సంచికను, మొదటి సంచికకంటే బావుండేలా చేయాలని అల్లాహ్ పేరుతో ప్రయత్నించడం జరిగింది. మా ప్రయత్నం సఫలీకృతం అయినట్లు పాఠకుల ఫోన్‌కాల్స్ ద్వారా తెలిసింది. ప్రపంచంలో ఎందరో ముస్లిమ్ సోదరులు ఇస్లాం ధర్మాన్ని అందరికీ సులభంగా అర్థమయ్యేలా విశేషమైన కృషి చేశారు. మన సమాజంలోని ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారు చేసిన కృషిని అందరికీ అర్థమయ్యే విధంగా అందించడంలో అల్లాహ్ మాకు సహకరించారు.

కాబట్టి మన 'శాంతిబాట'లో ధార్మిక విషయాలు బాగుండటానికి కారణం - ఎందరో సోదరుల కృషి ఫలితమే! గుంటూరులో మరియు నందికొట్కూర్‌లో ఆరుగురు సోదరులు అల్లాహ్ పేరుతో శ్రమించడం వలన ఇప్పటివరకూ చేరిన చందాదారులలో 3వ వంతు చందాదారులను ఈ సోదరులే చేర్పించారు. వీరికి శ్రేయోశుభాలను అనుగ్రహించాలని అల్లాహ్‌ను వేడుకుంటున్నాము.

ఈసారి ఓ ఇద్దరు సోదరులు పత్రిక ఆలస్యం అయినందుకు ఆగ్రహించడం కూడా జరిగింది. కారణాన్ని తెలుపవలసిన బాధ్యత మాపై ఉంది. ఈ పత్రిక వ్యాపార పత్రిక కాదని మీకందరికీ తెలుసు. అందువలన మాసపత్రికను ప్రమోట్ చేయడానికి ఎవరినీ నియమించుకోలేదు. అందరూ వాలంటరీగా సహకరించేవారే!

మాకు పరిచయం ఉన్న ప్రాంతాలలో, అక్కడి సోదరులకు బిల్‌బుక్స్‌ను అందించి చందాదారులను చేర్పించమని కోరాము. వారు సహృదయంతో స్పందించి చందాదారులను చేర్పించారు. ఈ కార్యక్రమం సుదీర్ఘంగా సాగడంతో, ఆ బిల్‌బుక్స్ మాకు చేరడం ఆలస్యమైంది. ఆ ఎడ్రస్‌లను నోట్ చేసుకుని పంపడంలో ఆలస్యం జరగడం వాస్తవమే!

ఈ పరిస్థితి చక్కబడి నెల మొదటివారంలోనే పత్రికను పోస్ట్ చేయడానికి మాకు ఇన్షాఅల్లాహ్ మరో నెల పట్టవచ్చు. కాబట్టి సహృదయంతో పాఠకులందరూ మమ్మల్ని అర్థం చేసుకుని మాకు సహకరించమని కోరుతున్నాము.

ఇప్పటివరకూ చేరిన చందాదారులలోని ప్రతి ఒక్కరూ, మరొకరిని చందాదారునిగా ఇన్షాఅల్లాహ్ చేర్పించగలిగితే, పెను ఆర్థిక భారం నుండి తప్పించుకోగలుగుతాం. కొరియర్ ద్వారా పంపడం వలన మాపై పడే అధికభారాన్ని తగ్గించడానికి, కొందరు సోదరులు తమ తమ ప్రాంతాలలోని పాఠకులకు వారే స్వయంగా పంపిణీ చేశారు. వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

**- శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

3

**ఇల్మ్ అత్తఫ్సీర్** (గత సంచిక తరువాయి)

ఖుర్'ఆన్ గ్రంథాన్ని అర్థం చేసుకోవడానికి మరియు ఆ గ్రంథ వాక్యాల సందర్భాలనూ, వాటిలోని నిగూఢంగా ఉండే అర్థాలను తెలుసుకోవడానికి ముఖ్యమైన మూలాలు (Sources) మనకి అందుబాటులో ఉన్నాయి.

వాటిలో స్వయంగా దివ్య ఖుర్'ఆన్ గ్రంథమే మొదటి మూలమని గత సంచికలో వివరించడం జరిగింది. గ్రంథంలోని ఒక వాక్యాన్ని అర్థం చేసుకోవడంలో వివరణ మనకి అవసరమైనప్పుడు, ఆ అవసరాన్ని తీర్చడానికి ఖుర్'ఆన్‌లోని మరో వాక్యమే ఉపయోగపడుతుందని, దానికి ఉదాహరణగా సూరహ్ ఫాతిహాలోని 5,6 వాక్యాలను మరియు నాల్గవ సూరహ్‌లోని 69వ వాక్యాన్ని ఇవ్వడం జరిగింది. మొదటి సూరహ్‌లోని అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులైన వారు ఎవరో, నాల్గవ సూరహ్‌లోని 69వ వాక్యం వివరించింది.

ఇక ఈ సంచికలో మరికొన్ని మూలాల గురించి తెలుసుకుందాం!

**2. హదీస్**

ఖుర్'ఆన్ వాక్యాల వివరణకు రెండవ మూలం (source) - హదీస్

ముహమ్మద్(స)వారి బోధనలు మరియు ఆచరణను 'హదీస్' లంటారు. ముందుగా చెప్పుకున్నట్లు సర్వశక్తివంతుడైన 'అల్లాహ్', ఖుర్'ఆన్ గ్రంథంతో ముహమ్మద్(స)వారిని పంపడంలోని ఏకైక ఉద్దేశ్యం - దివ్య ఖుర్'ఆన్ యొక్క ఖచ్చితమైన అర్థాలను ప్రజలకు బహిరంగంగానూ, సవివరంగా చెప్పడమే!

తదనుగుణంగా, ఆయన(స) ఉన్నతమైన సొగసుతో కూడిన తన బోధనలతో మరియు ఆచరణలతో ఆ బాధ్యతను నెరవేర్చారు. వాస్తవానికి ఖుర్'ఆన్‌ని ప్రాక్టికల్‌గా వివరించిన దేమిటంటే, ఆయన(స) యొక్క పూర్తి శుభమయ జీవితమే!

ఆ కారణం వలన గౌరవనీయులైన వ్యాఖ్యాతలు ఖుర్'ఆన్ గ్రంథాన్ని అర్థం చేసుకోవడానికి రెండవ మూలం 'హదీస్' అని నొక్కిచెబుతారు. ఆ విధంగా ఆ హదీస్‌ల వెలుగులో అల్లాహ్ గ్రంథం యొక్క అర్థాలను నిర్ధారించడం జరిగింది.

హదీస్‌లలో సహీహ్ (బలమైనవి), దయీఫ్ (బలహీనమైనవి) మొ॥న ఉల్లేఖనాలు కలిసి ఉన్నాయని, వాటిని వేరే చేసే సంకల్పంతో పరిశోధనాత్మక వ్యాఖ్యాతలు హదీస్ ఉల్లేఖనాలను సూక్ష్మ పరిశీలన చేశారు. అందుకోసం కొన్ని నియమాలను పెట్టుకుని, ఆ నియమాలలో ఏ ఒక్కదానికి సరిపోకపోయినా సరే, ఆ ఉల్లేఖనాన్ని ప్రామాణికంగా (అథెంటిక్‌గా) - సహీహ్‌గా - తీసుకోలేదు.

ముహమ్మద్(స)వారి బోధనను ప్రత్యక్షంగా ఆయన నుండి తెలుసుకున్న వ్యక్తి, మరో వ్యక్తికి అదే విషయాన్ని తెలియజేసినపుడు, ఆ విషయం తెలుసుకున్న రెండవ వ్యక్తి ద్వారా 3వ వ్యక్తి, 3వ వ్యక్తి ద్వారా 4వ వ్యక్తి విన్నారనుకోండి.

అప్పుడు 4వ వ్యక్తి చెప్పే హదీస్ ఇలా ఉంటుంది. "నేను 3వ వ్యక్తి ద్వారా, ఆయన 2వ వ్యక్తి ద్వారా, ఆయన మొదటి వ్యక్తి ద్వారా, ఆ మొదటి వ్యక్తి ముహమ్మద్(స)వారు ద్వారా ఇలా విన్నారు" అని చెబుతారు. ఆయా వ్యక్తుల పేర్లను వరుసగా చెబుతారు.

మన దగ్గర అందుబాటులో ఉండే అనువాదాలలో, సాధారణంగా ఇలా ఒకరి తర్వాత ఒకరి గురించి చెప్పే పరంపర (చైన్) వివరాలను ఇవ్వడం లేదు. ముహమ్మద్(స) వారి నుండి ప్రత్యక్షంగా ఎవరైతే విన్నారో వారి పేరు మాత్రమే అనువాదాలలో సాధారణంగా కనిపిస్తుంది.

వీరందరూ ముహమ్మద్(స)వారు చేసిన బోధనను అక్షరం పొల్లుపోకుండా ఒకే విధంగా చెప్పినా సరే, ఆ చెప్పిన వారిలో ఏ ఒక్కరైనా అబద్ధం చెప్పేవాడని గాని, మోసం చేసేవాడు అనిగాని తెలిసిన వ్యక్తి ఎవరైనా ఉంటే, ఆ 'హదీస్'ను సహీహ్‌గా స్వీకరించలేదు. ఆ హదీస్‌ను బలహీనమైనదిగా (దయీఫ్)గా నిర్ధారించారు.

ఇలా సహీహ్‌గా నిర్ధారించిన హదీస్‌లను అధ్యయనం చేస్తే ఖుర్'ఆన్ గ్రంథాన్ని బాగుగా స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

ముస్లిములందరూ ఏకగ్రీవంగా అంగీకరించిన వాటిలో తొలి రెండు స్థానాలలో నున్న హదీస్ గ్రంథాలు : 1. సహీహ్ బుఖారీ 2. సహీహ్ ముస్లిమ్

సహీహ్ బుఖారీ హదీస్ గ్రంథం 9 సంపుటిలతో, 7563 హదీస్‌లతో అరబీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలలో మన రాష్ట్రంలో అందుబాటులో ఉంది.

తెలుగులో 9 సంపుటిలతో కూడిన "సహీహ్ బుఖారీ" అనువాదం ఇంతవరకూ పబ్లిష్ చేయబడలేదు. ఈ అనువాద కార్యక్రమాన్ని

ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ అల్లాహ్ పేరుతో ప్రారంభించడం జరిగింది. సహీహ్ ముస్లిమ్ గ్రంథం 7 సంపుటిలతో 7563 హదీస్‌లతో అరబీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలలో మనరాష్ట్రంలో అందుబాటులో ఉంది.

ఇవిగాక ఇబ్నెమాజా, తిర్మిదీ, నసాయీ, అబూదావూద్ గ్రంథాలు కూడా ఉన్నాయి. ఈ నాలుగు గ్రంథాలలోని హదీస్‌లను కూడా సహీహ్ మరియు 'దయీఫ్'గా క్లాసిఫై చేసిన వాటిని 'దారుస్సలామ్', సౌదీ అరేబియా వారు ముద్రించారు.

ఉదాహరణకు సునన్ ఇబ్నెమాజాలోని 3452వ హదీస్‌ను గమనించండి.

"అబ్దుల్లా(రజి) వారి ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు (ముహమ్మద్-స) ఇలా చెప్పారు : "**రోగాన్ని నయం చేసే రెండింటిని మీరు తీసుకోండి - తేనె మరియు ఖుర్‌ఆన్**"

(సునన్ **ఇబ్నెమాజా**, నెం. **3452**, సంపుటి 4, మెడిసిన్ పుస్తకం, 7వ అధ్యాయం - తేనె)

ఈ హదీస్‌ను 'దయీఫ్'(బలహీనమైనదిగా) పరిగణించారు. ఈ హదీస్ ఎందుకు బలహీనమైనదని నిర్ధారించారంటే, ఈ హదీస్ ఉల్లేఖకులల్లో (రావిలో) ఒకరైన జైద్ బిన్ హబాబ్ నమ్మదగినవాడు కాదు. హదీస్‌లో ఎటువంటి దోషం లేదు. ఇటువంటి బోధననే సహీహ్ హదీస్‌గా **హాకిమ్**లో 4వ సంపుటిలో 201, 403 హదీస్‌లలో ఉంది. ఆ హదీస్‌లోని ఉల్లేఖకులు నమ్మదగినవారు.

అంటే నిజాయితీకి అత్యంత ప్రాధాన్యత నివ్వడం జరిగింది. ఉల్లేఖకుని గుణగణాలను పరిగణనలోకి తీసుకున్నారు.

కొంతమంది దుష్ప్రచారకులు, హదీస్‌లు కల్తీ అయిపోయాయని ప్రచారం చేస్తున్నారు. హదీస్‌లు కల్తీ కాలేదు. అన్ని విధాలా ప్రామాణికమైన వాటిని వేరు చేశారు. అవి నూటికి నూరు శాతం నమ్మదగినవి.

ఇస్లాం సత్యధర్మం కాబట్టి, అబద్ధాన్ని అసహ్యించుకునే ముస్లిములు అబద్ధాలు మాట్లాడే వ్యక్తి చెప్పిన విషయాలను అనుమానించారు. అవి నిజం కావచ్చు లేదా అబద్ధం కావచ్చు. సత్యధర్మం కల్తీ కాలేదు. **కల్తీ అయినవి దుష్ప్రచారకుల హృదయాలే!**

సహీహ్ హదీస్ గ్రంథాలను పొందాలనుకునేవారికి, వాటి వివరాలను క్రింద అందిస్తున్నాము. ప్రస్తుతం వాటి ఖరీదు గురించి మా దగ్గర సమాచారం లేదు.

1. The translation of the meanings of **SAHIH AL-BUKHARI** (Arabic-English), Translated by Dr. Muhammad Muhsin Khan. (9 Volumes)
2. English Translation of **SAHIH MUSLIM** (Arabic - English) Translated by Nasiruddin al-Khattab. (7 Volumes)
3. English Translation of **Jami At-Tirmidhi** (Arabic - English) Translated by Abu Khaliyl (6 Volumes)
4. English Translation of **Sunan Ibn Majah** (Arabic - English) Translated by Nasiruddin al-Khattab (5 Volumes)
5. English Translation of **An-Nasai** (Arabic - English) Translated by Nasiruddin al-Khattab. (5 Volumes)

**DARUSSALAM**, Publishers & Distributors, P.O. Box 22743, Riyadh 11416, Tel: 0096-4033962, Fax: 4021659, Kingdom of Saudi Arabia. Email: darussalam@awalnet.net.sa; riyadh@dar-us-salam.com, Website: www.dar-us-salam.com

ఏ హదీస్‌నైనా చెప్పేటప్పుడు, ఆ హదీస్ నంబర్, వాల్యూమ్ నంబర్. మరియు ఇతర వివరాలను చెబితే, విన్నవారు ఆ హదీస్ కరెక్ట్‌గా ఉందా? లేదా? అని తెలుసుకోవడానికి పై పుస్తకాలలో వెతకడం సులభమౌతుంది.

ఈ 'సహీహ్', 'దయీఫ్' మొ॥న హదీస్‌లుగా నిర్ధారణ ఏ విధంగా చేయబడిందో చాలామందికి తెలియక పోవచ్చు. ఇది ప్రత్యేకమైన విషయం. ఈ **'సైన్స్ ఆఫ్ హదీస్'**ని మరో శీర్షికలో ఇన్షాఅల్లాహ్ వివరిస్తాము.

కాబట్టి ఖుర్‌ఆన్ గ్రంథం వివరణ కోసం ఖుర్‌ఆన్ గ్రంథం తరువాత ముఖ్యమైన రెండవ మూలంగా హదీస్‌లను అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

### 3. సహాబాల [ప్రవక్త(స) వారి అనుచరుల] రిపోర్ట్స్

ముహమ్మద్(స)వారి నుండి ప్రత్యక్షంగా ఆయన అనుచరులు జ్ఞానాన్ని పొందారు. దీనికి తోడు, వహీ వచ్చే సమయంలో వారికి ఆయన దగ్గర ఉండే అవకాశం కూడా కలిగింది. కాబట్టి ఖుర్‌ఆన్ వాక్య అవతరణ ఏ పరిస్థితులలో, ఏ నేపథ్యంలో జరిగిందో, వాటికి వీరు ప్రత్యక్ష సాక్ష్యులు. కాబట్టి సహజంగానే వీరు వ్రాసుకున్న స్టేట్‌మెంట్స్, ఖుర్‌ఆన్‌ని వివరించడానికి అత్యంత ప్రామాణికమైనవి గానూ, నమ్మదగినవిగానూ ఉంటాయి. అయితే ఈ అనుచరుల(రజి) తరువాతి తరం వారికి ఆ స్థానం దక్కలేదు.

ఒకవేళ ఏదైనా ఖుర్‌ఆన్ వాక్యానికి వివరణ ఖుర్‌ఆన్ గ్రంథంలోగాని లేదా హదీస్ గ్రంథాలలోగాని లభించకపోతే ప్రవక్త(స)వారి అనుచరులు వ్రాసుకున్న స్టేట్‌మెంట్స్‌కే అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

### 4. తాబియీన్‌ల రిపోర్ట్స్

ప్రవక్త(స)వారి అనుచరులు(రజి) తరువాతి తరం అనుచరులు (తాబియీన్‌లు) ఖుర్‌ఆన్ యొక్క తఫ్సీర్‌ను సహాబాల నుండి నేర్చుకున్నారు. సైన్స్ ఆఫ్ తఫ్సీర్‌లో వీరియొక్క రిపోర్ట్స్‌కు కూడా ప్రాముఖ్యత ఉంది.

### 5. అరబీ భాష

దివ్య ఖుర్‌ఆన్ అరబీ భాషలో అవతరించింది. కాబట్టి ఖుర్‌ఆన్‌ను వివరించడానికి ఆ భాషపై మంచి ప్రావీణ్యం ఉండాలి.

పైన వివరించినవి తఫ్సీర్‌కి సంబంధించి ముఖ్యమైన మూలాలు.

---

ఈ వ్యాసంలోని కొన్ని ముఖ్యమైన భాగాలు మారిఫుల్ ఖుర్‌ఆన్ నుండి గ్రహించడం జరిగింది.

## ఖుర్'ఆన్ తఫ్సీర్‌పై అపోహ

ఇంతవరకూ చెప్పిన వివరాలను బట్టి, ఖుర్'ఆన్ యొక్క తఫ్సీర్ అత్యంత సున్నితమైనదని మరియు కష్టతరమైన కార్యమని, కేవలం అరబీ భాషను తెలుసుకున్నంత మాత్రాన ఇది సాధ్యం కాదని స్పష్టమౌతుంది.

జ్ఞానానికి సంబంధించిన అన్ని శాఖలలోనూ వ్యాఖ్యాతలకి ప్రావీణ్యం ఉండాలి. కాబట్టి ఖుర్'ఆన్ వ్యాఖ్యాతలు అరబీ భాష యొక్క వాక్య నిర్మాణం, పదరూప అర్థ వివరణలు, అలంకార శాస్త్రం మరియు సాహిత్యంపై విశాలమైన మరియు లోతైన జ్ఞానం తప్పనిసరిగా కలిగి ఉండాలి.

అంతేకాకుండా వ్యాఖ్యాత, ప్రవక్త(స)వారి సాంప్రదాయాలని, ధర్మశాస్త్రానికి సంబంధించిన నియమాలని, వ్యాఖ్యానాన్ని, విశ్వాసం యొక్క తార్కిక మరియు పాండిత్య విషయాలు మొ॥న వాటిలో సరిపడినంత జ్ఞానం లేకుండా సరియైన నిర్ణయానికి రాలేడు.

అరబీ భాషలో ఖుర్'ఆన్ గ్రంథాన్ని చదవగలిగినంత మాత్రానే, ఖుర్'ఆన్ గ్రంథ వ్యాఖ్యానానికి పూనుకోవడం చాలా విచారకరమైన విషయం. ఈ ప్రమాదం ముస్లిమ్ సమాజంలో వ్యాపించింది. దీని ఫలితంగా, సాధారణ అరబీ భాషని చదవగలిగితే చాలు, ఖుర్'ఆన్ వ్యాఖ్యానంపై అభిప్రాయాలను వెలిబుచ్చడం ప్రారంభించేస్తున్నారు. అంతేకాకుండా, అరబీ భాషలో వారికున్న పరిచయం కూడా చాలా స్వల్పమైనదే! ఇంకను ఆ భాషలో చాలా ప్రావీణ్యం సంపాదించవలసి ఉంది. వారి పిచ్చి ఊహలతో ఏదో మాట్లాడుతూ, అంతటితో ఆగకుండా సాంప్రదాయక వ్యాఖ్యాతలు చేసిన వ్యాఖ్యానాలలో కూడా దోషాలు పట్టుకోవడానికి సహితం ప్రయత్నించే స్థితికి చేరుకున్నారు.

ఇంకా ఘోరమేమిటంటే కొందరు కేవలం అనువాదాలని మాత్రమే చదివి, ఖుర్'ఆన్ గ్రంథ విద్వాంసులు అయిపోయినట్లు ఊహించు కుంటున్నారు. అంతేకాకుండా కేవలం అనువాదాలపై ఆధారపడి వ్యాఖ్యానాలు కూడా వ్రాసేస్తున్నారు.

ధర్మానికి సంబంధించిన విషయాలలో ఇటువంటి ప్రవర్తన నాశనకరమైన మార్గభ్రష్టత్వానికి దారి తీస్తుందని అర్థం చేసుకోవాలి.

ప్రారంభంలో చెప్పుకున్నాం: ఓ వ్యక్తికి ఇంగ్లీష్ బాగా చదవడం వచ్చు, అతను మెడికల్ బుక్స్‌ను సునాయాసంగా చదివేయవచ్చు. కాని అవి అతనికి ఏమీ అర్థం కావు, ఎందుకంటే అతనికి సైన్స్ గురించి అవగాహన లేదు.

అతని చేతిలో మెడికల్ బుక్ చూసి, అతనిని డాక్టర్‌గా నమ్మి ట్రీట్‌మెంట్ తీసుకుంటే నష్టపోయేది ప్రజలే. ఈ వైద్య శాస్త్రంలో జాయిన్ కావడానికి, మెడికల్ డిగ్రీ సంపాదించడానికి ఎంత కష్టపడాలో మీకు తెలియనిది కాదు. అదే విధంగా ఏ సబ్జక్టులోనైనా ప్రావీణ్యం సంపాదించాలంటే ఆ సబ్జక్టుకు సంబంధించిన టీచర్ల పర్యవేక్షణలో ఎంతో శిక్షణ పొందాలి. అలాగే ఇస్లామీయ ఇల్మ్ కోసం ఎన్నో సంవత్సరాలు విద్వాంసుల దగ్గర శిక్షణ పొందవలసి ఉంది.

భాషపై సరియైన జ్ఞానం లేనివాడు అనువాదంగాని, వ్యాఖ్యానం గాని చేస్తే ఎలా హాస్యాస్పదంగా ఉంటుందో తెలుసుకోవడానికి క్రింది సంఘటనను చదవండి.

ఆంధ్రాయూనివర్శిటీలో ఓ సైన్స్ కాన్ఫరెన్స్ భోజన విరామ సమయంలో, హాజరైన ప్రొఫెసర్లలోని కొందరు గతస్మృతులను గుర్తు చేసుకుంటూ, సరదాగా మాట్లాడుకుంటుండగా ఇంగ్లీష్ భాషకు సంబంధించి ఓ జోక్‌ను వినడం జరిగింది.

అందులోని ఒకాయన చెబుతున్నాడు : 'నేను మా స్నేహితులతో కలిసి ఓ విషయంపై చర్చిస్తున్నాను (Discuss చేస్తున్నాను). చర్చ ముగిసింది. చివరిలో 'There is no room for discussion' అని చెప్పాను. వెంటనే అక్కడున్న వారిలో ఒకతను room (గది) ఎందుకు లేదు? ప్రక్క గది ఖాళీగానే ఉంది కదా! అని అన్నాడు.' అది విని అందరూ విరగబడి నవ్వారట.

'There is no room for discussion' అంటే 'చర్చించడానికి ఏమీ లేదు' అనే భావంతో వాడబడింది. అంతేగాని భాషాపరమైన అర్థాన్ని తీసుకుని "చర్చించడానికి గది లేదు" అని అంటే ఆ భాషగురించి తెలిసినవారు నవ్వుతారు కదా!

ఇంగ్లీష్ భాషలోనే కాదు. ఏ భాషలోనైనా ఇటువంటివి ఉంటాయి. ఇక ఖుర్'ఆన్ మరియు హదీస్ విషయాలకొస్తే, వాటిలో నిగూఢంగా చాలా విషయాలుంటాయి.

ఉదాహరణకు క్రింది విషయాన్ని చదవండి :

"ముస్లిం ఏ దుస్తుల్లో మరణిస్తే ఆ దుస్తులతోనే లేపబడతాడు" అనే విషయాన్ని మరోలా అర్థం చేసుకుని అబూసయీద్ ఖుద్రీ(రజి) వారు తన మరణ సమయంలో కొత్త బట్టలను తొడుక్కున్నారట. ఆ విషయం తెలిసిన ఆయిషా(రజి)వారు ఈ వాక్యంలోని "దుస్తులు" అంటే కర్మలు (ఆచరణలు) అని తెలియజేశారు.

తీర్పుదినం నాడు బట్టలు లేకుండా అందరూ నగ్నంగా లేపబడతారనే బోధనను గుర్తుచేశారు.

ఖుర్'ఆన్ వాక్యాలలో, అతి తక్కువ పదాలలో, ఎంతో ఎక్కువ విషయాలనుంచారు అల్లాహుతాలా.

ఖయామత్ (ప్రళయం) వచ్చేవరకూ కూడా ఖుర్'ఆన్ గ్రంథం ఆచరణ యోగ్యమైనదిగా అల్లాహుతాలా చెప్పారంటే, అన్ని కాలాలలోనూ ఈ ఆయత్‌లు ఆయా కాలమాన పరిస్థితులకు సరిపోయేలాంటి అర్థాలను కలిగి ఉంటాయి. అరబీ భాష చాలా గొప్పది. ఆ అరబీ భాషను ఖుర్'ఆన్ గ్రంథంలో ఉపయోగించుకున్న తీరు అమోఘం.

నేను 20 సం॥ల నుండి ఈ ఫీల్డ్‌లో ఉన్నాను లేదా 40 సంవత్సరాల నుండి ఈ ఫీల్డ్‌లో ఉన్నాను, నాకు తెలుసా? నీకు తెలుసా? అంటూ అహంకార ధోరణిలో మాట్లాడటం ఈ రోజుల్లో సామాన్యమై పోయింది.

రాజకీయ నాయకుల అసత్యపు మాటలకు ముగ్ధులయ్యేవారున్నారు. కాబట్టి బాగా మాట్లాడగలిగే వక్త వ్యాఖ్యానం చేసినంత మాత్రాన అది కరెక్ట్ అయిపోదు. జ్ఞానం కలవారు చేసిన వ్యాఖ్యానమే సరియైనది.

**(మిగతా భాగం 13వ పేజీలో)**

మంచిగా మానవత్వంతో బ్రతకమనే హితబోధను ప్రతి మనిషి తన ఊహతెలిసిన దగ్గరనుండి వింటూనే ఉంటాడు. అయితే ఏది మంచి? ఏది చెడు? కొంతమంది తమ దృష్టిలో ఫలానా విషయం మంచిది అని సమర్థిస్తారు. అదే విషయాన్ని మరికొందరు పూర్తి చెడుగానూ తీసుకుంటారు. అంతెందుకు, ఒకే మనిషిలో ఒకే పనిపై, తన జీవితంలోని వివిధ దశలలో వేర్వేరు అభిప్రాయాలు జనిస్తాయి. నిజంగా మంచి చెడులపై మనుషులయొక్క వ్యక్తిగత అభిప్రాయాలనే గనుక పరిగణనలోకి తీసుకుంటే, అన్ని పనులూ మంచి పనులే. అలాగే అన్నీ కూడా చెడ్డపనులే అవుతాయి.

కేజీ బరువున్న వస్తువును, ప్రపంచంలో ఎక్కడకు తీసికెళ్లినా అది కేజీ బరువే ఉంటుంది. అలాగే కొలతలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకటే ప్రమాణముంది.

మరి మనిషి జీవనానికి లేదా ఆచరణకు ప్రపంచవ్యాప్తంగా అలాంటి ఓ ప్రమాణం లేదా? ప్రపంచంలోని ఏ మారుమూలనుండి ఏ వ్యక్తిని తీసుకున్నా, అతని శారీరక నిర్మాణం, అతని అవయవాల పనితీరు తదితర అంశాలన్నీ మిగతా ప్రాంతాలలోని మనుషులలాగే ఒకే విధంగా ఉంటాయి కదా!

మనిషి అనే ఈ జీవయంత్రాన్ని తయారుచేసి, దానికి అవసరమైన ప్రోగ్రామింగ్‌ను చేసిన సృష్టికర్తకే తెలుసు - ఈ మనిషికి ఏది మంచి చేస్తుందో, ఏది చెడు చేస్తుందోనన్న విషయం.

మంచి చెడుల ప్రమాణాలు ఖుర్ఆన్‌లో ఉన్నాయి. అయితే ఆ ప్రమాణాల ప్రకారంగా ఎటువంటి సందేహానికి లోనవకుండా ఉండేందుకు ముహమ్మద్(స) మనందరి శిక్షణకై ఎన్నో విషయాలను ఆచరించి చూపారు. ఖుర్ఆన్ యొక్క ఆదేశాల ప్రకారంగా దైవప్రవక్త ముహమ్మద్ (స)ఆచరించిన పనులను మరియు ఆయన యొక్క ప్రవచనాలను హదీస్‌లు అంటారనే విషయం చాలామందికి తెలుసు. సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వేల సంఖ్యలో ఉన్న హదీసులలోని కొన్ని హదీసులను ఎన్నుకొని ఈ శీర్షిక ద్వారా ఇన్షాఅల్లాహ్ అందిస్తూ ఉంటాము.

**ప్రారంభ సంచికలో సుందర సమాజ స్థాపనలో 'విద్య' యొక్క ప్రాముఖ్యతను ముహమ్మద్(స) బోధనల ద్వారా వివరించడం జరిగింది. ఆ బోధనలను అర్థం చేసుకుని, ముస్లిములు తొలి యూనివర్శిటీ స్థాపకులుగా, ఆధునిక సైన్స్‌కి వ్యవస్థాపక శాస్త్రవేత్తలుగా ఉన్నతస్థితికి చేరుకున్నారు. ఆ పూర్వ వైభవం మరలా రావాలంటే హదీసు జ్ఞానమెంత అవసరమో తెలియజేయడం జరిగింది. క్రిందటి నెల ఎన్నుకున్న విషయం 'వడ్డీ'. సమాజాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో 'విద్య'కు ఎంత ప్రాముఖ్యత ఉందో, సమాజాన్ని సర్వనాశనం చేయగల సామర్థ్యం అంతకంటే ఎక్కువగా 'వడ్డీ'కి ఉంది.**

3

# వడ్డీ / అధర్మ సంపాదన (గత సంచిక తరువాయి)

ఈ వడ్డీ అనేది ప్రపంచ ఆర్థికాభివృద్ధికి గ్యారంటీ ఇస్తుందా? ఇది లేకపోతే ఆర్థిక చైతన్యం నాశనమైపోతుందా?

ఇది లేకుండానే ఆర్థిక సమస్యలను పరిష్కరించగలం. అంతే కాకుండా ప్రపంచ ఆర్థిక శాంతి అనేది ఈ వడ్డీని తొలగించడం వలన సాధ్యమౌతుందని కూడా చెప్పవచ్చు. వడ్డీ అనేది ప్రపంచ ఆర్థిక దుస్థితికి అతి ముఖ్య కారణం.

ఏదైనా ఓ నేరానికి ఒక వ్యక్తిపైగాని లేదా వర్గంపైగాని అల్లాహ్ దగ్గర నుండి శిక్షపడితే, ఆ శిక్ష ఆ నేరానికి సరిపోయేటట్లు గానే ఉంటుంది. కాబట్టి తీర్పుదినాన వడ్డీ తిన్నవారిని స్పృహ లేకుండా (without sense) లేపుతారంటే, అది ఇక్కడ ఓ సారూప్యాన్ని సూచిస్తుంది.

వడ్డీ తినేవారి పరిస్థితి ఈ లోకంలో 'డబ్బుపై ఉండే దురాశ' అనే మద్యాన్ని త్రాగినట్లు కాదా? వడ్డీ తీసుకునేవాడు పేదవారిపై దయ చూపడు, అలా ఎందుకు చేస్తున్నాడో ఎవని ముందూ సిగ్గు పడడు. అంటే ఈ ప్రపంచంలో తన జీవిత కాలమంతా నిజంగా అతను స్పృహ (sense) లేకుండానే గడిపాడు. అందుకనే తీర్పుదినాన అదే విధంగా స్పృహ (sense) లేకుండా లేపబడతాడు. వడ్డీ కూడా వ్యాపారం లాంటిదేనని ప్రకటించిన దానికి ఫలితంగా, వివేకాన్ని కోల్పోయిన వాడిగానే లేపబడతాడు.

ఇక్కడ వడ్డీ తినడం అంటే, అది తిండి, బట్ట, నివాసం మరియు వాటిని సమకూర్చుకోవడానికి వడ్డీ సొమ్మును ఉపయోగించడం కావచ్చు.

కాని మనమేదైనా పదార్థాన్ని తింటే, దానిని మరలా అదే రూపంలో వెనక్కి తీసుకోవడం జరుగదు. కాని మిగిలినవి వెనక్కి తీసుకునే

అవకాశముంది. కాబట్టి మొత్తం స్వాధీనంలో ఉంచుకోవడం మరియు గుత్తాధిపత్యాన్ని 'తినడం'గా చెప్పబడింది.

వడ్డీ తినేవారి యొక్క రెండు నేరాల గురించి చెప్పబడింది.

1. నిషేదించబడిన దానిని తినడం 2. నిషేధించబడిన దానిని న్యాయ సమ్మతమైనదిగా ప్రకటించడం. వ్యాపారంలో కొనడం, అమ్మడం వలన పొందిన లాభమెలాగో, అలాగే వడ్డీ కూడా అని చెబుతారు. వ్యాపారాన్ని నిషేదించనప్పటికినీ, వడ్డీ నిషేధమైతే వ్యాపారం కూడా నిషేధం కావాలి కదా! అని అంటారు.

వడ్డీ అనేది వ్యాపారం కాదు. అవి రెండూ పూర్తిగా భిన్నమైనవి. వ్యాపారం హలాల్, వడ్డీ హరామ్. ఎలా రెండూ సమానమౌతాయి?

రెండూ కూడా లాభం కోసమే కదా! అని వారు వాదిస్తారు. కాని ఇక్కడ తెలుసుకోవలసిన ముఖ్యవిషయ మేమిటంటే, అల్లాహ్ ఏదైనా ఓ పనిని 'హరామ్' అని అంటే, అందులో నష్టంగాని లేదా హాని గాని లేదా చెరుపుగాని ఉండవచ్చు అని తెలుసుకోవాలి. అది మనం కనుగొనలేకపోవచ్చు.

ఉదాహరణకు అక్క కూతురుని 'ఇస్లాం' ధర్మం ప్రకారం పెళ్లి చేసుకోకూడదు. ఇటువంటి మేనరికపు పెళ్ళిల్లను ఇస్లాం నిషేధించింది. ఎందుకు చేసుకోకూడదు? తప్పేంటి? నష్టమేమిటి? అని ఆ కాలంలో అడిగినా, క్రిందటి శతాబ్దంలో అడిగినా సరే ఆ ప్రశ్నకు సరియైన సమాధానమొకటే : అల్లాహ్ నిషేధించారు. అంతే! అందులో ఏదో నష్టముంది.

కాని ఈ రోజు డాక్టర్లు మేనరికపు వివాహాలను చేసుకోవద్దని, అలా చేసుకోవడం వలన అంగవైకల్యంతో పిల్లలు పుడతారని హెచ్చరిస్తున్నారు. అలా వివాహం చేసుకుని, వైకల్యంతో నున్న పిల్లలను కన్న ఎందరో దంపతులు, తన పిల్లలను చూసుకుని బాధపడుతున్నారు.

కాబట్టి ఓ విషయాన్ని అల్లాహ్ నిషేధించారంటే, ఆ విషయంలో ఏదో కీడు ఉందని తెలుసుకోవాలి.

ఓ వ్యక్తికో లేదా ఓ వర్గానికో అల్లాహ్ నిషేధించిన ఓ విషయం మేలుగా కనిపించవచ్చు. కాని జాతియొక్క లేదా దేశం యొక్క దృక్కోణంలో చూస్తే, అదే విషయం హానికరం కావచ్చు.

వడ్డీ ద్వారా వచ్చే లాభాన్ని అల్లాహ్ తుడిచేస్తాడు. శుభాన్ని దూరం చేస్తాడు. కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం, ఇది పరలోకానికి సంబంధించినది.

అయినప్పటికిని ఈ ప్రపంచంలో కూడా వాటి ఆనవాళ్ళని గమనించవచ్చు. గత సంచికలో నిజజీవితంలో జరిగిన కొన్ని అనుభవాలను చెప్పడం జరిగింది.

ఏ సొమ్ములో వడ్డీ కలిసి ఉందో, కొన్నిసార్లు ఆ వడ్డీతోపాటు మొత్తం సొమ్ము కూడా పోతుంది.

మనకు సాధారణంగా కనిపించే విషయమేమిటంటే వడ్డీ మార్కెట్స్ అయిన స్టాక్ మార్కెట్స్‌లో నిన్నటి కోటీశ్వరులు, ఈ రోజు దివాళాతీసిన వాళ్లు అవుతున్నారు.

వడ్డీని తీసుకోని వ్యాపారాలలో కూడా లాభనష్టాలు రావడం సహజమే! అందులో ఎటువంటి సందేహమూ లేదు. కాని వడ్డీ తీసుకోని వ్యాపారాలలో, ఒక్క రోజులోనే కోటీశ్వరుడు బిచ్చగాడుగా మారడం జరుగదు. ఇది వడ్డీ మార్కెట్స్‌లో మరియు స్టాక్ ఎక్స్చేంజీలలోనే జరుగుతుంది.

అనుభవజ్ఞులు, జ్ఞానులు చెప్పేదేమిటంటే, వడ్డీ ద్వారా సంపద చాలా వేగంగా మరియు ఎక్కువగా అభివృద్ధి చెందుతుందిగాని, సాధారణంగా అది ఎక్కువకాలం వారి పిల్లలద్వారా, మనుమళ్ళ ద్వారా నిలబడదు.

ఒకొక్కసారి ఆ సంపద భౌతికంగా నాశనం కాకపోవచ్చు గాని, ఒకటి మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు. దానివలన కలిగే మేలు, ఉపయోగాలు, శుభాలు మాత్రం దూరమౌతాయి.

వడ్డీ వలన సంపద పెరుగుతుంది. నిజమే! కాని అది ఎలా పెరుగుతుంది అంటే మనిషి శరీరం జబ్బు వలన ఎలా ఉబ్బుతుందో అలాగన్నమాట. ఆ విధంగా ఉబ్బడం మంచిది కాదని, అది చావుకు దారితీస్తుందని జ్ఞానమున్న ఏ వ్యక్తికయినా తెలుసు.

అదే విధంగా వడ్డీ తినేవాడి సొమ్ము ఎంత పెరిగినా కూడా ఎప్పటికీ ఆ సంపద ద్వారా వచ్చే ఫలాలను, గౌరవాన్ని పొందలేడు.

కాని వారికి ఉండే వసతులు (సౌకర్యాలు) మరియు వారు అనుభవించే స్టేటస్ (హోదా) చూసి ఎవరికైనా సందేహం రావచ్చు. వారికి విలాసవంతమైన భవనాలు, ప్రతీ లగ్జరీని కొనగలగడం, నౌకర్లు, తినడానికి, త్రాగడానికి, పడుకోవడానికి మంచి వసతులు - అవసరమైనవి అనవసరమైనవి అన్నీ కలగలిపి ఒకటిగా ఉంటాయి.

సౌకర్యాన్ని కలుగజేసే వస్తువులు ఫ్యాక్టరీలలో తయారుచేయబడ్డాయి మరియు మార్కెట్లలో అమ్మబడుతున్నాయి. కాని సుఖం, శాంతి, పరమానందం అనేవి ఏ ఫ్యాక్టరీలలోనూ తయారు చేయబడవు మరియు వాటిని డబ్బుతో మార్కెట్లో కొనలేము.

ఇవి మరేమిటో కాదు అల్లాహ్ నుండి ప్రత్యేకంగా పొందే కరుణ వలన లభించినవే!

సరే! సుఖనిద్ర గురించి ఆలోచించండి. సుఖనిద్రకోసం పడుకోవడానికి వీలుగా ఉండే ఇల్లు, గాలి, వెలుతురు, చల్లదనం, వెచ్చదనం, అందమైన ఫర్నిచర్, మంచం, పరుపు, దిండ్ల యొక్క ఖచ్చితమైన అమరిక మొ॥వి అన్నీ ఉన్నాయి.

కాని వీటి ద్వారా ఖచ్చితంగా సుఖనిద్ర పడుతుందని చెప్పగలమా?

చాలామంది వ్యాధుల వలన సుఖంగా నిద్రపోలేరు. అమెరికాలో 70 శాతం మంది నిద్రమాత్రలు వేసుకోవలసి వస్తుంది. ఒకొక్కసారి

అవి కూడా పనిచేయవు.

నిద్రపోవడం కోసం సామాన్లనయితే మార్కెట్లో కొనుక్కోవచ్చుగాని **ఎంత ఖర్చు చేయగలిగినా నిద్రను కొనలేం కదా!**

కాబట్టి వడ్డీ తినేవారు నిజమైన సుఖశాంతులను పొందలేరు. వారు ఎంత మత్తులో పడతారంటే, 10 మిలియన్ల సంపాదనను 15 మిలియన్లుగా మరియు 15 మిలియన్లని 20 మిలియన్లుగా చేయడంలో వారికి తినడానికి, బట్టలు వేసుకోవడానికి, ఆఖరికి వారి భార్యాబిడ్డలతో గడపడానికి కూడా సమయం ఉండదు. వారికి ఫ్యాక్టరీలుండవచ్చు, నౌకలుండవచ్చు. కాని రాత్రి పగలు ఆతృత మీద ఆతృతలు. వాటితోనే పడుకోవడం, వాటితోనే నిద్ర లేవడం.

పాపం వీరి పరిస్థితి ఎంత ఘోరంగా (terrible) ఉంటుందంటే, వీరు నిజమైన సుఖానికి మరియు ఆ సుఖాన్ని కలిగించే వస్తువులకూ మధ్యనున్న తేడా కూడా తెలుసుకోలేనంతగా అయోమయంలో పడి ఉంటారు.

వారికి ప్రజలలో మంచి పేరుండదు. వారిని చాటున ప్రజలు తిట్టుకుంటారు. పరాన్న జీవులుగా పేదవాడి రక్తాన్ని పీల్చే వారికి సమాజంలో గౌరవం ఉండదు. ఇలాంటి వారికి, పేదలకు మధ్య జరిగిన సంఘర్షణలలో పుట్టినవే సోషలిజం, కమ్యూనిజం లాంటి సిద్ధాంతాలు.

ప్రజల రక్తాన్ని పీల్చి బలవంతులైన వారిని చూసి వారు ఎంత ఆరోగ్యంగా ఉన్నారో అని భావించడానికి బదులు, వారి వలన చిక్కిశల్యమైన వారిని చూస్తే, అసలు పరిస్థితి అర్థమౌతుంది. ఇలాంటి పరిసరాలలో సంతోషం ఉండదు.

సూరహ్ బఖరాలోని ఆయత్ 276ని బట్టి ఈ వడ్డీని హరామ్‌గా భావించని వాడు కుఫ్ర్ (అవిశ్వాసం)లోకి పోతాడు. ఇది హరామ్ అని తెలిసినా, అందుకు పాల్పడేవాడు పాపాత్ముడు, ఆజ్ఞలను ఉల్లంఘించినవాడు లేక ఫాసిక్ అవుతాడు.

**ఈ వ్యాసంలోని కొన్ని ముఖ్యమైన భాగాలు మారిఫుల్ ఖుర్ఆన్ నుండి గ్రహించడం జరిగింది.**

---

**వచ్చే సంచికలో ఓ మంచి శుభవార్తను వినిపించే హదీస్‌ను, ఆ హదీస్ వివరణకై ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వాస్తవ సంఘటనల ద్వారా వివరణను ఇన్షా అల్లాహ్ అందిస్తాము.**

---

## హదీస్‌లపై అపోహలు 1

హదీస్‌లను తెలుగులో అనువదించినప్పుడు జరిగిన పొరపాట్లు వలన గాని (లేదా) హదీస్‌ను అనువదించే వ్యక్తి యొక్క జ్ఞానపరిధి తక్కువ కావడం వలన గాని ప్రామాణిక హదీస్ గ్రంథాలపై కొందరి మనస్సులలో 'అపోహలు' చోటుచేసుకుంటున్నాయి.

విద్యార్థికి ఏదైనా సందేహం వస్తే, టీచర్‌ని అడుగుతాడు. మరీ వెనుకబడిన స్టూడెంట్ అయితే ట్యూషన్‌లో జాయినవుతాడు. ఇదంతా ప్రాపంచిక జ్ఞానం కోసం. ఇది కూడా చాలా ముఖ్యమైనదే.

ఇక ధార్మికజ్ఞాన విషయానికి వస్తే, ఏదైనా ధార్మిక విషయం అర్థం కానప్పుడు ఆ విషయంలో మంచి జ్ఞానమున్న ఆలిమ్ దగ్గరకి వెళ్ళి సందేహాన్ని తీర్చుకోవాలి. కాని ఆ పనిచేయడం లేదు. ధార్మికజ్ఞానం అంటే అంత చులకన అయిపోయింది. తనకు తోచినదే కరెక్ట్ అనుకుంటున్నారు.

ధార్మిక జ్ఞానమైనా, ప్రాపంచిక జ్ఞానమైనా పొందాలంటే అటువంటి జ్ఞానం గల వారి దగ్గర విద్య నభ్యసించాలి. ఎంతో శ్రమించాలి.

మా దృష్టికి వచ్చిన అపోహలను కొన్నింటినైనా ఇన్షా అల్లాహ్ ఈ శీర్షిక ద్వారా తొలగించాలని, చేస్తున్న ఓ చిన్ని ప్రయత్నమే ఈ వ్యాసం.

విశ్వాసుల మాతృమూర్తి యొక్క జీవిత చరిత్రను తెలియజేస్తూ ఓ పుస్తకం తెలుగులో ప్రచురితమైంది. ఆ పుస్తకంలో ఓ హదీస్ రెండు చోట్ల కన్పిస్తుంది. ఆ హదీస్‌ను చదివాక, అది నమ్మశక్యంగా అనిపించ లేదు. అలాంటి మాటలను విశ్వాసుల మాతృమూర్తి ఎలా అనగలరు? అనే సందేహంతో, అరబీలో నున్న ఒరిజినల్ బుఖారీ హదీస్‌ను చదివితే, ఆ అనువాదం తప్పు అని తెలిసింది.

ఆ పుస్తకంలో 2 చోట్ల ఇచ్చిన ఆ హదీస్‌ను క్రింద అందిస్తున్నాము. వారు సహీహ్ బుఖారీ అని బ్రాకెట్లో ఇచ్చారు.

> "ఒకసారి హజ్రత్ ఆయిషా(రజి)కు తలనొప్పి వచ్చింది. దైవ ప్రవక్త(స)కు ప్రాణాంతక వ్యాధి మొదలయింది. ఆయన(స) సెలవిచ్చారు. "ఒకవేళ నీవు నా కంటే ముందు చనిపోతే నేను స్వయంగా నీ గుసుల్ చేయిస్తాను. నా చేతుల మీదుగా అంత్యక్రియలు జరిపిస్తాను. నీ కోసం దుఆ చేస్తాను". దీనికి జవాబుగా ఆమె "దైవప్రవక్తా! ఒకవేళ అదే గనక జరిగితే మీరు **ఈ గదిలోనే కొత్త భార్యను తెచ్చి ఉంచుతారు**" అని హజ్రత్ ఆయిషా(రజి) అన్నారు. దైవప్రవక్త(స) ఇది విని **చిరునవ్వు నవ్వారు.** (సహీహ్ బుఖారీ)

అదే పుస్తకంలో 2వ చోట ఇలా ఉంది:

> "ఒకరోజు దైవప్రవక్త(స) హజ్రత్ ఆయిషా(రజి) కుటీరంలోకి విచ్చేశారు. ఆమె విపరీతమైన తలనొప్పితో మూలుగుతున్నారు. "నా కంటే ముందు నీవు చనిపోతే నా చేతులమీదే నీకు అంత్యక్రియలు జరిపించేవాణ్ణి" అని దైవప్రవక్త(స) చెప్పారు. దానికి హజ్రత్ ఆయిషా(రజి) ఎటువంటి దాపరికం లేకుండా "చాల్లెద్దురూ! అదే గనక జరిగితే మీరు **ఈ కుటీరంలోకి మరో కొత్త భార్యను పెళ్ళాడి తెచ్చుకుంటారు. అంతేగా**" అని బదులిచ్చారు. ఆయన(స) తన తలపై చెయ్యి వేసుకుని "అబ్బా, నా తల" అన్నారు.

ఈ హదీస్ యొక్క దారుస్సలామ్ (సౌదీ)వారి ఇంగ్లీష్ అనువాదాన్ని మరియు ఒరిజినల్ అరబీ హదీస్‌ను గమనించండి.

Narrated Al-Qasim bin Muhammad: Aisha (complaining of headache) said, *"Oh, my head!"* Allah's Messenger.... said, ***"I wish that had happened while I was still living, for then I would ask Allah's forgiveness for you and invoke Allah for you"***. Aisha said, *"Wa thuklayah! By Allah, I think you want me to die; and if this should happen, you would spend the last part of the day sleeping with **one of your wives!**"* The Prophet .... said, *"**Nay**, I should say "Oh my head" I felt like sending for Abu Bakr and his Son, and appoint him as my successor lest some people claimed something or some others wished something*, but then I said (to myself), Allah would not allow it to be otherwise, and the muslims would prevent it to be otherwise". (**Sahih Bukhari**, No. **5666**, Vol. 7, Page No.319, Darussalam, KSA)

حَدَّثَنَا يَحْيَى بْنُ يَحْيَى أَبُو زَكَرِيَّا : أَخْبَرَنَا سُلَيْمَانُ بْنُ بِلالٍ، عَنْ يَحْيَى بْنِ سَعِيدٍ قَالَ: سَمِعْتُ الْقَاسِمَ بْنَ مُحَمَّدٍ قَالَ: قَالَتْ عَائِشَةُ: وَا رَأْسَاه، فَقَالَ رَسُولُ اللهِ ﷺ : ((ذَاكِ لَوْ كَانَ وَأَنَا حَيٌّ فَأَسْتَغْفِرَ لَكِ وَأَدْعُوَ لَكِ))، فَقَالَتْ عَائِشَةُ: وَاثُكْلَيَاهْ، وَاللهِ إِنِّي لَأَظُنُّكَ تُحِبُّ مَوْتِي، وَلَوْ كَانَ ذَلِكَ، لَظَلِلْتَ آخِرَ يَوْمِكَ مُعَرِّساً بِبَعْضِ أَزْوَاجِكَ. فَقَالَ النَّبِيُّ ﷺ :((بَلْ أَنَا وَا رَأْسَاهْ، لَقَدْ هَمَمْتُ - أَوْ أَرَدْتُ - أَنْ أُرْسِلَ إِلَى أَبِي بَكْرٍ وَابْنِهِ فَأَعْهَدَ، أَنْ يَقُولَ الْقَائِلُونَ أَوْ يَتَمَنَّى الْمُتَمَنُّونَ، ثُمَّ قُلْتُ: يَأْبَى اللهُ وَيَدْفَعُ الْمُؤْمِنُونَ، أَوْ يَدْفَعُ اللهُ وَيَأْبَى الْمُؤْمِنُونَ))

**మీ భార్యలలో ఒక భార్య అని అన్నారుగాని, కొత్త భార్య అనే పదం హదీస్‌లో లేదు. ముహమ్మద్(స)వారు చిరునవ్వు నవ్వలేదు. ఆమె(రజి) మాటలను ఖండించారు.**

పై హదీస్ తెలుగు అనువాదంలో కొత్త భార్య అనే పదం ఎలా వచ్చిందో తెలియదు.

విశ్వాసుల మాతృమూర్తి ఆయిషా(రజి)వారు చనిపోగానే అదే రోజు మరో పెళ్ళి చేసుకుంటారా? ఈ అనువాదాన్ని చదివినవారు, ఈ హదీస్ అనువాదాన్ని నిజమని నమ్మితే, ముహమ్మద్(స)వారు ఒక భార్య చనిపోయిన వెంటనే, అదే రోజు మరో పెళ్ళి చేసుకుంటారనే భావం వారికి కలుగుతుంది. ఆయన(స) యొక్క శీలాన్ని తప్పుగా అర్థం చేసుకుంటారు.

ముహమ్మద్(స)వారు ఒకరికంటే ఎక్కువ పెళ్లిల్లు ఎందుకు చేసుకున్నారూ, వాటి వెనుక నున్న సదుద్దేశ్యమేమిటో, అది ముస్లిమ్ సమాజానికి ఎలా మేలు చేసిందో మొ॥న విషయాలను మేము అందజేయబోయే ముహమ్మద్(స)వారి పుస్తకంలో వివరంగా తెలియజేశాము.

భార్య జనాజా నమాజ్ పూర్తయ్యాక, భర్త ఎక్కడికి వెళతారు? తన ఇంటికే కదా! ఒక రోజు ఒక భార్య దగ్గర, తరువాత రోజు రెండవ భార్య దగ్గర అలా వంతులు ప్రకారంగా భార్యలతో కాపురం చేసేవారు ముహమ్మద్(స). కాబట్టి ఆ రోజు కూడా వంతు ప్రకారం ఏ భార్య ఇంటిలో ఉండాలో ఆ భార్య ఇంటికే కదా వెళతారు. కాబట్టి ఆ రోజు లోని ఆఖరిభాగం మీ భార్యలలోని ఒక భార్య దగ్గర గడుపుతారు అని అన్నారు. ముహమ్మద్(స)వారు ఆ మాటలను వెంటనే కాదు అని ఖండించారు. అంతేగాని చిరునవ్వు నవ్వలేదు. ఇలా అనువదించడం చాలా ఘోర తప్పిదమే!

ముహమ్మద్(స) వారు అల్లాహ్ యొక్క సందేశహరులు మాత్రమే కాదు, తన భార్యలకి భర్త కూడా. ముహమ్మద్(స)వారి మాటలు ఎప్పుడూ ఆణిముత్యాలే! పై హదీస్‌ను భార్యాభర్తల మధ్య జరిగిన సంభాషణగా చదవాలి. అంతేకాకుండా చాలా సందర్భాలలో 'ఆయిషా'(రజి)వారు తొందరపాటుతో మాట్లాడటం, ఆ తరువాత పొరపాటు తెలుసుకుని పశ్చాత్తాప పడినట్లు ఉల్లేఖనాలున్నాయి. భార్యాభర్తల మధ్య అలకలు, భార్యల మధ్య పోటీ, అసూయలు సహజం.

కోపంతో ఉన్నప్పుడో, అనారోగ్యంతో చిరాకుగా ఉన్నప్పుడో భర్తను ఏదో ఒకటి అనడం, ఆ తరువాత అలా అన్నందుకు బాధపడటం సహజమే! వీరిద్దరూ భార్యాభర్తలు అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ హదీస్‌ను అర్థం చేసుకోవాలి.

సాధారణంగా ఎవరైనా సగటు మనిషి, తన జీవితంలోని చివరి దశలో ఉంటే ఒకటే బెంగ ఉంటుంది. నా తరువాత నా కుటుంబాన్ని ఎవరు చూసుకుంటారు? నా భార్యాబిడ్డల గతి ఏమిటి? ఇలాంటి ఆలోచనలతో మానసిక వేదనకు గురవుతాడు. కాని అదే సమయంలో, అటువంటి బెంగ పడనవసరం లేదని, ఆ బాధ్యత మాదేనని ఎవరైనా అతనికి నమ్మకాన్ని కల్గించి చెబితే, మానసికంగా హాయిని ఫీలవుతాడు. ఇది సగటు మనిషికి సంబంధించిన విషయం.

ఇదే పరిస్థితి ఒక ముస్లిమ్‌కి ఎదురైతే, తనను అల్లాహ్ క్షమిస్తారా? అల్లాహ్ యొక్క కరుణను నేను పొందగలనా? మరిన్ని మంచిపనులు చేసి అల్లాహ్ యొక్క అనుగ్రహాన్ని పొందే అవకాశం నాకు ఇక లేదేనన్న ఆలోచనతో ఉంటాడు.

క్షమాపణ దొరుకుతుందని అతనికి పూర్తి నమ్మకం కలిగితే, అతని శారీరక బాధ అతనికి తెలియకుండా, ఆ బాధను మానసిక ప్రశాంతత డామినేట్ చేస్తుంది. ఆ శారీరక బాధను మనస్సు మైమరపిస్తుంది.

పై హదీస్‌లో ముహమ్మద్(స)వారు అల్లాహ్‌ను క్షమించమని కోరతానని, ఆమె కొరకు అల్లాహ్‌కు దువా చేస్తానని చెప్పారు. ప్రవక్త(స)వారి దువా స్వీకరించబడుతుందని తెలిసిన విషయమే!

ఆమె అప్పుడు తలనొప్పి చిరాకులో ఉన్నారు. ఆమె ఎలాంటి పరిస్థితులో ఉన్నారో ముహమ్మద్(స)వారికి తెలుసు. ఆమె మాటలని సున్నితంగా ఖండించారు కూడా. చిరునవ్వు నవ్వలేదు. ఏ ముస్లిమ్ అయినా, తన భార్య చిరాకులో, విపరీతమైన బాధలో ఏదైనా ఓ మాట అంటే, సున్నితంగా ఖండించాలని కూడా పరోక్షంగా ఈ హదీస్ తెలియజేస్తుంది.

ముహమ్మద్(స)వారి కుమారుడు ఇబ్రహీమ్ (హదీస్ నెం. 1303, సహీహ్ బుఖారీ), కుమార్తె (హదీస్ నెం. 1285, సహీహ్ బుఖారీ) చనిపోయినప్పుడు, ముఖ్య అనుచరులు జైద్(రజి), జాఫర్(రజి), అబ్దుల్లా(రజి) షహీద్‌లైనప్పుడు (హదీస్ నెం. 1246, సహీహ్ బుఖారీ) ఆయన కళ్ళ వెంట అశ్రువులు జారాయి. ఆరోజు ఆయన విచారంతో గడిపారు. తల్లి సమాధిని చూడగానే కన్నీళ్లు వచ్చాయి. తన మొదటి భార్యతో 25 సంవత్సరాల పాటు కాపురంచేసి, ఆమె బ్రతికుండగా రెండోపెళ్ళి చేసుకోకుండా, ఆమె మరణించాక కూడా, ఆమెను గురించి మాట్లాడినప్పుడు ఆమెపై ఆయనకు ప్రేమ మాత్రమే కాకుండా, ఎంతో గౌరవముండేదన్న విషయం తెలుస్తుంది. ఇలాంటి ఉత్తముడు మరియు అనుచరులు షహీద్‌లైతేనే విచారవదనులైన ముహమ్మద్(స)వారు తన ప్రియమైన భార్య 'ఆయిషా(రజి)'వారు మరణిస్తే, ఏ విచారం లేకుండా సంతోషంతో పెళ్లిచేసుకుని ఓ కొత్త భార్యను తీసుకొస్తారా?

అనువాదాలలో పొరపాట్లు జరుగవచ్చు. కాని ఇలాంటి ఘోరతప్పిదాలు మాత్రం క్షమించరానివి. అనువదించేటప్పుడు ఓ సారి ఒరిజినల్‌ను కూడా అనువాదకులు రిఫర్ చేయాలి. సమయానికే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చి, తప్పుడు సమాచారాన్నిస్తే ఇహలోకంలోనూ, పరలోకంలోనూ నష్టపోవడమే! - **శాంతిబాట టీమ్**

---

ఆ హదీస్‌ను తెలుగులో అనువదించి ఇక్కడ అందిస్తున్నాము.

**"అల్-ఖాసిమ్ బిన్ ముహమ్మద్(రజి) వారి ఉల్లేఖనం : (తలనొప్పివలన కలిగిన బాధ తీవ్రతను వ్యక్తపరుస్తూ) ఆయిషా(రజి) అన్నారు, "హా! నా తల". అల్లాహ్ యొక్క సందేశహరులు (స) "నేను జీవించి ఉండగనే అది జరిగితే, అప్పుడు నీ కొరకు అల్లాహ్ క్షమాపణను వేడుకుంటాను మరియు నీ కొరకు అల్లాహ్‌కు దువా చేస్తాను" అన్నారు. ఆయిషా(రజి) "వా తుక్‌లయాహ్! అల్లాహ్ సాక్షి, నేను చనిపోవాలని మీరు కోరుకుంటున్నారని అనుకుంటున్నాను. ఇదే జరిగితే, ఆ రోజు చివరి భాగం మీ భార్యలలోని ఒక భార్యతో గడుపుతారు!" అన్నారు. ప్రవక్త(స) "కాదు. హా! నా తల!" అన్నారు. ......................................................."**

('వా తుక్‌లయాహ్' కున్న భాషాపరమైన అర్థాన్ని తన కొడుకును కోల్పోయిన స్థితిలో వాడతారు. కాని ఈ హదీస్‌లో భాషాపరమైన అర్థాన్ని తీసుకోకూడదు. ఆమెకు బాధ తీవ్రత, అసౌకర్యం ఎక్కువగా ఉన్నాయని అర్థం చేసుకోవాలి)

**పై హదీస్‌లో 'జనాజా' అని గాని, 'గుసుల్' అనే పదాలు గాని లేవు. అసలు ముహమ్మద్(స)వారి మాటల యొక్క భావమేమిటో కూడా తెలియదు. ఆయనకు తలనొప్పి ప్రారంభమైంది. నిజానికి ఈ హదీస్‌కు వివరణ వ్రాస్తే, ఈ సంచికలోని పేజీలన్నీ సరిపోవు. అల్లాహ్ దయవలన అంత బాగా మనం చెప్పవచ్చు.**

---

## ప్రత్యేక మనవి

**'ముహమ్మద్(స) వారిపై జరుగుచున్న దుష్ప్రచారం' పై వ్రాస్తున్న పుస్తకం 80శాతం పూర్తికావడంతో 3 లేదా 4వ సంచికతో అందించగలమని ప్రకటించాం. 'శాంతిబాట' పత్రికను ప్రమోట్ చేయడంలోనూ, చందాదారుల ఎడ్రస్‌లను సేకరించడంలోనూ, కొరియర్ సర్వీస్‌లో ఎదురైన ఇబ్బందుల వలన ఆ సమస్య పరిష్కారంలోనూ చాలా సమయం పట్టింది. 8 నెలలపాటు పూర్తి సమయాన్ని కేటాయించి తయారుచేసిన ఈ పుస్తకంలో ఒక అధ్యాయం పెండింగ్‌లో ఉంది. కంగారుపడితే పుస్తకం యొక్క ప్రామాణికత దెబ్బతింటుంది. అయినా సరే, 4వ సంచిక పోస్ట్‌చేసిన కొన్ని రోజులకే ఈ పుస్తకాన్ని కూడా చందాదారులకి, ఇన్షా అల్లాహ్, అందించగలమనే నమ్మకంతో ఉన్నాము.**

**ఈ పుస్తకాన్ని పోస్ట్ చేయడానికే 20వేల రూపాయల వరకూ ఖర్చవుతుంది. పత్రికలో ప్రకటన ఇచ్చినా కూడా, మస్‌జిద్‌లలో ఎనౌన్స్ చేసినా సరే, ఈ పుస్తక ప్రచురణలో భాగస్వామ్యానికై ఈ రాష్ట్రంలోని సోదరులెవరూ కనీసం ఒక్కరు కూడా స్పందించలేదు.**

**పుస్తక ప్రచురణలోగాని, పోస్టల్ ఖర్చులోగాని ఎవరు స్పందించినా, స్పందించక పోయినా సరే, ఇన్షాఅల్లాహ్ డిశంబర్ నెలలో అందరికీ అందించే ప్రయత్నంలో ఉన్నాము - శాంతిబాట టీమ్**

# తిరిగి గూటికి

ప్రారంభంలో చెప్పుకున్నట్లు, దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం అమెరికాలో ప్రతీ సంవత్సరం సగటున 20,000 మంది ఇస్లాం ధర్మంలో ప్రవేశిస్తున్నారు. మన దేశంలో, మన రాష్ట్రంలో కూడా ఈ దైవ ధర్మాన్ని చాలామంది తెలుసుకుని, ఈ ధర్మంలో ప్రవేశిస్తున్నారు. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం లాంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు లేదా నౌ ముస్లింలుగా అభిమానంతో తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో దైవధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా దైవధర్మంలోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవితంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి మరికొందరికి సమయం పడుతుంది. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకావస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది.

## ఏంజెలా కొలిన్స్

**అమెరికాలో ట్విన్ టవర్స్ కూలిన తరువాత, నిజాన్ని తెలుసుకుని ఇస్లాం స్వీకరించిన వారిలో ఈ సోదరి ఒకరు. ఆ సంఘటన జరిగిన 2 నెలలకు ఈమె ఇస్లాం స్వీకరించారు. అమెరికాలోని లాస్ఏంజెల్స్ నుండి జార్జ్ లూయిస్, CNBC ఛానెల్ ద్వారా ఆమె ఇంటర్వ్యూని అందించారు. ఆమె ఇస్లాం స్వీకరించిన 5 సంవత్సరాలకు ఓ ఇస్లామిక్ స్కూల్‌ను స్థాపించారు. ఆ స్కూల్‌కు ఆమె డైరెక్టర్.**

**ఈ ఇస్లామీయ జ్ఞానమే నాకు, నా కుటుంబానికి, నా కమ్యూనిటీకి మరియు ఈ భూమిపై సోదరులకూ, అక్కాచెల్లెల్లకూ నేను ఒక ఉత్తమ వ్యక్తిని కావడానికి మార్గాన్ని నిర్వచించింది.**

తమ అవసరాలకు సరిపోయేలా అల్లాహ్ యొక్క అసలు మాటలను మార్చిన మానవుల యొక్క దోషాలను స్పష్టం చేసిన ధర్మమే 'ఇస్లాం' ధర్మంగా నేను తెలుసుకున్నాను.

నీవు ముస్లిమ్ అని చెప్పుకున్నంత మాత్రాన స్వర్గంలోకి దారిస్తానని ఇస్లాం ధృవీకరించలేదు.

**ఇస్లాం అనేది ఏ పరిసరాల్లోనయినా, ఏ కాలంలో నయినా ఆచరణ యోగ్యమైన వ్యవస్థ.**

" కేవలం తమ తండ్రులు నేర్పినదానిని అనుసరించిన వారికొరకు ఏర్పాటు చేసిన exclusive క్లబ్ కాదు స్వర్గమంటే."

## నేనెందుకు స్వయం సమర్పణకు సిద్ధం అయ్యాను?

సోదరి వ్రాసిన మాటలను ఈ వ్యాసంలో యధాతథంగా అందిస్తున్నాను.

''నా జీవితంలోగాని లేదా ఇతరుల జీవితాలలోగాని జరిగే సంఘటనలను ఆపే శక్తి నాకు లేదని నమ్ముతున్నాను.''

అందరినీ మరియు అన్నింటిని సృష్టించిన మన సృష్టికర్తకు పూర్తిగా స్వయం సమర్పణ చేసుకోవాలనే సందేశాన్నిచ్చే ఏకైక మతధర్మం (జీవన విధానం) ఇస్లాం మాత్రమే. నేను చేసే ప్రతీపనిని ఓ సంకల్పంతో ప్రారంభిస్తాను. ఆ తరువాత ఆ సంకల్పాన్ని కృషిగా మార్చవలసి ఉంది, ఏదైతే అప్పటికే దైవ సంకల్పం కనబడిందో దానిని చేయడానికేనని తెలుసుకున్నాను.

ఈ జ్ఞానమే నాకు, నా కుటుంబానికి, నా కమ్యూనిటీకి మరియు ఈ భూమిపై సోదరులకూ, అక్కాచెలెల్లకూ నేను ఒక ఉత్తమ వ్యక్తిని కావడానికి మార్గాన్ని నిర్వచించింది.

ముఖ్యంగా అల్లాహ్ నా హృదయాన్ని తెరిచాడు. ఇస్లాం నాకు మార్గాన్ని ఇచ్చింది మరియు ఇప్పుడు, ఇక్కడ ఈ భూమి మీద మరియు అల్లాహ్‌కు ఇష్టమయితే పరలోకంలోనూ సంతోషంగా ఉండటానికి నా సృష్టికర్త చూపిన మార్గదర్శకత్వం ప్రకారం జీవిస్తున్నాను.

మనలోని ఆధ్యాత్మికత ద్వారా మంచి ప్రవర్తన వైపు, స్వయంగా మన చేతే మనకు మార్గదర్శకత్వం చేయడంలో సహకరించడానికి మతం అనేది ఓ సాధనోపాయమే! అందుకొరకు మానసికంగా ఎంతో గ్రహణశక్తి ఉండవలసిన అవసరం మనకి లేదు.

నేను ఈ మధ్యకాలంలోనే ఇస్లాం స్వీకరించాను. కేథలిసిజమ్ నా పూర్వీకుల నుండి అనుసరిస్తున్న ధర్మం. నాకు 14 సంిిల వయస్సున్నప్పుడు, త్రిత్వం (Trinity) భావనని తిరస్కరించి, '1లో ఉండే 3' నుండి '1లోని 2'కు కుదించి, బాప్టిస్ట్ చర్చ్‌కు వెళుతుండేదానిని.

నా జీవితంలో మొదటినుండి, (ఏ విషయాన్నైనా) అర్థం చేసుకోవడానికి అన్వేషించేదాన్ని. కాని నా (పూర్వపు) విశ్వాసం (Faith) విషయానికొచ్చేసరికి నేను అయోమయానికి గురి అయ్యాను. అదేమిటంటే దైవం ఎందుకు మనిషిగా రావాలి? (ఆయన కుమారుని) క్రూసిఫిక్షన్‌ను నమ్మితే చాలు అనుకున్నవారి పాపాల కోసం ఆయనే స్వయంగా ఎందుకు చనిపోవాలి?

నాకు ఈ వివరణ అసందర్భంగా (అతిగా) అనిపించేది. ఫాస్టర్స్‌తో మరియు విద్వాంసుల (scholars)తో నా సందేహాలను పంచుకునేదాన్ని. క్రైస్తవ విశ్వాసాన్ని నాకు అర్థమయ్యేలా చెప్పడానికి వారు చాలా శ్రద్ధ చూపేవారు.

''నా మతం ఇంత సంక్లిష్టంగా ఉండవలసిన అవసరమెందుకు?'' నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. నేను పెద్దయ్యాక, దీనిని సులభం చేయాలని నిర్ణయించుకున్నాను. ఒక్కడే సృష్టికర్త ఉంటాడు. ఒక్కడు. అంతే! మరి ఏ వివరణా నాకు తెలివిగా అనిపించదు.

తమ అవసరాలకు సరిపోయేలా దేవుని యొక్క అసలు మాటలను మార్చిన మానవుల యొక్క దోషాలను స్పష్టం చేసిన ధర్మమే 'ఇస్లాం' ధర్మంగా నేను తెలుసుకున్నాను.

'ఇస్లాం' నిరాడంబరమైనది. ఆరాధ్యుడు ఒక్కడే. దైవం మనల్ని సృష్టించాడు. మనం ఆ దైవాన్ని, ఒక్కడైన ఆ దైవాన్నే ప్రార్థించాలి. అల్లాహ్ మోసెస్ [(మూసా(అస)]ని, జీసెస్ [(ఈసా(అస)]ని మరియు ముహమ్మద్(స)వారిని పంపారు - ఆయన యొక్క సందేశాన్ని ప్రజలందరికీ అందించి మార్గదర్శకత్వం కావించడానికి.

ఇస్లాంలో, జీసెస్ [(ఈసా(అస)] ప్రవక్త మాత్రమే. ఆయన చనిపోలేదు. అందుకే ఆయన తీర్పుదినానికి ముందు మరలా వచ్చి ప్రజలకు నాయకత్వం వహిస్తారు. (ఇస్లాం ధర్మం ప్రకారం ప్రజలను నడిపిస్తారు).

ఖుర్ఆన్ 'అల్లాహ్' యొక్క చివరి గ్రంథం. అది చరిత్రలోని ప్రజల అవసరాల కనుగుణంగా ఎన్నడూ మార్పు చేయబడలేదు.

నీవు ముస్లిమ్ అని చెప్పుకున్నంత మాత్రాన స్వర్గంలోకి దారిస్తానని ఇస్లాం ధృవీకరించలేదు.

ఆరాధ్యుడు ఒక్కడేనని, నీవు నమ్మినంత మాత్రాన నీవు తిన్నగా స్వర్గంలోకి పోజాలవు. నీవు స్వర్గంలోకి ప్రవేశించడమనేది, దైవం యొక్క అసలు గ్రంథాలను, ప్రవక్తల బోధనలను అనుసరించి చేసే ఆచరణలపై, నీ సంకల్పంపై ఆధారపడి ఉంటుంది.

కేవలం తమ తండ్రులు నేర్పినదానిని అనుసరించిన వారికొరకు ఏర్పాటు చేసిన exclusive క్లబ్ కాదు స్వర్గమంటే.

అది నీ బాధ్యత. ప్రత్యేకంగా ముస్లిముగా, నిరంతరం సత్యాన్ని అన్వేషించాలి. అర్థం చేసుకోవాలి. చదవాలి. ఆలోచించాలి.

ఖుర్ఆన్‌లోని ప్రతీ అధ్యాయాన్ని రెండుసార్లు చదివి, వాటి నుండి వివరంగా నోట్స్ రాసుకున్న తరువాత, ఈ masterpiece నా సృష్టికర్త దగ్గర నుండి మాత్రమే రాగలదని నేను విశ్వసించాను.

ఈ గ్రంథ రచయితకు (అల్లాహ్‌కు) నా గురించి నా కంటే బాగా తెలుసు అని చెప్పడంలో నాకెటువంటి సందేహం లేదు.

ఇస్లాం ధర్మం పూర్తిగానూ, తీవ్రంగానూ అపార్థం చేసుకోబడిందని, అలాగే నా స్వస్థలమైన అమెరికాలో ఈ ధర్మాన్ని ఇష్టపడరన్న విషయం రహస్యమేమీ కాదు.

ఈ వివాస్పదమైన మతంలోకి నేను మారడాన్ని చూసి, నా కుటుంబం మరియు నా స్నేహితులు దిగ్భ్రాంతి చెందారు.

నా విదేశీయానం ద్వారా నాకు పరిచయంలేని ఎన్నో దృక్కోణాలను సంచారం చేస్తూ తెలుసుకోవాలనుకునే నాకున్న గాఢావేశాన్ని, నాలో మరింత పెంచడం ద్వారా అల్లాహ్ నన్ను ఇస్లాం వైపు తీసుకెళ్లారన్నది నా యొక్క sincere విశ్వాసం.

నా ఆలోచన విధానమే ప్రజలందరికీ పనిచేసే ఏకైక వ్యవస్థ అని

ప్రోత్సహించడం కంటే కూడా, ప్రతీచోట ప్రజల మధ్య దూరాలు తగ్గించి, వారిని కలపడంలోనే నాకు నిజమైన ఆసక్తి ఉంది.

మిడిల్ ఈస్ట్‌లోని ముస్లిమ్‌లను చూశాను. అక్కడి కుటుంబాల మధ్య నున్న సాన్నిహిత్యం, విదేశీ విధానాలతో నున్న నాలాంటి అమ్మాయిని వారు నమ్మడం, అక్కడి వారి దయాగుణంలోని సౌందర్యాన్ని చూశాను.

ఇస్లాం అనేది ఏ పరిసరాల్లోనయినా, ఏ కాలంలో నయినా ఆచరణ యోగ్యమైన వ్యవస్థ.

అల్లాహ్ గనుక నా ఆత్మలో ఇస్లామ్‌ను ఊది ఉండకపోతే, నేను ఏంజెలాను ఎప్పటికీ కనుగొనలేనని ధృడంగా చెప్పగలను.

ఈ రోజు ఇక్కడున్న ముస్లిమ్ - ఏంజెలా : ఓ అమెరికన్ ముస్లిమ్. అంతేకాకుండా, తన సృష్టికర్త కొరకు నిరంతరం అన్వేషిస్తూ ఈ విశ్వం లోనివి మరియు ఈ విశ్వానికి ఆవల ఉన్న వాటన్నింటినీ సృష్టించిన సృష్టికర్తను ఇస్లాంలో కనుగొన్న ఆత్మే - ఈ ఏంజెలా.

సోదరి చాలా తక్కువ మాటలలో, ఇస్లాం గురించి చాలా చక్కగా చెప్పారు. హిజాబ్ ధరించి ఆమె సి.ఎన్.బి.సి. కు ఇచ్చిన ఇంటర్వ్యూను www.youtube.com లో చూడవచ్చు.

ప్రతీరోజూ మన ముఖాన్ని అద్దంలో చూసుకుంటాం. అవసరాన్ని బట్టి ఒకొక్కసారి చాలా ఎక్కువసార్లు చూడటం జరుగుతుంటుంది. ఆ 'అద్దం' మనం కొనుక్కున్నదే. మన స్వంత అద్దం. అయినప్పటికీ అది మనల్ని మరో విధంగా చూపించి మోసం చేయదు. మనం అందంగా లేకపోతే, అందంగా ఉన్నట్లు చూపించదు. మనలోని లోపాలు మరియు అదేవిధంగా మనలోని ఆకర్షణను కూడా అద్దంలో చూసుకుని తెలుసుకుంటాం.

నాకున్న జ్ఞానాన్ని బట్టి, నేనెప్పుడూ అద్దాన్ని తిట్టేవారిని చూడలేదు. అందుకోసమేనేమో, ఒక ముస్లిమ్ మరో ముస్లిమ్ సోదరునికి అద్దం లాంటి వాడని ముహమ్మద్(స)వారు బోధించారు.

అంటే మనలోని లోపాలను మరో ముస్లిమ్ సోదరునిలో చూసుకునే అవకాశముంది.

ఈ నవముస్లిమ్ సోదరిలాంటి సిస్టర్స్ ఎందరో, చాలా యాక్టివ్‌గా, ఇస్లాం గురించి ప్రజలలో అవగాహన కల్పిస్తున్నారు.

వారు వర్క్ చేసేది ఎలాంటి ప్రదేశాలలోనంటే, ఆ ప్రదేశాలలోని స్త్రీలు బట్టలు ధరించారా? లేదా? అని అనుమానం కలుగుతుంది. అలాంటి చోట, హిజాబ్‌ను ధరించి, ఇస్లామిక్ స్కూల్‌ను స్థాపించి, పిల్లలకు శిక్షణ నివ్వడం అభినందించదగిన విషయం.

ఈ సోదరి యొక్క 'దైవవిశ్వాసం' అనే అద్దంలో మన విశ్వాసాన్ని ఓ సారి చూసుకుందాం!

సేకరణ మరియు తెలుగు అనువాదం :

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు (అబ్దుల్ కరీమ్)**

Source: http://www.islamicity.com/articles/Articles.asp?ref=IC0408-2411

## వచ్చే సంచికలో ....

చాలా చిన్న వయస్సులోనే ఇస్లాం ధర్మాన్ని స్వీకరించి, ఓ మంచి వెబ్‌సైట్‌ను నడుపుతూ, ఓ సోదరి చేస్తున్న సందేశ కార్యక్రమాన్ని వచ్చే నెలలో, ఇన్షా అల్లాహ్, అందిస్తాము. ఓ ముఖ్య విశేషం కూడా ఉంది. అది చదివిన వారు ఇన్షాఅల్లాహ్ ఎప్పటికీ మర్చిపోలేరు.

ఆ విషయం హృదయాన్ని సూటిగా తాకుతుంది. ఎలాంటి వ్యక్తినైనా వెంటనే ఒప్పించగలిగి, ఆలోచింపజేసేలా ఉంటుంది.

## తిరిగి గూటికి | నవముస్లిములకు ప్రత్యేకం | 1

'లా ఇలాహ ఇల్లల్లాహ్' (ఆరాధ్యుడు లేడు అల్లాహ్ తప్ప), 'ముహమ్మద్ రసూలుల్లాహ్' (ముహమ్మద్(స)వారు అల్లాహ్ యొక్క సందేశహరులు) అని విశ్వసించి, సాక్ష్యం (షహదా) పలకడం ద్వారా తిరిగి గూటికి చేరిన నవముస్లిమ్‌లకు ముందుగా మా హృదయపూర్వక అభినందనలు.

ఇది శాంతిబాటలో వేసిన తొలి అడుగు. ఇది చాలా ముఖ్యమైనది. ఆ బాటలో మీరు నిరంతరం పయనించాలి. అక్కడే ఆగిపోకూడదు. అదే మా ఆకాంక్ష.

ఎప్పుడైతే మీరు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని అల్లాహ్‌కు మిమ్మల్ని మీరు స్వయంగా సమర్పించుకుని, ఆయనను మీ యజమానిగా విశ్వసించారో, ఆయన ఆదేశాల ప్రకారమే జీవించాలి. **తన దాసులు సంతోషంగా బ్రతకాలని**, ముఖ్య సూచనలతో, ఆదేశాలతో కూడిన అద్భుతగ్రంథమైన **'ఖుర్'ఆన్'ని** ముహమ్మద్(స)వారి ద్వారా మానవజాతికి 'అల్లాహ్' **అందించారు**.

'అల్లాహ్'ను విశ్వసించిన వారు, ఖుర్'ఆన్ గ్రంథాన్ని అనుసరించాలి. అరబీభాష రాకపోయినా సరే, అర్థమయ్యే భాషలోని ఖుర్'ఆన్ అనువాదాన్ని ఈ రోజున అందరూ చదువుకో గలుగుతున్నారు. అల్‌హమ్‌దులిల్లాహ్!

ఖుర్'ఆన్ గ్రంథంలోని ఓ వాక్యాన్ని చూడండి.

**"(ఓ ప్రవక్తా!) ఇలా అను: "మీకు అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (అప్పుడు) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు మరియు మీ పాపాలను క్షమిస్తాడు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు. అపార కరుణాప్రదాత"** (ఖుర్'ఆన్ 3:31)

**"ఓ విశ్వసించిన ప్రజలారా! మీరు అల్లాహ్‌కు విధేయులై ఉండండి మరియు ప్రవక్తకు విధేయత చూపండి మరియు మీ కర్మలను వ్యర్థం చేసుకోకండి"** (ఖుర్'ఆన్ 47:33)

అంటే 'అల్లాహ్'కు విధేయత మరియు ఆయన సందేశహరులైన ముహమ్మద్(స)వారికి కూడా విధేయత చూపాలి. విధేయత చూపడం అంటే నోటితో గొప్పగా చెప్పడం కాదు.

ఖుర్'ఆన్ గ్రంథంలో అల్లాహ్ ఆదేశించినది చేయకుండా ఉంటే, అది అల్లాహ్‌కు విధేయత చూపించినట్లు కాదు కదా! అలాగే

ముహమ్మద్(స)వారి బోధనల ప్రకారం, మన నడవడిక లేకుంటే కూడా విధేయత అల్లాహ్‌కు చూపనట్లే!

ఈ రెండూ మనిషినుండి దూరమైపోయాక, ఆ మనిషి నుండి 'శాంతి' (ఇస్లాం) కూడా దూరమవుతుంది. సంతోషజీవనమే దూరం అవుతుంది.

**నవముస్లిమ్‌లను ప్రక్కదోవ పట్టించే ప్రయత్నాలు :**

కొంతమంది వ్యక్తులు మరియు కొన్ని చిల్లర సంస్థలు, వ్యాపార దృష్టితో దైవభీతిగలవారిని తప్పుదారి పట్టించడం చేస్తున్నారు. 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అంటే చాలునని, 'ముహమ్మద్(స) రసూలుల్లాహ్' అని పలకనవసరం లేదని, ఆ విధంగా విశ్వసించనవసరం లేదని చెబుతూ, దేవుడు ఒక్కడే అంటే చాలు, నీవు ముస్లిమ్‌వి అయిపోయినట్లేనని చెబుతున్నారు.

వారికి 'అల్లాహ్' అంటే ఎవరో కూడా చెప్పకుండా, అటూ ఇటూ కాని విధంగా తయారుచేసి వారిని నవముస్లిమ్‌లుగా పరిచయం చేస్తూ, వీడియోలు ఫొటోలు తీసి తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. అలాగే పెళ్ళిళ్లు కూడా చేసేస్తున్నారు. ధర్మాన్ని అవలంబించే వారికి, నవ ముస్లిమ్‌లపై ప్రత్యేకమైన అభిమానముంటుంది. ఆ అభిమానంతో, పైన చెప్పిన సంస్థల మాయమాటలలో పడి, పెళ్ళిళ్లు చేసుకుంటే, ఆ తరువాత వారిలో ఇస్లాంపై విశ్వాసలేమిని చూసి బాధపడే వారున్నారు.

ఇస్లామ్‌కి సంబంధించిన ప్రామాణిక పుస్తకాలను అందించకుండా, వారికి తమ అజ్ఞానపు వ్రాతలున్న పుస్తకాలని అందించి అయోమయంలో పడవేస్తున్నారు.

క్రింది ఖుర్‌ఆన్ వాక్యాలను చదవండి:

**"..... నా తరపునుండి మీకు మార్గదర్శకత్వం తప్పక వస్తూ ఉంటుంది. కావున నా మార్గదర్శకత్వాన్ని అనుసరించేవాడు మార్గభ్రష్టత్వానికి మరియు దురవస్థకూ గురికాడు".**

**"మరియు ఎవడైతే నా సందేశం నుండి విముఖుడవుతాడో నిశ్చయంగా అతని జీవితం ఇరుకైపోతుంది మరియు తీర్పుదినాన అతనిని గ్రుడ్డివానిగా లేపుతాము".**

**అప్పుడతడు అంటాడు : "ఓ నా ప్రభూ! నన్నెందుకు గ్రుడ్డివానిగా లేపావు, వాస్తవానికి నేను (ప్రపంచంలో) చూడగలిగేవాణ్ణి కదా!"**

**అప్పుడు (అల్లాహ్) అంటాడు : "మా సూచనలు నీ వద్దకు వచ్చినప్పుడు, నీవు వాటిని విస్మరించావు. మరియు అదే విధంగా ఈ రోజు నీవు విస్మరించబడుతున్నావు."**

**మరియు ఈ విధంగా మేము మితిమీరి ప్రవర్తిస్తూ తన ప్రభువు సూచనలను విశ్వసించని వానికి ప్రతీకారం చేస్తాము. మరియు పరలోక శిక్ష ఎంతో కఠినమైనది మరియు శాశ్వతమైనది.**

**(ఖుర్‌ఆన్ 20:123-127)**

మొదటి సంచికలో సోదరి 'అమినా అస్సిల్మి' గురించి చదివిన నవముస్లిమ్‌లు తప్పక మరోసారి ఆలోచించి ఉంటారని మా నమ్మకం.

బ్యాటరీ లేని సెల్‌ఫోన్ జేబులో పెట్టుకుని, నా దగ్గర సెల్‌ఫోన్ ఉంది అని అనుకున్నంత మాత్రాన, అది పనిచేస్తుందా? దానివలన మీకేవిధంగానైనా ఉపయోగపడుతుందా?

ఆచరణలేని జీవన విధానం సంతోషాన్నివ్వదు.

'ఇస్లాం' అనేది సంతోషంగా బ్రతకడానికి మనందరిని సృష్టించిన ఆ సృష్టికర్త డిజైన్ చేసిన జీవన విధానం.

ఒకేసారి అన్ని విషయాలనూ నవముస్లిములు తెలుసుకోలేరు. నిజమే! అందుకని ముఖ్య విషయాలను సీరియల్‌గా, ఇన్షా అల్లాహ్, ఈ శీర్షికతో పాటు అందిస్తాము.

ఇస్లామీయ జీవనవిధానం గురించి క్లుప్తంగా వివరించే పుస్తకాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు అటువంటి పుస్తకాలలో ఒకటి: "ఇస్లామీయ జీవనసరళి" (తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్, హైదరాబాద్), జీవన విధానంపై కనీస అవగాహనకు ఈ పుస్తకం బాగా ఉపయోగపడుతుంది. ప్రొఫెసర్ రామకృష్ణారావు గారి పుస్తకం 'ఇస్లాం ప్రవక్త ముహమ్మద్(స)', అడియార్ గారి 'నేను ఆరాధించే ఇస్లాం' పుస్తకాలు చదివితే, నవముస్లిముల విశ్వాసం మరింత ధృడమౌతుందని మా నమ్మకం.

**విశ్వాసం :**

ఓ వ్యక్తికి ముహ్మద్(స)వారు ఉత్తమ బోధనలను వినిపిస్తున్నారని తెలిసింది. తన సందేహాన్ని తీర్చుకోవడానికి తన సోదరుని పంపి వాకబు చేశారు. తమ్ముడు ఆ విషయం నిజమేనని చెప్పాడు. అయినా సరే, ఆతృత తీరలేదు. తానే స్వయంగా తెలుసుకోవాలనుకున్నాడు.

ముహమ్మద్(స) వారి దగ్గరికి డైరక్ట్‌గా తానే వెళితే, మక్కా విగ్రహారాధకులు కొడతారని భయం. అలా భయపడే వ్యక్తి చివరికి ముహమ్మద్(స) వారిని చేరడం, ఆయన బోధనలను విని వెంటనే ఇస్లాం స్వీకరించి ముస్లిమ్ కావడం జరిగిపోయింది.

ముస్లిమ్‌గా మారిన విషయాన్ని రహస్యంగా ఉంచుకోవచ్చని అవకాశమిచ్చినా సరే, అందరిముందూ "అష్‌హదు అల్‌లా ఇలాహ ఇల్లల్లాహ్ వ అష్‌హదుఅన్న ముహమ్మదుర్ రసూలుల్లాహ్" అంటూ ప్రకటించి, వారి చేత దెబ్బలు తిన్నారాయన. అయినా సరే మరలా ప్రకటించి మరలా దెబ్బలు తిన్నారాయన.

మరి ఈయనలో ఇంత ధైర్యం అకస్మాత్తుగా ఎక్కడ నుండి వచ్చింది? ఇటువంటి ధైర్యాన్ని, సత్యాన్వేషణ చేసి ఇస్లాం ధర్మాన్ని చేరుకున్న ఎందరో నవముస్లిమ్ సోదరులను వైజాగ్‌లో, సామర్లకోటలో చాలా మందిని నేను చూశాను. స్వయంగా నాకు కూడా ఆ అనుభవం ఉంది.

నవ ముస్లిమ్‌లకు ధైర్యం, ధర్మ ప్రచారమంటే ఉత్సాహం అలా ఉంటాయి. ఇప్పటి వరకూ ఈ శీర్షికలో పరిచయమైన వారు అలాంటివారే!

మరి సత్యాన్ని తెలుసుకోకుండా, కొంతమంది స్వార్ధపరుల ప్రోత్సాహంతో, ఏదో ఒక అవసరం కోసమో, లేక స్వార్ధంతో నవ

ముస్లిములుగా మారినవారు లేదా అలా మారినట్లుగా వెనుకనుండి నటింపజేయించేవారు మన చుట్టూ ఉన్నారు.

ఇలాంటివారు కూడా సన్మార్గంలోకి రావాలని అల్లాహ్‌కు దువా చేసుకుంటున్నాము.

**శుభ్రత :**

ఏకైక ఆరాధ్యున్ని విశ్వసించడమనేది మానవునికి ఓ వరం లాంటిది. ఈ విశ్వాసం ఎన్నో అసాధ్యాలను సాధ్యం చేస్తుంది. పైన చెప్పినట్లు భయాన్ని పోగొడుతుంది. తల వంచే పరిస్థితి నుండి తల ఎత్తుకుని బ్రతికే పరిస్థితికి తీసుకెళుతుంది. మనశ్శాంతి నిస్తుంది.

ఇహలోక స్వార్థం కోసం కాకుండా, నిజాయితీగా ఏకైక ఆరాధ్యున్ని విశ్వసించి ఈ దైవధర్మంలో అడుగిడిన వారు విశ్వాస మాధుర్యాన్ని అనుభవిస్తారు. వారికి ఖుర్‌ఆన్ ఆదేశాలను పాటించడం, ముహమ్మద్(స) వారి బోధనలను అనుసరించడం సులభతరం అవుతుంది.

**'శుద్ధి' విశ్వాసంలో సగభాగమని చెప్పారు. దీనిని బట్టి శుభ్రతకు ఇస్లాం ఎంతటి ప్రాధాన్యతనిచ్చిందో అర్థం చేసుకోవాలి.**

ధనవంతుడు ఖరీదైన బట్టలను, పేదవాడు నాసిరకం బట్టలను ధరిస్తాడు. అవి వారి మధ్య నున్న బేధాన్ని చూపిస్తాయి. కాని ఖరీదైన బట్టలు వేసుకున్నంత మాత్రాన శుభ్రత పాటిస్తున్నట్లు కాదు.

ఆర్థిక స్థాయితో సబంధం లేకుండా, ధనవంతుడైనా, పేదవాడైనా సరే పరిశుభ్రంగా ఉండటానికి ముహమ్మద్(స)వారు ఒకేరకమైన ఆచరణ విధానాలను తెలియజేశారు. ఆయన(స) చెప్పిన మిస్వాక్, వజూ, గుసుల్ మొ॥న విధానాలను ఇన్షా అల్లాహ్ ఓ ప్రత్యేకపద్ధతిలో ధారావాహికంగా అందించడానికి ప్రయత్నిస్తున్నాం. హడావుడిగా అందించడం మాకు ఇష్టంలేదు.

అల్లాహ్‌ని విశ్వసించడం ద్వారా మన మనస్సు శుభ్రపడింది. ముస్లిమ్ (దైవవిధేయుని)కి శారీరక శుభ్రత కూడా చాలా ముఖ్యమైనది.

నేడు స్వైన్‌ఫ్లూ గురించి, మిగిలిన రోగాల గురించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, టి.వి.లలో ప్రింట్ మీడియాలో మన భారతప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేసి ప్రకటనలు ఇస్తుంది. ఇలాంటివి 1400 సం॥లకు పూర్వమే ముహమ్మద్(స)వారు ఆచరించి, బోధించారు. ఇవన్నీ ఒకటొకటిగా ఇన్షాఅల్లాహ్ మీ ముందుంచుతాం.

**ముఖ్య గమనిక :**

ఎవరైనా నవ ముస్లిమ్ సోదరులు, తమ తోటి ముస్లిమ్ సోదరులలో ఎవరి వల్లనయినా చులకన చేయబడితే, అలాంటి మాటలను పట్టించుకోవద్దు. కొందరు సోదరులు ఇప్పటికే మాకు తమ ఆవేదనను తెలియజేశారు.

ముహమ్మద్(స)వారు ఒక్కరు తప్ప, దాదాపు **ప్రవక్త(స)వారి ముఖ్య అనుచరులందరూ కూడా నవముస్లిములే!** వారిలో మోమిన్‌లున్నారు. అల్లాహ్ మార్గంలో నున్నవారిని ఎవరూ చులకన చేయలేరు. ఎప్పుడైతే ఒకే ఆరాధ్యుని ముందు తలవంచామో, జీవితంలో ఎవరి ముందూ తలవంచే పరిస్థితి, ఇన్షా అల్లాహ్, రాదు. కాని ఆ ఆరాధ్యుని ముందు తలవంచకపోతే, అందరి ముందూ ఎల్లప్పుడూ తల వంచుతూనే ఉండాలి.

మనం తిరిగి ఇస్లాం గూటికి చేరుకున్నాం. ఎప్పుడైతే గొప్పవాడు, సర్వశక్తిమంతుడూ మన యజమాని అయ్యాడో, ఆయన దాసులుగా మన స్థాయి కూడా అవిశ్వాసుల కంటే పై స్థాయికి ఎదుగుతుంది. ముస్లిమ్‌లని ఉత్తమ సమాజంగా అల్లాహ్ నిలబెట్టినట్లు ఖుర్‌ఆన్ ద్వారా తెలుస్తుంది. కాబట్టి ఉత్తమ సమాజంలో మీరు సభ్యులయ్యాక చులకన కావడం మొ॥న స్థితిని దాటిపోవడం జరిగిందని తెలుసుకోండి.

---

**(3వ పేజీ తరువాయి)**

కొంతమంది ఖుర్‌ఆన్ గ్రంథమే స్వయంగా ఇలా చెప్పింది అని చెబుతారు:

> **"మరియు వాస్తవానికి మేము ఈ ఖుర్‌ఆన్‌ను హితబోధ గ్రహించటం కోసం సులభం చేశాము"** (ఖుర్‌ఆన్ 54:17)

ఖుర్‌ఆన్ గ్రంథం సులభమైనది కాబట్టి, వివరించడానికి ఇతర జ్ఞానమేదీ ప్రత్యేకంగా అవసరం లేదు అని వాదిస్తారు. ఈ వాదన పూర్తిగా కుతర్కం. ఇలాంటి వాదనలు కనీస అవగాహన లేకపోవడం వలనే పుడతాయి.

అసలు వాస్తవం ఏమిటంటే ఖుర్‌ఆన్ వాక్యాలు రెండు రకాలు:

1. మొదటి రకంలో మంచి హితబోధ గురించి బోధనకు సంబంధించిన సంఘటనలతో, హెచ్చరికలతో, ముఖ్య సలహాలతో కూడిన ఆయత్‌లు ఉంటాయి.

   ఉదా: ఇహలోకం, పరలోకం గురించి, స్వర్గనరకాల గురించి, జీవితానికి సంబంధించిన సాధారణ వాస్తవాలు, ఇలాంటి ఆయత్‌లు సులభంగా అర్థమౌతాయనడంలో ఎటువంటి సందేహం లేదు. అరబీ భాష గురించి తెలిసిన వారు, ఆ హితబోధను అర్థం చేసుకోవడం ద్వారా మేలు పొందగలరు.

   పై వాక్యంలో 'హితబోధ కొరకు' అని ఆ వాక్యమే స్వయంగా చెబుతుంది. కాబట్టి ఇక్కడ సులభం చేయబడింది 'హితబోధ కొరకే!'

2. దీనికి భిన్నంగా, ఆదేశాలు, నియమాలు, విశ్వాసానికి మరియు జ్ఞానానికి సంబంధించిన సబ్జక్టులను తెలియజేసే ఆయత్‌లున్నాయి. ఈ ఆయత్‌లను సరియైన విధంగా అర్థం చేసుకోవాలి. వీటికి ఇస్లామీయ పరిజ్ఞానం చాలా అవసరం.

ముహమ్మద్(స) వారి యొక్క ముఖ్య అనుచరులందరికీ అరబీ భాష బాగా తెలుసు. వారు ఆ భాషలో శిక్షణ పొందడానికి ఎక్కడికో వెళ్లవలసిన అవసరంలేదు. అయినప్పటికీ వారికి ఖుర్‌ఆన్‌ను ప్రవక్త(స)వారి దగ్గరనుండి నేర్చుకోవడానికి చాలా కాలం పట్టేది. ముహమ్మద్(స) వారి దగ్గర ఉస్మాన్ ఇబ్నె అఫ్ఫాన్, అబ్దుల్లా ఇబ్నె మసూద్ మొ॥న వారు పది ఆయత్‌లను నేర్చుకున్న తరువాత, ఆ ఆయత్‌లలో ఉండే వివేకాన్ని మరియు వాటిలో నిమిడి ఉన్న ముఖ్య విషయాలన్నింటిని బాగుగా అర్థం చేసుకోకుండా మిగిలిన ఆయత్‌ల జోలికి వెళ్ళేవారు కాదు.

# 2. ఇస్లాంలో విద్య - మస్జిద్ (Mosque) యొక్క పాత్ర


**జామి جامع అనే అరబీ పదానికి అర్థం మస్జిద్ مسجد. ఈ 'జామి' అనే పదం నుండే ఉత్పన్నమైన పదం - 'జామిఅ' جامعة అంటే యూనివర్శిటీ (విశ్వవిద్యాలయం).**


**ఇస్లామీయ ప్రపంచంలోని చాలా చోట్ల ఇప్పటికీ 'జామిఅ' అంటే మస్జిద్ మరియు స్కూల్ (బడి). వాటి బిల్డింగ్‌లు వేరుగా ఉన్నప్పటికీ, తరచుగా ఆ రెండూ దూరంగా ఉన్నప్పటికీ కూడా రెండింటిని కలిపి 'జామిఅ' అని పిలుస్తారు.**


**'మస్జిద్' అర్థాన్నిచ్చే పదం నుండే 'యూనివర్శిటీ' అనే పదం ఉత్పన్నమవడం అనేది మరే ఇతర భాషలోగాని, సంస్కృతిలో గాని లేదు. కాని నేటి ముస్లిమ్‌లకు మస్జిద్ అంటే 5 పూటలా కాస్సేపు ప్రార్థన చేసుకునే ప్రదేశమని మాత్రమే తెలుసు.**

**ఇస్లామ్‌కి మరియు ఉన్నత విద్యా సముపార్జనకి ఉన్నటువంటి ఉత్తమ బంధం లాంటి బంధం కూడా మరో చోట మీకు కనిపించదు.**

**మస్జిద్‌కు, మరియు విద్యను సముపార్జించే స్కూలుకు విడదీయరాని బంధం ఉండబట్టే, ఇస్లామీయ జ్ఞానాన్ని సముపార్జించిన ముస్లిమ్ శాస్త్రవేత్తలు ఆధునిక సైన్స్‌కి పునాదులు వేశారు. ఈ విషయం క్రిందటి సంచికలో చర్చించాము.**







1. స్పెయిన్‌లోని కార్డోబా మస్జిద్ మరియు యూనివర్శిటీ లోపలిభాగం, ఇది 785 సం॥లో స్థాపించబడింది. స్థాపించబడి ఇప్పటికి 1224 సం॥లు కావస్తున్న అతి పురాతన విశ్వ విద్యాలయం.
2. Qarawiyyin Mosque and University. ఖరవియ్యీన్ మస్జిద్ మరియు యూనివర్శిటీ, ఫెజ్, మొరాకో. 859 సం॥లో స్థాపించబడింది. (అంటే ఇప్పటికి ఇది స్థాపించబడి 1141 సం॥లు కావస్తుంది).
3. Al-Azhar University, Cairo. అల్-అజ్‌హర్ యూనివర్శిటీ, కైరోలో 22 జూన్, 972లో స్థాపించబడింది. ఈ యూనివర్శిటీ స్థాపించబడి, ఇప్పటికి 1037 సం॥లు కావస్తుంది.

## (గత సంచిక తరువాయి)

Mackensen ప్రకారం, దాదాపు పెద్ద మస్జిద్‌లు అన్నింటిలోనూ, విద్యను బోధించడం మరియు నేర్చుకోవడమనేది పూర్తి స్థాయి వృత్తిగా ఉండేది. మస్జిద్ స్కూల్ - తర్వాతి కాలంలో ఓ అకాడమీగా/యూనివర్శిటీగా మారడానికి ఆ బాధ్యతను ఈ మస్జిద్ స్కూల్ తీసుకుంది. ఆ విధంగా ముఖ్యమైన ఉన్నత విద్యాకేంద్రాలు ఈ రోజున కూడా ప్రపంచంలో పురాతన విశ్వవిద్యాలయాలుగా ఉనికిలోనే ఉన్నాయి.

వాటిలోని కొన్ని యూనివర్శిటీలు : టునీషియాలోని అల్-ఖైరవున్ మరియు అల్-జైతూన, ఈజిప్ట్‌లోని అల్-అజ్‌హర్ మరియు మొరాకో, ఫెజ్‌లోని అల్-ఖరవియ్యీన్.

ఈ యూనివర్శిటీలు ప్రసిద్ధిగాంచిన ప్రదేశాలు అయ్యాయి. అందుకని ఈ యూనివర్శిటీల్లో విద్యార్థులుగా లేక టీచర్లుగా చేరాలని తపించేవారు. ఆ విధంగా ఈ యూనివర్శిటీలు అందరినీ ఆకట్టుకునేవి.

ముస్లిమ్ స్పెయిన్‌లోని మస్జిద్‌ల నుండి గ్రాడ్యుయేట్స్ అయిన వారిలో ఇబ్నె రుష్ద్, ఇబ్నె అల్-సయిగ్, ఇబ్నె బజ్జ మొ॥న వారున్నారు. ఇరాఖ్‌లోని బస్రాలో ఓ మస్జిద్‌లో అల్-ఖలీల్ ఇబ్నె అహమద్ ఫిలాసఫీలో లెక్చర్స్ ఇచ్చేవారు. వీరి విద్యార్థులలో ఒకరైన సిబవైహ్ తరువాతి కాలంలో వ్యాకరణవేత్త (grammarian)గా పేరు తెచ్చుకున్నారు.

9వ శతాబ్దం ప్రారంభం నుండి ఇప్పటి మన కాలం వరకూ కూడా, ఖరవియ్యీన్ యూనివర్శిటీ ఖ్యాతి నిలబడ గలిగింది అంటే, దానికి కారణం అందులోని విద్వాంసులే! (Body of Scholars!).

ఇక్కడే చదువుకుని, ఆ తరువాత బోధనా రంగం(Teaching Field)లో అడుగు పెట్టిన వారిలో ఇబ్నె ఖల్‌దూన్, ఇబ్నె అల్-కాతిబ్, అల్-బిత్రిజి, ఇబ్నె హరాజిబ్, ఇబ్నె మైమూన్ మరియు ఇబ్నె వజ్జాన్ మరియు Gerbert. ఈ Gerbert తరువాతి కాలంలో Pope Sylvester II అయ్యారు. ఈయనే అరబీ అంకెలను యూరప్‌లో పరిచయం చేసిన వ్యక్తి.

ఇబ్నె అల్-హైతమ్ అల్-అజ్‌హర్ యూనివర్శిటీచే ఆకర్షించబడిన వారిలో ఒకరు. ఈ యూనివర్శిటీ క్వార్టర్స్‌లో ఈయన చాలాకాలం పాటు ఉన్నారు.

ఈ యూనివర్శిటీలో 12వ శతాబ్దపు చివరికాలంలో అల్-బాగ్దాదీ వైద్యశాస్త్రాన్ని బోధించగా, ఇబ్నె ఖల్‌దూన్ 14వ శతాబ్దం చివరికాలంలో ఇక్కడ బోధించారు. ఆ విధంగా ప్రసిద్ధిగాంచిన స్థలాలుగా, ఇవి చాలా సంఖ్యలో విద్యార్థులను ఆకట్టుకునేవి.

మదీనా మస్జిద్‌లో చాలా పెద్ద సంఖ్యలో విద్యార్థులు గుమి గూడేవారు. ఈ మస్జిద్ ప్రారంభపు స్కూల్ మాత్రమే కాకుండా చాలా అడ్వాన్స్‌డ్ స్కూల్ అని చెప్పవచ్చు. అల్-ఖర్‌వియ్యీన్ యూనివర్శిటీలో మొరాకోలోని అన్ని ప్రాంతాలనుండి విద్యార్థులు చేరేవారు. అలాగే నార్త్ ఆఫ్రికాలోని మిగిలిన ప్రాంతాల నుండి, అండలూసియా (స్పెయిన్) మరియు సహారా నుండి సహితం విద్యార్థులు వచ్చేవారు.

సాధారణంగా ఈ విద్యార్థులకు వసతులను మొరాకో రాజవంశావళి పరంపర మరియు ఫెజ్ ప్రజలు కల్పించేవారు.

ఇక గ్రెనడా(Granada), Seville మరియు కార్డోబా యూనివర్శిటీలపై ఆసియా, ఆఫ్రికా మరియు యూరప్ విద్వాంసులకు చాలా ఎక్కువ అంచనా లుండేవి. 9వ శతాబ్దంలో కార్డోబా యూనివర్శిటీలో theology (మతధర్మ శాస్త్రం) విభాగంలోనే 4వేల మంది విద్యార్థులు ఉండేవారు.

ఆ కాలంలోనే ఈ యూనివర్శిటీలో హాజరయ్యే మొత్తం విద్యార్థుల సంఖ్య 11,000.

బ్రిటిష్‌వారు ఆక్రమించే సమయానికి, అల్-అజ్‌హర్ యూనివర్శిటీలో అప్పటికే 7,600 మంది విద్యార్థులు మరియు 230 మంది ప్రొఫెసర్లు ఉండేవారు.

1. ఇస్లామీయ యుగ ప్రారంభంలో, ఇస్లామిక్ సైన్సెస్‌కు సంబంధించి, ఒకటీ లేదా చాలా సబ్జక్టులను మరియు సాహిత్య కళలను మస్జిద్‌లలో బోధించేవారు.
2. కాని 9వ శతాబ్దం మధ్యభాగం గడిచిన తరువాత, ఎక్కువ సంఖ్యలో న్యాయశాస్త్రం వైపు వచ్చేవారు.

అల్-అజ్‌హర్ యూనివర్శిటీలో ఈజిప్ట్‌లోని ఇబ్నె తులున్ మస్జిద్‌లో ఖగోళశాస్త్రం మరియు ఇంజినీరింగ్, మెడిసిన్ మొ॥న సైంటిఫిక్ సబ్జక్టులను కూడా బోధించేవారు.

ఇక ఖరవియ్యీన్ యూనివర్శిటీలో బోధనాంశాలు ఏమిటంటే : Grammar (వ్యాకరణం), Rhetoric (సాహిత్య మీమాంస, వాక్చాతుర్యం), Logic (తర్కశాస్త్రం), Elements of Mathematics (గణితం) and astronomy (ఖగోళశాస్త్రం), History (చరిత్ర), Geography (భౌగోళిక శాస్త్రం) Elements of Chemistry (రసాయన శాస్త్రం).

ఖేరవ్వాన్ యూనివర్శిటీలో మరియు టునీశియాలోని జైతూనలో ఖుర్ఆన్ మరియు నాయశాస్త్ర మీమాంస (jurisprudence)తో పాటు చెప్పిన ఇతర బోధనాంశాలు: Grammar, mathematics, astronomy and medicine.

ఖేరవ్వాన్‌లో ప్రత్యేకంగా మెడిసిన్ క్లాసులను జైద్ ఇబ్నె ఖల్దూన్, ఇషాఖ్ ఇబ్నె ఇమ్రాన్ మరియు ఇషాఖ్ ఇబ్నె సులైమాన్ బోధించేవారు. వీరు రాసిన గ్రంథాలను 11వ శతాబ్దంలో Constantine The African అనువదించడం జరిగింది.

ఇటలీ ధక్షిణ ప్రాంతంలోని Salernoలో వైద్యశాస్త్రపు తొలి అధ్యాపకులకు అరబీ భాషనుండి అనువదించబడిన విషయాలనే బోధించేవారు. ఆ విధంగా ఈ ప్రాంతం లాటిన్ యూరప్‌లో ఉన్నత విద్యను బోధించే తొలి కేంద్రం అయింది.

జెరూసలెం నుండి ముస్లిమ్ పర్యాటకుడు మరియు భౌగోళికుడు అయిన అల్-ముఖద్దసి చెప్పిన దాని ప్రకారం **అమ్ర్ మస్జిద్** సాయంత్రపు రెండు ప్రార్థనల మధ్య కాలంలో, Law (న్యాయశాస్త్రం), ఖుర్ఆన్, Literature (సాహిత్యం), Wisdom (Philosophy or ethics) క్లాసుల విద్యార్థులతో నిండిపోయేది.

ఇరాఖ్‌లోని బాగ్దాద్ మస్జిద్‌లలో బోధించబడే అంశాలు :

Pharmacology, Engineering, Astronomy మరియు మరికొన్ని ఇతర సబ్జక్టులు. ఈ శాస్త్రాలను నేర్చుకోవడానికి సిరియా, పర్షియా మరియు ఇండియా నుండి విద్యార్థులు ఇక్కడికి వచ్చేవారు.

ఈ మస్జిద్‌లు ఉన్నత విద్యయొక్క విధి నిర్వహణను మరింత విశాలం చేసే బాధ్యతను తీసుకున్నాయి. ఈ వికాసాన్ని గమనించిన George Makdisi ఇలా చెబుతున్నారు. 10వ శతాబ్దంలో ఓ కొత్తరకమైన **College** (కాలేజ్) వికసించడం ఆరంభమైంది. **మస్జిద్** మరియు **ఖాన్** (లేదా inn - బయట ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులకు వసతి గృహం)ని కలిపి ఈ కొత్తరకమైన Collegeను ప్రారంభించారు.

**ఇస్లామీయ విద్యారంగంలో ఇది రెండవ దశ.**

కాలేజ్ అభివృద్ధికి సంబంధించిన ఈ రెండవ దశకు గొప్ప పోషకుడు బద్ర్ ఇబ్నె హసన్‌వైహ్ (d. 1014). బుయిద్‌ల ఆధీనంలో ఉన్న చాలా ప్రాంతాలకు ఈయన గవర్నర్‌గా ఉండేవారు. ఈయన గవర్నర్‌గా ఉన్న 30 సంవత్సరాల కాలంలో 3,000 **మస్జిద్ - ఖాన్** కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేశాడు.

ఇలా మస్జిద్‌తో **'ఖాన్'**ను కలపడానికి గల కారణాన్ని George Makdisi ఇలా వివరిస్తున్నారు: న్యాయశాస్త్రాన్ని పూర్తి చేయడానికి ఒకో విద్యార్థికి చాలాకాలం పట్టేది. Under graduatesకే సాధారణంగా 4 సంవత్సరాలు పట్టేది. గ్రాడ్యుయేట్ స్టడీస్‌కయితే 20 సంవత్సరాల వరకూ పట్టేది. ఇదే సమయంలో గ్రాడ్యుయేట్ విద్యనభ్యసించే విద్యార్థి తన టీచర్‌కి బోధనలో సహాయపడేవాడు.

కొన్ని ప్రత్యేక పరిస్థితులలో తప్పితే, మస్జిద్‌ను నివశించడానికి ఉపయోగించరాదు. అందుకని ఖాన్ (inn) టీచర్లకు మరియు విద్యార్థులకు వసతి గృహం అయింది. ఆ విధంగా 'ఖాన్' మస్జిద్‌కు ఆనుకుని ఉండేది.

**తరువాతి దశ 'మదరసా'.**

మక్‌దిసి ప్రకారం, **మస్జిద్ యొక్క బోధనా బాధ్యతను మరియు ఖాన్ యొక్క వసతి బాధ్యతను కలుపుతూ, అభివృద్ధి చెందిన 'ముస్లిమ్ కాలేజ్' యొక్క చివరి దశే - మదరసా.**

ముహమ్మద్(స)వారిచే పునరుద్ధరించబడిన ఇస్లాం ధర్మం యొక్క ప్రారంభంలో, పేద విద్యార్థులు మరియు వేరే ప్రాంతం నుండి వచ్చిన వారికోసం ఓ వసతి గృహం మస్జిద్‌తో కలుపబడి ఉండేది.

ప్రవక్త(స)వారి ఈ సాంప్రదాయాన్నే **మదరసా అనుసరించింది.**

వివిధ మస్జిద్‌లలోని విద్యార్థులకు అందే సహకారం చెప్పుకోదగ్గది. ఉదాహరణకు **ఖరవియ్యీన్‌లో విద్యార్థులకు కట్టవలసిన ఫీజునుండి మినహాయింపు ఇవ్వడమే కాకుండా, నియమిత కాలాలలో వారికి ఆర్థికంగా కూడా సహాయాన్ని అందించేవారు.** Bayard Dodge చెప్పిన దానిని బట్టి, నాలుగు ప్రక్కలా ఇళ్లతో మధ్యలో ఖాళీగా ఉండే రెసిడెన్షియల్ యూనిట్లలో (residential quadrangles) విద్యార్థులకు వసతిని కల్పించేవారు. ఈ బిల్డింగ్‌లు రెండు మరియు మూడు అంతస్థులతో విద్యార్థులు ఉండటానికి సౌకర్యంగా ఉండేవి. ఆహారం మరియు ఉండటానికి అవసరమైన కనీస సహకారం విద్యార్థులందరికీ అందేవి.

అల్-అజ్‌హర్ యూనివర్సిటీలో విద్యార్థుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండేది. ఈజిప్ట్‌లోని అన్ని ప్రాంతాలతో పాటు, మగ్‌రెబ్ మరియు పర్షియాలాంటి చాలా సుదూర ప్రాంతాల నుండి వచ్చిన విదేశీ విద్యార్థులు 750మంది వరకూ ఉండేవారని అల్-మఖ్రిజి చెప్పారు.

కైరోలో ఇళ్లులేని విద్యార్థులకు ఒకో రెసిడెన్షియల్ యూనిట్‌ని కేటాయించేవారని Bayard Dodge చెప్పారు. సాధారణంగా ఆ రెసిడెన్షియల్ యూనిట్‌లో విద్యార్థులకు ఉచితంగా భోజనం అందించబడేది. ఆర్థిక స్థోమత బాగున్న విద్యార్థులు మస్జిద్ దగ్గరలోని వసతి గృహంలో ఉండేవారు. ప్రతీ పెద్ద యూనిట్‌లో, ఓ లైబ్రరీ, వంటగది, లావెట్రీ మరియు పర్నిచర్ కోసం కొంత స్థలం ఉండేది. డమాస్కస్‌ని సందర్శించిన పర్యాటకుడు ఇబ్నె జుబైర్ - ఉమయ్యద్ మస్జిద్ వద్ద సందర్శకులకు మరియు విదేశీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన వివిధ సౌకర్యాలను, అధిక సంఖ్యలోనున్న అక్కడి విద్యార్థులను చూసేసరికి, అక్కడ అనుసరిస్తున్న ఉన్నత సాంప్రదాయం అతనిని ఇలా ప్రకటించేలా పురిగొల్పాయి :

**"విజయాన్ని వెతికే పాశ్చాత్య దేశీయుల నెవరినైనా సరే, ఈ (డమాస్కస్) నగరానికి చదువుకోవడానికి రానివ్వండి. ఎందుకంటే ఇక్కడ అందే సహకారం అవసరమైనదానికంటే చాలా ఎక్కువ. ఇక్కడి విద్యార్థికి ఆహారం, ఉండటానికి వసతులకు సంబంధించి, ఏ విచారం లేకుండా స్వేచ్ఛగా ఉన్నారు. ఇది చాలా గొప్ప సహాయం."**

మస్జిద్‌లు విద్యను అందించేలా చేయడంలో పాలకులు కూడా ముఖ్య పాత్రను పోషించారని చెప్పవచ్చు. ఖరవియ్యీన్‌లో 3 వేర్వేరు లైబ్రరీలు (గ్రంథాలయాలు) ఉండేవి. వాటిలో ప్రతిష్ఠాత్మకమైనది **అబూ ఇనాన్ లైబ్రరీ.** దీనిని మెరినిద్ సుల్తాన్ 'అల్-ముతవక్కిల్ అబూ ఇనాన్' స్థాపించారు.

ఈయనకు పుస్తకాలను చదవడం మరియు వాటిని సేకరించడం అంటే అత్యంత ఆసక్తి. మత ధర్మం, సైన్స్, మేధస్సు మరియు భాషకు సంబంధించి లభించిన కొత్త పుస్తకాలను ఈయన లైబ్రరీలో ఉంచేవారు. అంతేకాకుండా ఈ లైబ్రరీ యొక్క బాధ్యతలను చూడటానికి ఓ లైబ్రేరియన్‌ను కూడా నియమించారు.

టునీశియాలో, 1534 మరియు 1574 మధ్య కాలంలో టునిస్‌ని ఆక్రమించిన స్పానియర్డ్స్ (spaniards) అక్కడి మస్జిద్‌లను, లైబ్రరీలను కొల్లగొట్టారు. విలువైన ఎన్నో పుస్తకాలను, వ్రాతప్రతులను తొలగించారు.

ఆ తర్వాతి కాలంలో Ottomans , స్పానియర్డ్స్‌ని పారద్రోలి, జైతూన మస్జిద్‌ని, లైబ్రరీలను, మదరసాలను మామూలు స్థితికి తీసుకువచ్చి, మస్జిద్‌ను మరింత విశాలంగా చేశారు. ఆ విధంగా మరలా ఇస్లామీయ సంస్కృతికి ఉన్నత కేంద్రంగా చేశారు.

1365లో కైరోలో Mamluke రాకుమారుడు 'యల్బగా అల్-ఉమరి', ఇబ్నె తులున్ మస్జిద్‌లోని ప్రతీ విద్యార్థికి 40 దిర్హమ్‌లు, ఒక ఇర్దబ్ గోధుమలను ప్రతీనెలా ఇవ్వాలని ఆదేశించారు. ఈ పాలకులు అధిక సంఖ్యలోనున్న టీచర్లకి జీతాలు, విద్యార్థులకు స్టైఫండ్ (stipend) ఇచ్చేవారు.

ఈ ట్రెండ్‌ని ప్రత్యేకంగా ప్రోత్సహించినవారు సుల్తాన్ హుసామ్ అద్దీన్ లజిన్. కైరోలోని ఖతాయి జిల్లాలోని ఇబ్నె తులున్ మస్జిద్‌ని బాగుచేసి, అక్కడి ప్రొఫెసర్లకు జీతాలను, విద్యార్థులకు స్టైఫండ్‌ను ఇచ్చేవారు. వీరి రాజభవనం లోని ఫిజిషియన్ (వైద్యులు) షరాఫ్ అద్దీన్ ముహమ్మద్ ఇబ్నె అల్-హవాఫిర్‌చే మెడిసిన్‌లో లెక్చర్స్ ఇప్పించేవారు.

క్రింది సంఘటన అప్పటి ముస్లిముల జీవితాలని మరియు విద్యను గురించి చాలా గొప్పగా మనకి వివరిస్తుంది.

ఈజిప్టుని ఇబ్నె తులున్ పాలించేటప్పుడు, ఓ ప్రొఫెసర్‌గారి క్లాస్‌కి కొంతమంది విద్యార్థులు హాజరయ్యేవారు. సాంప్రదాయానికి సంబంధించి ఓ చిన్న భాగాన్ని ఆయన ప్రతీరోజూ విద్యార్థులకు డిక్టేట్ చేస్తుండేవారు. ఆ పని ఎలా ఉండేదంటే, వారు చదివే కోర్సు పూర్తికావడానికి ముందే, వారి దగ్గరున్న డబ్బులు ఖర్చు అయిపోయేవట. ఆఖరుకి వారి దగ్గరున్న వస్తువులు కూడా అమ్ముకోవలసి వచ్చిందట. మూడు రోజుల పాటు తిండిలేకుండా గడిపి, ఆఖరుకి వారికి అడుక్కునే పరిస్థితి వచ్చిందట. అంటే వీరు ఆత్మాభిమానంతో ఎవరికీ ఈ విషయం చెప్పలేదు. కాని వారిలో ఎవరికీ 'అడుక్కోవడమనే' అవమానాన్ని ఎదుర్కోవడం ఇష్టం లేదు.

కాబట్టి వారు చీట్లు వేశారు. దానిలో ఓడిన వ్యక్తి వారు నివశించే మస్జిద్ యొక్క మూలకి వెళ్ళి ఈ అవమానం నుండి తమను తప్పించమని 'అల్లాహ్'కు దువా చేసుకున్నాడు. ఆ తరువాత ఇబ్నె తులున్ పంపగా ఓ రాయబారి డబ్బు తీసుకుని వీరి దగ్గరికి వచ్చాడు. ఇబ్నె తులున్‌కి కలలో వీరికి సహాయం చేయమని హెచ్చరిక అందిందట. అంతేకాకుండా రాజు విద్యార్థులకు ఓ సందేశాన్ని కూడా పంపారు. అదేమిటంటే, ఆ మరుసటి రోజు వారిని ప్రత్యక్షంగా కలవాలను కుంటున్నారని. ఈ గౌరవం నుండి తప్పించుకోవడానికో, లేదా వ్యక్తిగత ప్రతిష్టగా భావించారో ఏమిటో, ఆ విద్యార్థులు ఆ రాత్రే కైరో విడిచిపెట్టి వెళ్ళిపోయారు.

వారు నివశించే చోట ఉండే మొత్తం వార్డ్‌ని కొని, మస్జిద్‌కి ఇబ్నె తులున్ అప్పగించేశారు, విద్యార్థులకు మరియు విదేశీయులకు వసతులు కల్పించడానికి.

ఏదో ఒక విషయంలోనే కాదు, ఎన్నో విషయాలలో యూరప్‌ని

ఇస్లాం ప్రభావితం చేసింది. ఆ తరువాత మిగతా ప్రపంచం కూడా ఇస్లామ్ యొక్క యూనివర్సాలిటీ (universality), బోధనా పద్ధతులు, డిప్లొమాలు ప్రధానం చేయడం మొ॥న వాటితో కూడిన విద్యావ్యవస్థ ద్వారా ప్రభావితం అయింది.

Georges Makdisi ఈ విషయానికి సంబంధించి కొన్ని ప్రధానమైన విషయాలను ఎత్తి చూపుతూ సరిగ్గా వివరించారు.

> Amongst others, Islam influenced the West and the course of university scholarship in terms of academic freedom of professors and students, in the doctoral thesis and its defence, and in the peer review of scholarly work based on the consensus of peers. The open scholarly discussions in the mosques surely accounted for much of that in times when scientific intolerance ruled elsewhere, and any free scholarly thought was punished with burning at the stake. The influence also came in the form of the many translated books of Islamic scholars which formed the core of European education in their first universities (Montpellier, Bologna, Paris, Oxford…), which all were founded in the twelfth-thirteenth centuries.

అంటే విద్యార్థులకు, టీచర్లకు విద్యా సంబంధిత విషయాలలో ఉండే స్వేచ్ఛ గురించి, నేడు Ph.D. డిగ్రీ కోసం ఏ పద్ధతినైతే మన యూనివర్శిటీల్లో పాటిస్తున్నామో, నేడు ఎంతో ఆధునికం, నాగరికం అనుకునే ఈ పద్ధతిని, శతాబ్దాల క్రితమే ఇస్లామీయ విద్య ప్రవేశ పెట్టిందని, అలాగే రీసెర్చ్ స్కాలర్ చేసిన వర్క్‌ని అనుభవజ్ఞులు విశ్లేషించి నిర్ణయాలు తీసుకోవడం, డాక్టరేట్ ప్రధానం చేయడం వంటి గొప్ప పద్ధతులను ప్రపంచానికి అందించింది ఇస్లామీయ విద్యావేత్తలే!

అప్పట్లో మిగతా ప్రపంచంలో సైన్స్ గురించి మాట్లాడితే, చెట్టుకు కట్టి కాల్చి వేసే కాలంలో, ఇస్లామీయ సామ్రాజ్యంలో మస్‌జిద్‌లలో జ్ఞానుల మధ్య బహిరంగ చర్చలు జరగుతుండేవి.

అంతేకాకుండా ఇస్లామిక్ స్కాలర్స్ యొక్క పుస్తకాలని యూరోపియన్ భాషల లోనికి అనువదించబడటం ద్వారా కూడా ఇస్లామీయ విద్య యొక్క ప్రభావం వారిపై పడింది. ఈ అనువదించబడిన పుస్తకాలే యూరప్‌లోని తొలి విశ్వవిద్యాలయ విద్యకు 'కేంద్రకం' అయ్యాయని చెప్పవచ్చు. ఈ విశ్వ విద్యాలయాలు యూరప్‌లో 12 మరియు 13వ శతాబ్దాల మధ్యలో ప్రారంభించబడ్డాయి.

**ప్రారంభ దశ నుండే ఇస్లామ్ మరియు జ్ఞానం కలిసి పయనించాయి. దివ్య ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స) వారి యొక్క బోధనలు ప్రజలలో విద్య నేర్చుకోవాలనే తపనను కలిగించాయి. ఇస్లామ్ యొక్క కాంక్రీట్ సింబల్ - మస్‌జిద్. ఇదే విద్యా సముపార్జనకు కేంద్రం అయింది.**

**- ముస్లిమ్ హెరిటేజ్ వారికి కృతజ్ఞతలతో**

(Dr. Salah Zaimeche, Ph.D. వారి వ్యాసంలోని కొంత భాగాన్ని మీకందించగలిగే భాగ్యాన్ని కలిగించిన అల్లాహ్‌తాలాకు కృతజ్ఞతలు. ఈ వ్యాసకర్తకు అల్లాహ్ శ్రేయో శుభాలను ప్రసాదించాలని కోరుకుంటున్నాము.)

ఈనాడు ప్రపంచవ్యాప్తంగా Modern Educationగా ప్రజలచే మెచ్చుకోబడుతున్న విద్యా వ్యవస్థకు స్థాపకులు ఇస్లామీయ విద్యావేత్తలే!

నేటి ముస్లిమ్ సమాజం ఖుర్'ఆన్ బోధనలకు, ముహమ్మద్(స) వారి ఆచరణకు దూరం కావడంతో, వెనుకబడిపోవడమే కాకుండా, గత ఇస్లామీయ చరిత్రను కూడా తెలుసుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుంది.

ఇంతకంటే దౌర్భాగ్యం మరెక్కడైనా ఉంటుందా?

ఇంట్లో ఖజానా ఉంచుకుని, వీధిలో అడుక్కోవడం లాంటి పరిస్థితి నుండి నేటి ముస్లిములు ఎప్పుడు బయటపడతారో!

నేటి ముస్లిం విద్యావేత్తలు, తమ డిగ్రీలు చూసుకుని, అందుకు కారణం తమ కృషియేనని, ముస్లిముల వెనుకబాటుతనానికి మాత్రం కారణం 'ఇస్లాం' అని భావిస్తూ, ఇస్లాం ధర్మం విద్యకు వ్యతిరేకమని తలస్తున్నారు. వీరు 'విద్య'లేని విద్యావేత్తలు. అంతేకాదు జ్ఞానంలేని జ్ఞానులు కూడా.

**ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స) వారి బోధనలచే ఎన్నో శతాబ్దాల క్రితం రూపుదిద్దుకున్న విద్యావ్యవస్థ ఈనాటికి కూడా అత్యంత నాగరికమైనదనే సత్యం తెలిసింది కదా!**

**భవిష్యత్తులో ఎన్ని శతాబ్దాలు గడచినా కూడా ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లు మానవాళికి ఆధునిక నాగరికతను నేర్పుతూనే ఉంటాయి.**


# 'శాంతిబాట'

**చందాదారులుగా చేరగోరువారు**

**క్రింది ఎడ్రస్‌కు రూ. 180/- M.O. చేయండి :**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**

2-8-31, కోట బజార్, సామర్లకోట-533440

మీ పూర్తి ఎడ్రస్ మరియు ఫోన్ నెంబర్లను, **M.O.** ఫామ్ క్రింది భాగాన గల ఖాళీలో వ్రాసి ఏ సంచిక నుండి మీకు శాంతిబాట పత్రికను పంపమంటారో తెలియజేయండి.

Contact :
Cell: **9491103017**
Email: **velugubaata@gmail.com**

### మనిషి కోతినుండి పరిణామం చెందాడనే

# డార్విన్ సిద్ధాంతం - శాస్త్రీయ వాస్తవం కాదు.

పై సిద్ధాంతాన్ని తప్పు అని నిరూపించే వ్యాస క్రమంలో ఈ నెల అద్నాన్ అక్తర్ గారి (అందరికీ హారున్-యహ్యా గా ఈయన సుపరిచితమే) వీడియో **MIRACLE IN THE EYE** (Documentary Film) ను www.harunyahya.net నుండి డౌన్‌లోడ్ చేసి తెలుగులో మీకందిస్తున్నాం.

## కంటిలో అద్భుతం - 2

**మనిషి జంతువు నుండి పరిణామం చెందలేదని, అలాగే జీవం అనుకోకుండా ఏదో యాధృచ్ఛికంగా సృష్టింపబడలేదని, వాటిని సృష్టించడంలో ఎంతో వివేకముందని, సృష్టికర్త intelligent design వాటిలో కన్పిస్తుందని, అందరికీ అర్థమయ్యే విధంగా చెప్పాలని ప్రపంచంలోని ప్రముఖుల పరిశోధనలకు సంబంధించిన కొన్ని వ్యాసాలను ఎంపిక చేసుకున్నాము.**

**ఎక్కడో ఉన్న సృష్టికంటే, ముందుగా మనలోనున్న అత్యంత గొప్ప టెక్నాలజీ గురించి తెలియజేస్తే, సృష్టికర్త 'అల్లాహ్' యొక్క అద్భుత సృష్టి గురించి ప్రాథమిక విషయాలు అర్థమవుతాయని చేసిన కృషిలో, మొదటి సంచికలో 'కణం' గురించి, రెండవ సంచికలో 'కన్ను' గురించి చెప్పడం జరిగింది.**

**కన్ను గురించి చెప్పవలసిన వ్యాసం, స్థలం లేక, కొంత భాగమే అందించాము. ఈ సంచికలో మరికొంత భాగాన్ని అందిస్తున్నాము.**

**మొదటి సంచికలో 'కణం' గురించి చెప్పిన విషయాలు సైన్స్ విద్యార్థులకే అర్థమవుతాయిగాని, సామాన్య ప్రజానీకం అర్థం చేసుకోలేరని కొందరు సోదరులు చెప్పడంతో, హారూన్-యహ్యా గారి వ్యాసాన్ని మక్కీకి మక్కీ అనువాదం చేయకుండా, సులభంగా అర్థం చేసుకోవడానికి వీలుగా, మరికొన్ని ఉదాహరణలను చొప్పించి, వారి వ్యాసానికి కొన్ని మార్పులు చేయడం జరిగింది.**

**అయినప్పటికీ, ఈ వ్యాసాన్ని అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురైతే, మాకు తెలియజేయండి. ఏ విషయాలు అర్థం కాలేదో తెలియజేస్తే వాటి ప్రకారం మార్పులు చేయడానికి, ఇన్షా అల్లాహ్, ప్రయత్నిస్తాం.**

*(గత సంచిక తరువాయి)*

**మనం ఏమైతే చూస్తున్నామో వాటి గురించి తెలుసుకోవడం :**

మానవుని మెదడులో తను చూసే దృశ్యాలు దాచబడతాయి. ఈ విధంగా మెదడులో దాచబడిన సమాచారాన్ని మరలా ఉపయోగించుకోవడానికి జ్ఞాపకం చేసుకోవడం జరుగుతుంది.

మనం ఏదైనా ఓ వస్తువుని గాని, ఓ వ్యక్తిని గాని మొదటిసారి చూసినప్పుడు ఉదాహరణకు ఆ వస్తువు లేదా వ్యక్తి కొరకు మన మెమొరీ (జ్ఞాపకశక్తి)లో ఓ కొత్త ఫైల్ ఓపెన్ అవుతుంది.

ఆ తర్వాత, ఎప్పుడైనా అదే దృశ్యాన్ని మరలా మనం చూసినప్పుడు, మన జ్ఞాపకపొరలలో నున్న ఫైల్ తిరిగి తెరచుకుని, ఆ ఫైల్‌లో భద్రపరచబడిన దృశ్యంతో, ఈ దృశ్యాన్ని పోల్చి చూసుకుంటుంది.

ఉదాహరణకు మన్‌మోహన్‌సింగ్ గారిని మొదటిసారి చూసినప్పుడు, ఆయన యొక్క ఫొటో మన మెదడులో మన్‌మోహన్‌సింగ్ గారి పేరుమీద రికార్డ్ అవుతుంది. ఆ తర్వాత మరెప్పుడైనా, ఆయనను చూసినపుడు, మన మెదడులోని ఫైల్‌లో ఉన్న మన్‌మోహన్‌సింగ్‌గారి ఫొటోతో పోల్చుకోవడం జరగుతుంది. పోలిక సరిపోతే మనం చూసే వ్యక్తి మన్‌మోహన్‌సింగ్ అని మనకు తెలుస్తుంది.

ఈ విధంగా మనం చూసే దృశ్యాలను మన మెదడు నిర్ధారిస్తుంది.

ఈ విధంగా జరగడం మానవులందరిలోనూ ఆటోమెటిక్‌గా జరిగిపోతుంది. చిన్నపిల్లల నుండి పెద్దల వరకూ ఈ వ్యవస్థ అందరి మెదళ్ల లోనూ ఒకే విధంగా పనిచేస్తూ ఉంటుంది.

మనకు తెలియకుండా జరుగుతున్న ఇటువంటి పనుల గురించి మనకు ఎప్పుడు స్పష్టంగా తెలుస్తుంది? మన మెదడులోని ఈ వ్యవస్థ పనిచేయకుండా ఆగిపోయినపుడు మాత్రమే తెలుస్తుంది.

**(ఈ విషయం అర్థం కావడానికి వీడియోలో చూపబడిన ఓ సన్నివేశం గురించి ఇక్కడ వర్ణిస్తున్నాము)**

డాక్టర్ చూపిస్తున్న ఫొటోలను గుర్తు పట్టడానికి ఓ ముసలాయన ప్రయత్నిస్తున్నాడు. ఈయన కొద్ది క్షణాల క్రితం చూసిన దృశ్యాలు కూడా అతని మెదడులోని జ్ఞాపకాల నుండి మాయమవుతున్నాయి. అంటే కాసేపటి క్రితం చూసిన వాటిని కూడా మర్చిపోతున్నాడు.

"ఈ ఫొటోలలో కన్పిస్తున్న వ్యక్తి తెలిసినవాడులా అనిపిస్తున్నా సరే, ఆయనెవరో నాకు తెలియదు."

"ఆయనెవరో నేను చెప్పలేను."

ఆ విధంగా ఆయన గుర్తు పట్టని వ్యక్తులలో ఆయన భార్య కూడా ఉంది. ఆమె అతనితో 48 సంవత్సరాలుగా కాపురం చేసింది కూడా. అలాగే కొద్దిసేపటి క్రితం తన చేతిలో చేతినుంచుకుని నడిపించుకుని తీసుకుని వెళ్ళిన తన మనుమడిని కూడా అతను గుర్తుపట్టలేడు.

మనుష్యుల ముఖాలను కనుగొనే శక్తిని, తనకు జరిగిన బ్రెయిన్

ఆపరేషన్ ఫలితంగా ఈయన కోల్పోయాడు.

ఆయన యొక్క ఈ పరిస్థితిని స్వయంగా ఆయన యొక్క మాటలలోనే తెలుసుకుందాం:

"ఒక షాపు ముందు ఇద్దరు స్నేహితులతో నా కుమారుడు నిలుచున్నప్పుడు, వారి ముఖాలను నేను గుర్తు పట్టలేకపోతున్నానని నేను గ్రహించడమే మొదటి ఉదాహరణ. "ఆ ముగ్గురిలో కనీసం ఒక్కరి గురించి నేను తెలుసుకోవాలి. అందుకోసం వారివైపు నడచివెళ్తూ వారి ముఖాలను అధ్యయనం చేస్తున్నాను. వారి మధ్యలోని ఒకరు 'హాయ్ డాడ్' అని పిలిచేవరకూ, వారిలో ఎవరు నా కొడుకో నాకు ఐడియా లేకుండా పోయింది".

- ఎవరినైనా కనుగొనడానికి ప్రయత్నించడం పెద్ద విషయం కాకపోయినా, వారు నాకు ఎంత బాగా తెలుసు అనే విషయం తెలియడం నాకు అసాధ్యమైన పని అయిపోయింది.

- నేను పిల్లల కోసం బీచ్‌కి వెళ్ళవలసి వస్తుంది. అంతవరకూ బాగానే ఉంటుంది. ఆ బీచ్‌లోని అంతమందిలో నా పిల్లలిద్దరినీ కనుగొనడం ఎలా?

ఇతని కొడుకు తన తండ్రి యొక్క ఆరోగ్యలోపాన్ని ఈ విధంగా వర్ణించారు.

"మీరు నా ముఖాన్ని చూసినప్పుడు, నా మొత్తం ముఖాన్ని ఒకే పిక్చర్‌గా చూడగలుగుతారు. (అలా చూడటంలో) నా చెవులు చిన్నవా? పెద్దవా? చిన్న ముక్కా? లేదా నా కళ్ళ యొక్క రంగు ఏమిటో మీరు చూడగలరు. (కాని) ఈయన మిమ్మల్ని చాలా దగ్గరగా చూడవలసి వస్తుంది. ఈయన మీ ఎడమ కన్నును చూడగలడు, ఆ తర్వాత మీ ముక్కును చూడగలడు, మీ పెదవులను మరియు మీ నోటిని చూడగలడు. కాని ఈయన సమస్య ఏమిటంటే, ఇలా విడివిడిగా చూసిన వీటన్నింటినీ ఒకేసారి ఒకే పిక్చర్‌లో పెట్టలేడు."

అంటే మీ ముఖంలో భాగాలను చూడగలడు గాని ఒకేసారి మీ ముఖాన్నంతటినీ చూసి పోల్చుకోలేడు.

ఇక్కడ స్పష్టంగా తెలిసేది ఏమిటంటే, మన మెదడులో జరగవలసిన అవసరమైన పనులు నిరంతరం ఆగకుండా జరుగకపోతే, మనం ఏ ఎన్విరాన్‌మెంట్‌లో నివశిస్తున్నామో, ఆ ఎన్విరాన్‌మెంట్‌లోని మనచుట్టూ ఉన్న వాటినీ, మనకు ప్రియమైన వారిని గుర్తుపట్టలేం!

పైన చెప్పిన ముసలాయన మాటలు మరొకసారి మనకు ఓ వాస్తవం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాయి.

**- "ముఖాన్ని గుర్తించడం ఎంత ముఖ్యమో, దానిని పోగొట్టుకునే వరకూ నేను ఎన్నడూ అర్థం చేసుకోలేకపోయాను."**

ప్రతీరోజూ మరలా మరలా మనం ఉపయోగించుకోవడానికి వీలుగా మన మెదడు కొన్నింటిని రికార్డ్ చేసుకుని భద్రపరచుకుంటుంది.

కాని ఈ దృశ్యాలు ఎక్కడ రికార్డ్ చేయబడతాయి?

ఎలా రికార్డ్ చేయబడతాయి?

ఏ విధంగా మరియు ఎవరిచే అవి రికవర్ చేయబడతాయి?

ఉదాహరణకు కంప్యూటర్‌లో సమాచారాన్ని హార్డ్ డిస్క్‌లోగాని, సిడిలలో గాని, డివిడి లలోగాని స్టోర్ చేస్తారు. అయితే వాటియొక్క కెపాసిటీ చాలా తక్కువ.

కంప్యూటర్ గురించి తెలియనివారికి చాలా స్పష్టంగా అర్థం కావడానికి ఓ ఉదాహరణను ఇక్కడ అందిస్తున్నాము.

ఒక వ్యక్తి తన గత 20 సంవత్సరాల నుండి చేస్తున్న ప్రతీపనిని ఓ వీడియోలో రికార్డ్ చేయించుకుంటున్నాడు అనుకుందాం.

అంటే 20 x 365 రోజులు = 7,300 రోజులు. రోజుకి 24 గంటలు కాబట్టి, ఒక రోజును పూర్తిగా మంచి క్వాలిటీలో రికార్డ్ చేయడానికి 6 డివిడిలు అవసరం అనుకుందాం. మరి 7,300 రోజులను పూర్తిగా రికార్డ్ చేయడానికి 7,300 x 6 = 43,800 డివిడిలు కావాలి.

పోనీ 40,000 డివిడిలు అవసరం అనుకుందాం. ఈ 40వేల డివిడిలలో ఆ వ్యక్తి యొక్క గడచిన 20 సంవత్సరాల జీవిత విషయాలున్నాయన్నమాట.

ఆ వ్యక్తి ఓ పది సంవత్సరాల క్రితం అంటే 1999 సంవత్సరం అక్టోబర్ 2వ తారీఖున జరిగిన ఓ ముఖ్య సంఘటనను గుర్తు చేసుకున్నాడు. ఆ సంఘటన గురించి అతనికి ఆలోచన వచ్చిన మరుక్షణమే ఆయన మెదడులో అప్పటి సంఘటన కదలాడింది. మరలా ఆ సంఘటన తన కళ్ళ ముందు జరుగుతున్నట్లుగా తెలుస్తుంది. ఒక సెకను కంటే అతి తక్కువ కాలంలో ఇది జరిగింది.

మరి ఇదే సంఘటనను ఆ 40వేల డివిడిలలో వెతకడానికి మీకు ఎంత సమయం పడుతుంది?

ఆ 40వేల డివిడిలను ఉంచడానికి ఎంత స్థలం కావాలి?

కాని ఇన్ని వేల డివిడిలలో పట్టే సమాచారమంతా, మెదడులోని ఓ అతి చిన్న ప్రదేశంలో నిక్షిప్తం అయి ఉందంటే, అది ఎంత అద్భుతం!

మన కనుల కుండే లెన్స్‌ల ద్వారా మనం చూస్తున్న ప్రతీ విషయం రికార్డ్ అవుతుందన్న విషయం మనలో చాలామందికి తెలియదు. ఒకొక్కసారి మనం ఏదో ఆలోచనలో ఉన్నప్పుడు మన ముందు జరగుచున్న విషయం (లేదా) మన కనులు చూడగలిగేంత దూరంలో జరగుచున్న విషయాలను మనం గమనించం.

కాని ఎవరైనా హిప్నాటిస్ట్, మనల్ని హిప్నటైజ్ చేసి, ఫలానా రోజు మీరు నడుస్తూ వెళుతున్నప్పుడు, మీ ముందు వెళుతున్న కారు నంబర్ చెప్పండి అని అడిగినప్పుడు, చెప్పగలుగుతాడు. ఇది ఎలా సాధ్యం?

ఇది సాధ్యమైంది అంటే మనం పట్టించుకోని చాలా విషయాలు కూడా మన మెదడులో రికార్డ్ అవుతున్నాయని తెలుస్తుంది.

పైన చెప్పుకున్నట్లు, ప్రస్తుతం అందుబాటులోనున్న టెక్నాలజీ ద్వారా 20 సంవత్సరాల జీవితాన్ని రికార్డ్ చేయడానికి 40వేల డివిడిలు కావాలి.

సైన్స్ లేదా ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు, పై విషయాలు చదివి డివిడి కంటే ఎక్కువ సమాచారాన్ని రికార్డ్ చేసుకునే పరికరాలు కూడా ఉన్నాయని చెప్పవచ్చు. కాని పెద్దగా చదువుకోలేని వారికి కూడా ఈ వ్యాసం అర్థం కావాలనే ఉద్దేశ్యంతో ఇక్కడ డివిడిల గురించి చెప్పడం జరిగింది.

డివిడిలు మాత్రమే కాకుండా ఏ మెమొరీ డివైస్‌ను మీరు తీసుకున్నా సరే, ఈ వ్యాసంలో చెప్పబడిన విషయాలకు సరిపోతుంది. There is no contradiction at all.

**సృష్టికర్త అయిన అల్లాహ్ మానవ శరీర లోతులలో, కంటికి కనిపించని చిన్న ప్రదేశాలలో కూడా అద్భుతాలను ఉంచాడు. అవి మానవుడు అర్థం చేసుకోవడానికి అతీతంగా ఉన్నాయి.**

కళ్ళతో చూసే ఈ చూపుకు సంబంధించిన ఇంద్రియ జ్ఞానం మరియు అందులో దోషంలేని ఆ వ్యవస్థలు, అల్లాహ్ యొక్క అంతులేని శక్తిని మనకు తెలియజేస్తున్నాయి.

ప్రతీ క్షణం, మనం గ్రహించే ప్రతీ దృశ్యం, అల్లాహ్ ఇష్ట ప్రకారమే జరుగుతుంది. ఆ కారణం చేతే, ప్రతీ క్షణం మనం చూసేది మనకోసం విడిగా ఓ పరీక్షే! ఈ వాస్తవం ఖుర్ఆన్‌లో తెలియజేయబడింది.

**"నిశ్చయంగా, మేము మానవుణ్ణి ఒక మిశ్రమ బిందువుతో సృష్టించాము. అతనిని పరీక్షించటానికి, మేము అతనిని వినేవాడిగా, చూసేవాడిగా చేశాము." (దివ్య ఖుర్ఆన్ 76:2)**

(ఈ వాక్యాంలోని మిశ్రమ బిందువు గురించి మరింతగా అర్థం చేసుకోవాలనుకునేవారు, 'ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ, వైజాగ్' వారిచే పబ్లిష్ కాబడిన ఖుర్ఆన్ మరియు ఆధునిక సైన్స్ చూడండి)

**రెండు కళ్లు - ఒకటే చూపు**

మనం రెండు కళ్ళతో పుట్టామని తెలుసుకాని, ఒకే చూపుకు రెండు కళ్ళు ఎందుకు అని మనం ఎప్పుడైనా ఆలోచించామా? వాస్తవానికి ప్రతీకన్ను దానికంటూ విడిగా ఓ దృశ్యాన్ని ఏర్పరచుకుంటుంది. ప్రతీ కన్ను విడివిడిగా దృశ్యాలను ఏర్పరచుకుంటే, మరి రెండు కళ్ళు ఎందుకు? ఒకటి చాలు కదా! అని అనిపిస్తుంది.

రెండు కళ్ళ మధ్య దూరం సుమారుగా 5 సెంటీమీటర్లు ఉంటుంది. అలాగే బాహ్య ప్రపంచంతో ఒకొక్క కన్ను ఒకొక్క దృక్కోణాన్ని కలిగియుంటుంది.

2-డైమన్షన్‌లో ఒకొక్క కన్నుకు అందిన దృశ్యాన్ని మెదడు స్వీకరించి, ఈ రెండు కళ్ళనుండి రెండు 2-డైమన్షన్ దృశ్యాలని కలిపి త్రీ డైమన్షన్‌లో (అంటే త్రీడీ)లో దృశ్యాన్ని సృష్టిస్తుంది. ఆ విధంగా రెండు కళ్ళనుండి అందిన దృశ్యాల మధ్య ఉండే తేడాలను గమనించి, ఆ దృశ్యాలు ఎంత దూరంలో ఉన్నాయి, ఏ డెప్త్‌లో ఉన్నాయనేది మెదడు నిర్ధారిస్తుంది.

ఒకవేళ రెండు కళ్ళనుండి అందిన రెండు దృశ్యాలను సరిగ్గా గనుక మెదడు కలపలేకపోతే, మనకు ఒకే దృశ్యం రెండుగా కనిపిస్తుంది. అంతేకాకుండా అది టూ డైమన్షన్‌లోనే ఉంటుంది.

ఈ విషయం అర్థం కావడానికి ఓ ఉదాహరణ : ఏదైనా చెట్టు కొమ్మలను రెండు కళ్ళతో చూడండి. కాస్సేపటి తరువాత ఒక కన్నును మూసుకుని, రెండవ కన్నుతో మీ దృష్టిని ఆ కొమ్మలపై సారించండి.

ఒక నిమిషం తరువాత మీ కన్ను తెరవండి. ఆ కొమ్మలు ఇంతకు ముందరి కంటే ఇప్పుడు మరింత దూరంగా ఉన్నట్లు తెలుస్తుంది.

మరొక ఉదాహరణ: మీరు ఒక కన్ను మూసుకుని, సూదిలోకి దారాన్ని ఎక్కించడానికి ప్రయత్నించండి. ఇది అసాధ్యంగా అనిపిస్తుంది. ఎందుకుంటే ఒకే కన్నుతో చూసే ఏక దృశ్యం వలన డెప్త్ సరిగ్గా తెలియదు.

రెండు విడి విడి దృశ్యాలు కలిసి ఒకే త్రీడీ దృశ్యంగా కనిపించాలంటే, ఎంత ఖచ్చితంగా మెదడు లెక్కగట్టాలో ఆలోచించండి. ఇది అర్థం కావాలంటే మరొక సింపుల్ ఉదాహరణ చెప్పాలి. మీరు కలర్ వాల్‌పోస్టర్లను చాలాసార్లు చూసే ఉంటారు. ఒకొక్కసారి వాల్‌పోస్టర్‌పై ఒకే బొమ్మ, రెండింటిగా కొంచెం తేడాతో వేరే రంగులో కనిపిస్తుంది. బ్లర్‌గా కనిపిస్తుంది. సాధారణంగా పోస్టర్ ప్రింట్ చేసేటప్పుడు, 4 రంగులతో 4 ప్లేట్లు ఉపయోగించి ప్రింట్ చేస్తారు. అందులో ఏ ఒక్క ప్లేట్ కొంచెం ప్రక్కకి జరిగినా చాలు, ప్రింట్ అయిన బొమ్మ కదిలిపోయినట్లు కనిపిస్తుంది. అందుకోసం ప్రెస్‌లో చాలా శ్రద్ధ తీసుకుని, జాగ్రత్తగా ప్లేట్ల స్థానాలను సరిచేస్తారు.

మరి మన మెదడు ఎంత శ్రద్ధ తీసుకుంటుందో ఇప్పుడు మీ కర్థమై ఉంటుంది. ఒక సెకనులో ఎన్నో దృశ్యాలను కళ్ళు మెదడుకు పంపుతూ ఉంటాయి. ఈ ఫ్రేమ్‌లన్నింటిని జాగ్రత్తగా, అతి తక్కువ సమయంలో కలిపి మనకు నిరంతరంగా మన ముందరి ప్రపంచం కనిపిస్తూ ఉండేలా చేస్తుంది మన మెదడు.

ఒక నిమిషంలో మెదడు చేసే కాల్‌క్యులేషన్స్‌ని, మనం కాల్‌క్యులేటర్ ఉపయోగించి చేస్తే, ఎన్ని గంటలు పడుతుందో తెలుసా?

ఇలాంటి లోపంలేని వ్యవస్థను సృష్టించింది మరెవరో కాదు, సర్వమూ తెలిసిన సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌యే. అల్లాహ్ సృష్టిలో లోపం లేకపోవడాన్ని క్రింది ఖుర్ఆన్ వాక్యం ద్వారా తెలుసుకోవచ్చు.

**ఆయనే, ఒకదానిపై ఒకటి ఏడు ఆకాశాలను సృష్టించాడు. ఆ అనంత కరుణామయుని సృష్టిలో నీవు ఎలాంటి లోపాన్నీ చూడలేవు. కావాలంటే మరొకసారి చూడు: "ఏమీ? నీకేమైనా లోపం కనిపిస్తుందా?"**

(ఖుర్ఆన్ 67:3)

ఒక సోదరుడు పై ఆయత్ విషయంలో ఓ సందేహాన్ని వెలిబుచ్చారు. అదేమిటంటే, మనిషిని అల్లాహ్ సృష్టించారు కదా, మరి అవిటి వాడు ఆయన సృష్టి యొక్క లోపం కాదా? ఇక్కడ లోపం లేకపోవడమనేది ఆయన యొక్క అద్భుత టెక్నాలజీలో. మనిషి కళ్ల మరియు మెదడులో అద్భుతమైన టెక్నాలజీ ఉంది. ఆ టెక్నాలజీలో లోపం లేదు.

ఉదాహరణకు ఒక సెల్‌ఫోన్ సరిగ్గా పనిచేయకపోతే, ఆ లోపం ఆ సెల్‌లో ఉందిగాని, సెల్‌ఫోన్ టెక్నాలజీలో కాదు. ఇక్కడ స్థలంలేక ఈ వివరణను ఇక్కడితో ఆపేస్తున్నాము. మరోచోట వీలున్నప్పుడు మరి కాస్త వివరంగా అందిస్తాము. **(మరికొంత భాగం వచ్చే సంచికలో ...)**

3

ఒక విషయంలో జ్ఞాని అయినవాడు, అన్ని విషయాలలోనూ జ్ఞాని కాకపోవచ్చని ఉదాహరణ పూర్వకంగా క్రిందటి సంచికలో వివరించాము. లెక్కలు చేయడంలో జ్ఞానమున్న ఓ ఉపాధ్యాయుడు, లెక్క సరిగ్గానే చేసినప్పటికిని, తన పిల్లలను నదిలో కోల్పోయి, చిన్న విషయంలో ఎలా అజ్ఞాని అనిపించుకున్నాడో చెప్పడం జరిగింది.

"ఖుర్'ఆన్ నన్ను హేతువాదిని చేసింది" అని చెబుతూ 'జ్ఞానిగా' ఫీలయ్యే ఇ.ఏ.జబ్బార్ అనే అజ్ఞాని వ్రాసిన వ్యాసాన్ని తప్పుపడుతూ, ఆ వ్యాసంలోని అజ్ఞాన విషయాలను, జ్ఞానానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథ విషయాలతో వివరించడంతో ఈ శీర్షికను ప్రారంభించాము.

(ఖుర్'ఆన్ నన్ను హేతువాదిని చేసింది, పత్రిక పేరు: **నాస్తిక యుగం**, సంపుటి 4, సంచిక 1-2, ఎడిటర్: గొ॥ జయగోపాల్, పత్రిక చిరునామా: 10-15-3, పిఠాని వీధి, విశాఖపట్నం - 530 002)

నాస్తికులు స్వయంగా తమను తాము జ్ఞానులుగా భావిస్తూ, తమ అజ్ఞానాన్ని వారి స్వీయ పత్రికల ద్వారా ఎలా పంచిపెడుతున్నారో వివరించి, వారి వలన సమాజానికి ఎంత నష్టం జరుగుతుందో జరిగిన వాస్తవ సంఘటనల ద్వారా మీముందుంచాము.

ఇ.ఏ. జబ్బార్ చెప్పినవన్నీ అసత్యాలని బుజువుచేయడం పూర్తి అయినప్పటికిని, బానిసత్వానికి సంబంధించిన ఓ అంశం మిగిలిపోయింది. ఆ అంశాన్ని ఈ సంచికలో అందిస్తామని తెలియజేశాము.

ఇ.ఏ.జబ్బార్ వేసిన అపనింద :

**"ముహమ్మద్ కాలం నాటి సాంఘిక వ్యవస్థ బానిసత్వంతో వుంది. ఖుర్'ఆన్ వెల్లడించిన నైతిక సూత్రాలు కూడా బానిసత్వంలోంచే వచ్చాయి. బానిసలైన ఆడపిల్లలతో సెక్స్ సంబంధాలుంచు కోవచ్చని ఖుర్'ఆన్ అనుమతిస్తోంది. కాని నా నీతి, నా మనస్సాక్షి మాత్రం 'అది దేవుని మాట' అని అంగీకరించలేదు."**

పై అపనిందకు పూర్తి వ్యతిరేకంగా, యుగాల నుండి ఉన్న బానిసత్వాన్ని రూపు మాపడానికి ఎవరూ చేయలేని పనిని, ముహమ్మద్(స)వారు ఏ విధంగా సంస్కరణ చేసి కేవలం 23 సం॥లలో విజయం సాధించారో కొంత భాగం క్రిందటి సంచికలో అందించాము. మిగిలిన ఆ కొద్ది భాగాన్ని ఇక్కడ అందిస్తున్నాము.

**(గత సంచిక తరువాయి)**

బానిసలకు స్వేచ్ఛను కలిగించడమే కాదు, వారికి సమాజంలో సమాన హెూదాను కూడా కల్పించాలి. ఈ రెండు దశలూ చాలా ముఖ్యమైనవి.

ఈ రెండు దశలలోనూ, అల్లాహ్ యొక్క సందేశహరులు - ముహమ్మద్(స) వారు గొప్ప విజయాన్ని సాధించారు. 'ఇస్లాం' ధర్మం చూపించిన మర్చిపోలేని గొప్ప అద్భుతాలలో ఇది ఒకటి.

ఏదైనా ఒక దురాచారాన్ని సమాజంలో నుండి దూరం చేయాలంటే, ముందుగా మనుషులలో మార్పు రావాలి. మానసిక పరివర్తన కలుగకుండా, బలాన్ని ఉపయోగించి ఎంత కృషి చేసినా, అది తగ్గకపోగా, కనిపించని విధంగా సమాజంలో మరింతగా పాతుకుపోయే ప్రమాదముంది.

కాబట్టి ముహమ్మద్(స)వారు సమాజంలోని దురాచారాలను అవి చిన్నవైనా, పెద్దవైనా సరే, ప్రజల మనస్సులలో పరివర్తన తీసుకువచ్చి, వాటిని దూరం చేశారు. ఒక రక్తపుబొట్టు కూడా క్రింద పడకుండా, ఎటువంటి ఘర్షణలకు అవకాశం లేకుండా వ్యభిచారం, జూదం, మధ్యపానం, బానిసత్వం మొ॥న వాటిని ఖుర్'ఆన్ గ్రంథం ద్వారా పారద్రోలారు.

ముహమ్మద్(స)వారు బోధించిన విధానాలు అన్ని కాలాలలోనూ, అన్ని ప్రాంతాలలోనూ ఆచరణయోగ్యమైనవి.

ప్రపంచంలోని ఏ సోషల్ సైంటిస్ట్ (సామాజిక శాస్త్రవేత్త) అయినా కనీసం ఒక్క దురాచారం విషయంలో కూడా పూర్తిగా విజయవంతులు కాలేదు. ఏదైతే ఈనాడు సమాజానికి ప్రమాదంగా దాపురించిందో, అటువంటిది ఈనాడే కొత్తగా సమాజంలో చూస్తున్నామా? లేక పూర్వపు సమాజాలలో ఇటువంటి సమస్య కూడా ఉందా? ఒకవేళ ఉంటే, దాని నిర్మూలన కోసం వారు ఏ మార్గాన్ని అనుసరించారు? మొ॥న విషయాలను ఏ శాస్త్రవేత్త అయినా లేదా ఏ వివేకవంతుడైనా సరే అధ్యయనం చేయవలసి ఉంది.

ఉదాహరణకు ఓ లాయర్‌గారు, ఏదైనా ఓ కేస్ గురించి ఆలోచించే టప్పుడు, అలాంటి కేస్ అంతకు ముందు కూడా వచ్చిందేమో, ఒక వేళ వచ్చి ఉంటే, ఆ కేస్ విషయంలో తీర్పు ఎలా వచ్చింది? ఒకవేళ ఆ తీర్పు గనుక తమకు అనుకూలంగా ఉంటే, అది కూడా జడ్జిగారికి విన్నవించు కోవడానికి, పాత రికార్డులను తిరగేస్తారు కదా!

కాబట్టి సామాజిక శాస్త్రవేత్తలుగాని, చరిత్రకారులుగాని చరిత్రలో 23 సం॥ల అతి తక్కువకాలంలో ముహమ్మద్(స)వారు సంస్కరణలను ఎలా ప్రతిపాదించారో, వాటిని ఎలా విజయవంతంగా అమలు చేశారో, వాటిని సమాజంలోని అన్ని వర్గాలు ఎలా ఆమోదించాయో మొ॥న విషయాలను ఎందుకు అధ్యయనం చేయలేకపోయారు?

ఇప్పటికీ ఆ పని ఎందుకు చేయలేకపోతున్నారు?

ఆయన(స)వారి బోధనల ద్వారా బానిసత్వం అనేది తుడుచుపెట్టుకు పోవడం మొదలైంది. జైద్ బిన్ హారిస్(రజి)వారికి స్వేచ్ఛనిచ్చి ఆయనని తన దత్తపుత్రునిగా ముహమ్మద్(స)వారు ప్రకటించిన విషయం క్రిందటి సంచికలో వివరించడం జరిగింది.

ఆ జైద్(రజి)వారికి అప్పటి సమాజంలో ఉన్నత వంశస్థురాలుగా నున్న తన బంధువుల అమ్మాయినిచ్చి వివాహం చేసి, సమాజంలోని ఉన్నత వర్గం, బడుగువర్గాల మధ్యన ఉండే అతిపెద్ద తేడాను ముహమ్మద్(స) వారు తుడిచేశారు.

ఒక మనిషిపై సమాజంలోని మరోమనిషి అధికుడని చెప్పడానికి ఏకైక ఇస్లామీయ ప్రమాణం ఉంది - అదే ధర్మ పరాయణత! దైవభీతి ఎక్కువుగా ఉండి ఏ వ్యక్తి అయితే ధర్మంగా బ్రతుకుతాడో అతనే ఉన్నతుడు.

స్వేచ్ఛనిచ్చిన బానిసకు ఉన్నత వంశానికి చెందిన మరో వ్యక్తితో వివాహం జరపడంతోనే సరిపెట్టలేదు. స్వేచ్ఛనిచ్చిన వారికి మరియు స్వేచ్ఛ పొందినవారికి మధ్య బలమైన మరో బంధాన్ని కూడా ఏర్పరిచింది ఇస్లాం.

''సహీహ్ ముస్లిమ్ గ్రంథం 4వ సంపుటిలో 20వ పుస్తకం-2వ అధ్యాయంలోని 3799 హదీస్‌లో ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం ఉంది. అది చాలా పెద్ద హదీస్. ఆ ఉల్లేఖనం ప్రకారం, స్వేచ్ఛనొసంగినవారికి, స్వేచ్ఛను పొందిన వారిపై 'వలా' అనే హక్కు సంక్రమిస్తుంది.

ఇది అర్థం కావడానికి ఓ ఉదాహరణ : ఆస్థిపాస్తులున్న ఎవరైనా వ్యక్తి వారసులు లేకుండా మరణిస్తే, ఆ ఆస్తికి సమీప బంధువులు వారసులు అవుతారు కదా!

అదే విధంగా పై హదీస్ ద్వారా స్వేచ్ఛను ఇప్పించిన వారికి వారసత్వ హక్కు లభిస్తుంది. ఒకవేళ ఆ వ్యక్తి మరణిస్తే, ఏమైనా ఆస్తిపాస్తులుంటే, ఆ వ్యక్తికి వారసులు లేకపోతే, వాటిపై హక్కు స్వేచ్ఛ నిచ్చిన వారికి దక్కుతుంది. ఆ విధంగా వారిద్దరి మధ్య బంధుత్వ మేర్పడుతుంది.

ముందరి సంచికలో బిలాల్(రజి)వారి గురించి, ఆయన బానిసగా ఉన్నప్పుడు, అతనిని ఏ విధంగా చిత్రహింసలకు గురిచేశారో చెప్పడం జరిగింది.

'మస్జిద్' మైకుల నుండి రోజుకు 5 సార్లు వెలువడే 'అజాన్' (ప్రార్థనా పిలుపు) గురించి ప్రపంచమంతా తెలుసు. హేతువాది అయిన ఇ.ఏ. జబ్బార్‌గారికైతే ఈ విషయం మరింత బాగా తెలుసు. కాని ఆ తొలి ప్రార్థనా పిలుపును ఇచ్చింది ఎవరు?

ఇంకెవరు - **బిలాల్(రజి)!**

మక్కాలోని 'కాబా'ను అక్కడి ఉన్నత వంశానికి చెందిన విగ్రహారాధకులు పవిత్రంగా చూసుకునేవారు. ఆ 'కాబా' పైకి ఎక్కి హజ్రత్ 'బిలాల్' అజాన్ పలుకుతున్నప్పుడు వారి పరిస్థితి నొకసారి ఊహించండి. ఈ బిలాల్(రజి)వారు ఆఫ్రికాకు చెందిన నీగ్రో జాతివారు. నల్లగా ఉంటారు. కాని ధర్మ పరాయణతలో అత్యంత సుందరమైనవారు. ఈ బిలాల్(రజి)వారిని అల్లుడుగా చేసుకోవడానికి మక్కాలోని ఉన్నత వంశస్థులు పోటీ పడ్డారంటే సమాజంలో సంస్కరణ ఏ స్థాయిలో జరిగిందో అర్థమౌతుంది.

ముహమ్మద్(స)వారి జీవిత చరిత్రను చదివితే, ఆయన యొక్క అత్యంత నిరాడంబర జీవితం మానవాళికి ఎంత ఆదర్శప్రాయమో తెలుస్తుంది. గడిచిన 1,2 శతాబ్దాలలో మహాత్ములుగా ప్రజలచే కొనియాడబడిన ఎంతోమందిపై ఈ మహనీయ ముహమ్మద్(స)వారి జీవితం ఎంతటి ప్రభావాన్ని వేసిందో చరిత్రను శోధించే పరిశోధకులకు బాగా తెలుసు.

బానిసలను తమ తోటి సోదరులుగా స్వీకరించగలిగేలా చేసి, బానిస స్త్రీని వివాహబంధంలోకి తీసుకుని, వారికి స్వేచ్ఛనిచ్చి విశ్వాసుల మాతృమూర్తిగా పిలిచేలా, స్థాయిని పెంచిన మహనీయున్ని విమర్శించడానికి కారణం - కేవలం అజ్ఞానమే!

సంపూర్ణ సామాజిక న్యాయం సాధించిన ఏకైక వ్యక్తి - ముహమ్మద్(స)!

ఈ సమాజంలో ఇ.ఏ. జబ్బార్‌గారు లాంటి అజ్ఞానులెందరో!

ఇలాంటి మరో అజ్ఞాని వ్రాతలను, రాబోయే సంచికలలో ఖండిద్దాం. ఇస్లాంపై మరియు ముహమ్మద్(స)వారి జీవిత చరిత్రపై అవగాహన లేని, అమాయక ముస్లిమ్ సోదరులను ఈ అజ్ఞానులు అయోమయానికి గురిచేసి సందేహంలో పడవేస్తారు కాబట్టి, ఇలాంటి అజ్ఞానులకు ఎలా సమాధానం చెప్పాలో తెలియజేయడానికి ఈ శీర్షికలోని వ్యాసాలు ఇన్షాఅల్లాహ్ ఉపయోగపడతాయని మా నమ్మకం.

నాస్తికులలో ముఖ్యంగా రెండురకాల వ్యక్తులు మనకు తారసపడతారు. మతధర్మం పేరుతో అమాయక ప్రజలను మోసం చేసే వారిని చూసి, ధర్మంపైననే వ్యతిరేకత పెంచుకుని, నాస్తికులుగా మారడం మొదటి రకం.

తమ విచ్చలవిడి కోరికలను సమాజ శ్రేయస్సు దృష్ట్యా ధర్మం అడ్డుకోవడాన్ని సహించలేక కూడా నాస్తికులు కావడం రెండోరకం.

వారి ఆలోచనలను భావాలను తెలుసుకుని, వారికి సరియైన విధంగా హితబోధ చేస్తే, వారిలో మానసిక పరివర్తన కలిగే అవకాశముంది.

'వీరితో మనకెందుకులే గొడవ' అని అనుకుని వదిలేస్తే, ఎలా ఉంటుందటే, మనం ప్రయాణిస్తున్న బోట్‌కు రంధ్రం పడితే, చూసీచూడనట్లు వదిలేసినట్లు ఉంటుంది.

అమెరికా నాయకులు యుద్ధాలు లేకపోతే సహించలేరు. వారికి మహా బోర్‌గా ఉంటుంది. ఏవైనా రెండు దేశాలు యుద్ధం చేసుకుంటుంటే, వీరికి చాల ఉత్సాహంగా ఉంటుంది. వారి ఆయుధాలను అమ్ముకోవచ్చు. ఒకవేళ కొత్త ఆయుధాలను తయారుచేస్తే, వాటి పనితీరును చూపడానికి, ప్రయోగం చేయడానికి ఏదో 'టెర్రరిజం' వంకతోనో, లేక విధ్వంసకర ఆయుధాలు ఉన్నాయన్న వంకతోనో యుద్ధం చేయడం అలవాటు చేసుకున్నారు.

ఇలాంటి వారికి దైవభీతి ఉండి, నిజమైన ధర్మాన్ని తెలుసుకుంటే, ఇన్షాఅల్లాహ్ ప్రపంచ శాంతికి విఘాతం కలుగదు కదా!

అన్ని వర్గాలతో పాటు, నాస్తికవర్గానికి కూడా ధర్మ సందేశాన్ని అందించడం మన బాధ్యత!

ఖుర్‌ఆన్ గ్రంథాన్ని గాని, ముహమ్మద్(స)వారినిగాని విమర్శిస్తూ, నాస్తికులెవరైనా పుస్తకాన్ని గాని, వ్యాసాన్ని గాని వ్రాస్తే, మీకు వీలైతే ఒక కాపీని క్రింది ఎడ్రస్‌కు పంపమని కోరుతున్నాము.

(డా. నాగిరెడ్డి శ్రీనివాసరావు, 7-10-19, ఎ.యు. అవుట్‌గేట్(డౌన్), చిన్నవాల్తేర్, విశాఖపట్టణం - 17)

సమాజంలో ఓ దురాచారం ఉంది. దానిని నిర్మూలించాలి. నిర్మూలించడం అంటే, అది శాశ్వతంగా నిర్మూలన కావాలి. ఆ పరిష్కారం ఆచరణ యోగ్యమైనది అయిఉండాలి. అందరూ ఆమోదించేలా ఉండాలి.

ఇలాంటివి ఏవిధంగా సాధ్యమౌతాయి?

సామాజిక, మానసిక శాస్త్రవేత్తలందరూ ఇప్పటినుండి పరిశ్రమించండి. ఇస్లాం సూచించిన పరిష్కారానికి మించిన పరిష్కారాన్ని మీరు సూచించగలరా?

**అది అసాధ్యమని పూర్తి విశ్వాసంతో చెబుతున్నాము.**

తొలి 3 సంచికల ద్వారా ''ఖుర్‌ఆన్ వలన హేతువాదినయ్యాను''అని తప్పుడు సమాచారంతో, నాస్తిక యుగం పత్రిక ద్వారా వ్యాసాన్ని అందించిన ఇ.ఏ. జబ్బార్ గారు అసత్యపరుడని, కనీస జ్ఞానంలేని వాడని ఋజువు చేయడం జరిగింది. ఇలాంటి పత్రికల వాళ్ళు మీకెదురైతే, వారి చేత ఈ వ్యాసాన్ని బలవంతంగా నైనా సరే చదివించండి.

# నాస్తికుని ? ప్రశ్న

కొంత మందికి కొన్ని సమస్యలు ఎదురౌతాయి. వాటి పరిష్కారం తెలియదు. కొందరికి కొన్ని ప్రశ్నలుదయిస్తాయి. కాని వాటికి జవాబు స్ఫురించదు. అన్వేషించ గలిగే ఓపిక వారి కుండదు. వారి సందేహాలను ఎవరి ముందో ఉంచుతారు. వారు సరియైన విధంగా జవాబు చెప్పలేక పోవచ్చు. అలాంటి సందర్భాలే కొంతమందిని నాస్తికులుగా మారుస్తాయి. వీరు కాకుండా మరో వర్గముంది. వారికి ఇష్టానుసారంగా బ్రతకాలని ఉంటుంది. ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర రెడ్ లైట్ వెలిగినా, దూసుకు పోవాలని, పరీక్షలకు ప్రిపేరవకుండా, ఏమీ వ్రాయకపోయినా మంచి మార్కులు పొందాలని, వారికి నచ్చిందే చేయాలని, కావాలన్నది దొరకాలని, ధర్మమైనా, అధర్మమైనా, నీతి అయినా అవినీతి అయినా వారి కనవసరం. వారిని వారించి ఎవరైనా కంట్రోల్ చేయబోతే, వారు సహించలేరు. అలాంటి వారు కూడా ఈ నాస్తికత్వం వైపు మొగ్గు చూపుతారు. చేతులు కాలాక, ఆకులు పట్టుకున్నట్లు, ఎప్పుడో వీరికి జ్ఞానోదయం అవుతుంది, కాని అప్పటికే వారి జీవితానికి అస్తమయం దగ్గరవుతుంది. ఓ నాస్తిక సోదరుడు వేసిన ఒక ప్రశ్నకు జవాబు చెప్పడంతో ఈ శీర్షికను క్రిందటి సంచికలో ప్రారంభించాము. ఆ నాస్తిక సోదరుని మరో ప్రశ్నను ఈ సంచికలో అందిస్తున్నాము.

మీకు నాస్తిక సోదరులు ఎదురైతే, వారి చేత తప్పనిసరిగా ఈ వ్యాసం చదివించండి. వారిని సంస్కరించడానికి ప్రయత్నిద్దాం. ప్రపంచ మానవులందరూ ఒకే జంట నుండి ఉద్భవించారు కాబట్టి, వారు కూడా మన బంధువులే!

**ప్రశ్న**

**ఇస్లాంపై వచ్చే విమర్శలను చాలామంది ముస్లిములు చదవడానికి ఎందుకు భయపడతారు (లేదా) చదవడానికి ఎందుకు ఇష్టపడరు? మిగతా మతధర్మాల విషయంలో కూడా ఇంతే!**

**జవాబు** అంటే నాస్తికులు తప్ప, మిగిలిన వారిలో ఎక్కువ మంది విమర్శలను ఇష్టపడరు లేదా విమర్శలను చదవడానికి భయపడతారు అనే భావాన్ని వ్యక్తపరిచాడీయన.

కాస్తయినా ఇంగితజ్ఞానముంటే ఇలాంటి ప్రశ్నలు ఉదయించవు. మానసిక పరిపక్వత లేకపోవడమనేది వీరి యొక్క ముఖ్య లక్షణం. ధర్మం విషయంలోనే కాదు, ఏ విషయంలోనైనా సరే సగటు మనిషి సద్విమర్శనే కోరుకుంటాడు.

అంటే విమర్శించడానికి ఓ ప్రమాణం, ఓ కారణం కావాలి. తను భావించేది కరెక్ట్ అని నిరూపించడం కోసం ఏ కొంచెం కూడా ఆలోచన చేయకుండా విమర్శించడం, సద్విమర్శ (constructive criticism) అనిపించుకోదు.

ప్రాథమిక పాఠశాలలో చదివే ఓ సగటు విద్యార్థి తన టీచర్ చేత మెప్పు పొందాలనుకుంటాడు. తన లోపాలను చూపకుండా ఉండాలని లేదా తనలో అసలు లోపాలే లేవని, తన టీచర్ చెబితే వినాలనుకుంటాడు. అంతేగాని విమర్శకు ఇష్టపడడు. తన టీచర్ చేత తిట్లు తినాలనుకోడు.

కాని ఇదే విద్యార్థి పెరిగి పెద్దవాడయ్యాక, శాస్త్రవేత్తగా ఏ పరిశోధనలోనో చేరితే, విమర్శలనే ఎక్కువగా ఆహ్వానిస్తాడు. ఎందుకంటే, తన పరిశోధనలోని లోపాలను తెలుసుకుంటే, వాటిని సరిదిద్దుకుని మరిన్ని విజయాలు సాధించ గలుగుతాడు. అంటే విమర్శలను ఆహ్వానించడం లేదా తిరస్కరించడం అనేది ఆ వ్యక్తి యొక్క జ్ఞానంపై ఆధారపడి ఉంటుంది.

ఓ సాదాసీదా గృహిణి, తన భర్త మరియు పిల్లలచేత తన వంట గురించి మెచ్చుకోబడాలని కోరుకుంటుంది. కాని తన ఇంటివారంతా ఇష్టపడే విధంగా వండాలి అంటే, ఆమె ముందుగా ఏమి చేయాలి? తన వంటలోని లోపాలను ముందుగా తెలుసుకోవాలి కదా! కాబట్టి ఈమె కూడా విమర్శలను ఆహ్వానిస్తుంది.

ఇక భయం విషయానికొద్దాం!

అశ్లీలమైన దృశ్యాలున్న సినిమా చూడటానికి కొందరికి భయం, మరికొందరికి చాలా ఇష్టం.

ఎందుకు భయపడుతున్నావని అడిగితే, అటువంటివి చూస్తే చెడిపోయే ప్రమాదముందని అతని నుండి సమాధానమొస్తుంది.

అంటే తనపై పడబోయే చెడు ప్రభావానికి భయపడ్డాడు.

భయపడ్డాడు కాబట్టి "**అశ్లీల దృశ్యాలు**" గొప్పవి అయిపోతాయా? కొన్ని విషయాలలో భయపడాలి. తప్పనిసరిగా భయపడాలి.

చెడు చదవడానికి భయపడాలి.

నాస్తికులకు మంచీ చెడులకు తేడా తెలియదు. వారికి ఏది నచ్చితే అదే మంచిది. లేకపోతే అది చెడు అంతే! కాబట్టి నాస్తికులలో ఓ ప్రమాణమంటూ ఏదీ ఉండదు.

మతాల మధ్య విద్వేషాలను సృష్టించి, రాజకీయంగా లబ్ధి పొందాలని కోరుకునే వారిని మనం నిత్యజీవితంలో చూస్తూనే ఉన్నాం. అటువంటి ఓ రాజకీయ నాయకుడు, రెండు ప్రముఖ మతాల మధ్య ఉండే విద్వేషం వలన దేశానికి చాలా మంచిదని చెబుతూ పుస్తకం వ్రాస్తే, మానవత్వమున్న సగటు మనిషి ఆ పుస్తకాన్ని చదవడానికి ఇష్టపడతాడా? ఖచ్చితంగా ఇష్టపడడు.

దుర్మార్గుడుగా అందరికీ తెలిసిన ఓ వ్యక్తి వ్రాసిన పుస్తకాన్ని చదవడానికి ఇష్టపడక పోవడం సహజమే కదా! ఈ రోజుల్లో మిడిమిడి జ్ఞానంతో చాలామంది విమర్శలు చేస్తున్నారు. పనికిమాలిన విమర్శలను పట్టించు కోనవసరం లేదు. అయితే, ఆ విమర్శలను పూర్తిగా చదివి, ఎటువంటి భయానికి లోనుకాకుండా, ఆ విమర్శలు చేసిన వారికి దడపుట్టించే వారు కూడా ఉన్నారు. ఆ చెత్త విమర్శకుల భాగోతాన్ని, వారి అజ్ఞానాన్ని బయటపెట్టి, వారి విమర్శలు, 'సద్విమర్శలు' కావని, అజ్ఞానపు రాతలని నిరూపించే

వారున్నారు. వారిని సంస్కరించి, సంస్కారవంతులుగా మార్చాలనే తపన కలవారున్నారు.

ఉదాహరణకు, మా శాంతిబాట టీమ్‌నే తీసుకోండి. **'జ్ఞానం - అజ్ఞానం'** శీర్షికలో తొలి రెండు సంచికలలో ఖుర్ఆన్ గ్రంథంపై ఇ.ఏ.జబ్బార్ అనే హేతువాది అజ్ఞానంతో, దురుద్దేశపూర్వకంగా వ్రాసిన వ్రాతలను యధాతథంగా ధైర్యంగా ఇవ్వడమే కాకుండా, అవి ఎంత అసత్యాలో నిరూపించడం జరిగింది.

దీనిని బట్టి ఇస్లాంపై వచ్చిన విమర్శలను చదవడమే కాకుండా, 'నాస్తికుని ప్రశ్న' శీర్షిక ద్వారా నాస్తికులలో భయాన్ని కలిగించినవారు కూడా ముస్లిములేనని నాస్తిక అజ్ఞానులు తెలుసుకోవాలి.

"**శాంతిబాట** పత్రికలోని **'జ్ఞానం-అజ్ఞానం'**, **'నాస్తికుని ప్రశ్న'** శీర్షికలను చదవడానికి నాస్తికులలో చాలామంది భయపడతారు. వారిలో చాలామంది చదవడానికి ఇష్టపడరు." అని ఇప్పుడు మేమే వారికి ఎదురుప్రశ్న వేస్తున్నాము.

కాదంటారా?

ఓ డాక్టర్ యొక్క లోపాన్ని విమర్శిస్తే, అది వైద్యశాస్త్రం (మెడిసిన్)పై చేసిన విమర్శ కాదని అందరూ ఒప్పుకుంటారు.

కాని ఓ ముస్లిమ్‌లో లోపం ఉంటే మాత్రం, అది అతని లోపంగా కాకుండా, ఆ లోపాన్ని 'ఇస్లామ్' యొక్క లోపంగా చిత్రీకరించడం ఈ రోజుల్లో సర్వసామాన్యమైన ఓ ఫ్యాషన్ అయిపోయింది.

ప్రపంచ ప్రముఖ విమర్శకులు చెప్పిన వాటిలో మచ్చుకు కొన్ని:

"And then also **ISLAM** - that we must submit to God; That our whole strength lies in resigned submission to HIM, whatsoever HE does to us, the thing HE sends to us, even if death and worse than death, shall be good, shall be best; we resign ourselves to God."

The same author continues, "if this be **ISLAM**"

Goethe says, "Do we not all live in Islam?"

Carlyle himself answers this question of Goethe,

"Yes, all of us that have any moral life, we all live so. This is yet the highest wisdom that heaven has revealed to our earth"

Carlyle continues, "The word of such a man (**Muhammed**), is a voice direct from nature's own heart; Men do and must listen to that as to nothing else; All else is wind in comparision ...."

*(From the book - "Heroes and Hero-Worship" by Thomas Carlyle)*

Even a hostile critic like Sir William Muir speaking about the Holy Qur'an says that, "There is probably in the world no other book which has remained twelve centuries with so pure a text" (now it is more than 14 centuries)

**మరి పై విమర్శకుల స్టేట్‌మెంట్స్‌ని చదివే ధైర్యం నాస్తికులకు ఉందా?**

ఇస్లాం సత్య ధర్మమని ఏనాడో నిరూపితమైంది. ముహమ్మద్(స)వారిచే పునరుద్ధరించబడిన ఇస్లాం, ఒక శతాబ్దం కాలంలోనే అరేబియా దాటి ప్రపంచంలోనే సగభాగానికి వ్యాపించడం ద్వారా, అది ఎంత శక్తివంతమైనదో చరిత్ర నిరూపించింది. ఆధునిక సైన్స్‌లోని చాలా సబ్జక్టులకు ముస్లిమ్ శాస్త్రవేత్తలే పితామహులయ్యారని, ఇస్లాం ధర్మం విద్యకు ఎంతో ప్రాముఖ్యత నిచ్చిన విషయం నాస్తికులు తెలుసుకోవాలి.

లోపాలు లేని ఈ ధర్మంపై విమర్శలు చేయగలవారెవ్వరు?

## పాఠకుల అభిప్రాయాలు

- **శాంతిబాట పత్రికను ఇంగ్లీష్‌లో కూడా ప్రచురించమని చాలామంది పాఠక సోదరులు తెలియజేస్తున్నారు. అందుకు మేము సిద్ధంగానే ఉన్నాము. కాని మాకు కావలిసినంత ఆర్థిక వనరులు లేవు. కనీసం రాష్ట్రం మొత్తం మీద 2000 మంది చందాదారులు జాయిన్ అయితే, ఇన్షాఅల్లాహ్, ఈ పత్రికను ఇంగ్లీష్‌లో కూడా అందించగలం.**
- **ధర్మ ప్రచారం కోసం కొందరు సోదరులు, ప్రత్యేక శీర్షికను ప్రారంభించమని కోరారు.ఇది చాలా ముఖ్య విషయం. పేజీలు సరిపోక ఇంతవరకూ ప్రారంభించలేదు. ఈ నెలలో ఓ వ్యాసాన్ని తక్కువ పేజీలకు కుదించి, కొత్త శీర్షికను ప్రారంభిస్తున్నాము.**
- **'శాంతిబాట'ను కొరియర్ ద్వారా పంపడం ఆలస్యమైంది అని, ఇంకా అందలేదని ఫోన్‌లు వచ్చాయి. చందాదారులను చేర్పించడానికి, కొంతమంది సోదరులకు బిల్ పుస్తకాలను ఇచ్చాము. వారినుండి పుస్తకాలను అందుకోవడంలో జరిగిన ఆలస్యం వలన పోస్ట్ చేయడం ఆలస్యమైంది. ఇన్షాఅల్లాహ్! నాలుగవ సంచికనుండి ముందుగానే పోస్ట్ చేస్తాము.**

**మాతో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరిస్తున్న సోదరులందరికీ అల్లాహ్ శ్రేయోశుభాలను కలుగజేయాలని శాంతిబాట టీమ్ కోరుకుంటుంది.**

**అభిప్రాయాలను పర్సనల్‌గా తెలియజేయాలనుకునేవారు డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు (అబ్దుల్ కరీమ్)ని ఫోన్‌లో సంప్రదించడంగాని (నెం. 9491103017) లేదా** velugubaata@gmail.com; srinagireddi@gmail.com **కు మెస్సేజ్ పంపండి.**

### ముఖ్య గమనిక

దేవుడు లేడని ఇంతవరకూ సైన్స్‌లోని ఏ శాస్త్రమూ నిరూపించలేదు. ఎయిడ్స్‌కి మందు ప్రస్తుతానికి లేదు. భవిష్యత్తులో కనిపెట్టవచ్చు. తెలిసినవి తక్కువ. తెలియనివి చాలానే ఉన్నాయి.

శాస్త్రవేత్తలలో కూడా చాలామంది దైవాన్ని విశ్వసించేవారున్నారు. అలాగే కొంతమంది విశ్వసించని వారు కూడా ఉన్నారు. కాబట్టి నాస్తిక సైంటిస్ట్‌ల యొక్క అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవే గాని, వారి అభిప్రాయాలకు మరియు సైన్స్‌కూ ఎటువంటి సంబంధమూ లేదని తెలుసుకోండి.

# ధర్మ సందేశ ప్రచారం

'శాంతిబాట' మాసపత్రికలోని విషయాలు ధర్మసందేశ ప్రచారంలో బాగా ఉపయోగపడుతున్నాయని చెబుతూ, 'శాంతిబాట టీమ్'ని ప్రోత్సహిస్తూ 'దావత్'పై ప్రత్యేకమైన శీర్షికను కూడా అందివ్వమని కొందరు సోదరులు కోరారు. 'శాంతిబాట'లోని విషయాలు - ప్రపంచంలోని ఎంతో మంది ముస్లిం సోదరులు చేసిన కృషికి ఫలితం. వారందరికీ అల్లాహ్ శ్రేయోశుభాలను అనుగ్రహించు గాక! (ఆమీన్). నేడు సందేశ ప్రచారంలో ఎన్నో కొత్త పోకడలు వచ్చాయి. ప్రవక్త(స)వారి సాంప్రదాయానికి దూరంగా ఈ కార్యక్రమాలు పోతుండటం చూసి, ఆవేదనతో ఈ శీర్షికను ప్రారంభిస్తున్నాము.

## దావత్ అంటే ఏమిటి?

ప్రజలను సన్మార్గం వైపునకు పిలవడం.

ఈ దావత్ కార్యక్రమాన్ని ముహమ్మద్(స)వారు ఎలా ప్రారంభించారో, ఎలా కొనసాగించారో మనం కూడా అలాగే కొనసాగించాలి కదా! మనం మంచినీరు త్రాగేటప్పుడు కూడా, మన ప్రవక్త(స)వారు ఎలా త్రాగారో అదే పద్ధతిని అనుసరిస్తాము కదా! అతి చిన్న విషయాలలో కూడా మనం సున్నత్‌నే పాటిస్తున్నప్పుడు, అతి ముఖ్యమైన 'దావత్' (దావా) కార్యక్రమాన్ని కూడా 'సున్నత్' ప్రకారంగానే చేయాలి కదా!

**ప్రస్తుత పోకడలు :**

ఉదాహరణకు ఒక సందేశ ప్రచారకుడు పూలచొక్కా వేసుకుని ఒక స్టేజిపై ప్రసంగించారనుకుందాం! ప్రేక్షకులు చప్పట్లు కొడితే, చాలా మంది అతనినే అనుసరిస్తూ, పూలచొక్కాలు వేసుకుని, అదే స్టైల్లో ప్రసంగించడం ఓ ఆనవాయితీ అయిపోయింది. అనుసరించవలసింది ప్రవక్త(స)వారి మార్గాన్ని. కాని అనుసరించేది గైర్‌సున్నత్‌ని. పేరు తెచ్చుకున్న ఆ దాయి, స్టేజీ మీద ఒకవేళ ఇత్తడి గ్లాసుతో నీళ్ళు గనుక త్రాగితే, చూసిన చిన్నా చితకా దాయిలు కూడా ఇత్తడి గ్లాసుతో నీళ్ల త్రాగడం మొదలెడతారు.

ఆ సీనియర్ 'దాయీ' గారు తన కొడుకు చేతగాని లేదా కూతురు చేతగాని పాటపాడిస్తే, ఆ తరువాతి రోజు వీరు కూడా అదే అనుసరించ డానికి సిద్ధంగా ఉంటారు. పబ్లిక్ ప్రోగ్రామ్స్ పేరుతో వెచ్చిస్తున్న కోట్ల రూపాయలను ఇస్లాం ధర్మం ప్రకారం సరియైన విధంగా వినియోగిస్తే, ఎందరికో మేలు జరుగుతుంది.

**దాయీ :**

పాంప్లెట్స్‌లో ఫొటోలను మరియు ప్రముఖ దాయీ అంటూ బిరుదులతో దాయిల పేర్లను అచ్చు వేయిస్తున్నారు. అసలు ఈ దాయీ అనే పదాన్ని ముహమ్మద్(స)వారి కాలంలో ఈ విధంగా ఉపయోగించారా?

ఎవరైనా హజ్ చేస్తే వారి పేరు ముందు 'హాజీ' అని తగిలిస్తున్నారు. ధర్మ ప్రచారం చేసేవారు 'దాయీ'లట. మరి నమాజ్‌ను ప్రతీరోజూ చేసేవారిని ఏమని పిలవాలి? వారి పేరు ముందు 'నమాజీ' అని ఎందుకు తగిలించుకోవడం లేదు. మాంసం తినేవారు, తన పేరు ముందు 'మాంసాహారి' అని ఎందుకు తగిలించడం లేదు?

అవన్నీ అందరూ చేసేవి కాబట్టి తగిలించకూడదు అని, ప్రత్యేకమైన పని అయితేనే అలాంటి బిరుదులు తగిలించాలి అని వారి భావం కావచ్చేమో! అర్హత పొందినవారు జకాత్ ఇవ్వడం తప్పనిసరి. సౌమ్ (ఉపవాసం) ఉండటం తప్పనిసరి. అవకాశమున్న వారు హజ్ చేయడం తప్పనిసరి. అలాగే ధర్మ ప్రచారం కూడా ప్రతీ ముస్లింపైనున్న బాధ్యతే కదా! కాబట్టి ఆ విధంగా ప్రతీ ముస్లిం కూడా 'దాయీ' కావాలి. అలాంటప్పుడు 'దాయీ' అనే పదం ప్రత్యేకంగా కొందరి వ్యక్తుల కోసమే ఎందుకు ఉపయోగించాలి?

అలా ప్రత్యేకంగా 'దాయీ' అని పిలవడం వలన, మనం సమాజంలోకి తప్పుడు సందేశాన్ని తీసుకెళుతున్నట్లే. ధర్మ ప్రచారం చేయడం ఓ ప్రత్యేక దాయీ యొక్క బాధ్యతగా సగటు ముస్లిమ్ భావిస్తున్నాడు. ఆ సందేశ బాధ్యత తనపై లేదు అని అనుకుంటున్నాడు. నమాజ్ చేయడం తన బాధ్యతగా ప్రతీ ముస్లిమ్ భావించబట్టే, నమాజ్ ఎలా చేయాలో, నమాజ్‌లో ఏమి పఠించాలో నేర్చుకుంటున్నాడు. అదే విధంగా ధర్మప్రచారం చేయవలసిన బాధ్యత కూడా తనపై ఉందని ప్రతీ ముస్లిమ్ తెలుసుకుంటే, ధర్మజ్ఞానాన్ని కొంతైనా నేర్చుకుని తన బాధ్యతను నిర్వహించ గలుగుతాడు.

'ధర్మం' యొక్క బాధ్యతను ప్రత్యేకంగా కొందరిపై ఉంచి, వారిపై ఆధారపడటం వలననే మన పూర్వపు జాతులు నాశనమయ్యాయి. కాబట్టి మనందరికీ కనీస ధర్మజ్ఞానముండాలి. మనందరం మన జ్ఞాన పరిధిని బట్టి ధర్మప్రచారం చేయాలి. అందుకోసం మైక్‌లు కూడా అవసరం లేదు. ప్రత్యేకంగా ఆర్థిక వనరులు అవసరం లేదు. పదిమంది ఓ చోట కూర్చుని కాలక్షేపం చేస్తున్నప్పుడు, వారితో కూర్చుని కాస్సేపు వారికి ధార్మిక విషయాలను వివరిస్తే సరిపోతుంది. వారికి ఇబ్బంది, విసుగు కలగనంత సమయం మాత్రమే తీసుకోవాలి లేదా వారంలో ఒకసారి అందరికీ వీలుగా ఉండే సమయంలో కాస్సేపు ఎవరో ఒకరి ఇంటిలో సమావేశమై, ధర్మం గురించి తెలియని వారెవరైనా ఆ చుట్టుప్రక్కల ఉంటే వారిని ఆహ్వానించి దైవధర్మ విషయాలను చెప్పుకోవచ్చు.

కాబట్టి 'దాయీ' అనే పదాన్ని ఉపయోగించకుండా ఉంటే మంచిది. **మనకు మన సృష్టికర్త 'ముస్లిమ్' అనే మంచి పేరును పెట్టారు.** మీరు పొగడవలసింది అల్లాహ్‌ను, ఆయన ధర్మాన్ని మాత్రమే (అల్‌హమ్‌దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్). పొగడవలసింది దాయిలను కాదు. Hero-worshipకి ఇస్లాం ధర్మంలో స్థానం లేదు.

క్రింది హదీస్‌ను చదవండి:

**"హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ(రజి) ఉల్లేఖనం: ప్రవక్త(స) చెప్పారు "మీ పూర్వీకుల జీవన విధానాలను జానకు-జాన మరియు మూరకు-మూర (inch by inch) విధంగా, ఒకవేళ వారు ఉడుం కన్నంలోకి దూరితే, వారిని మీరు అనుసరించేంతగా అనుసరిస్తారు." "ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా (స)! యూదులు మరియు**

**"అల్లాహ్ వైపునకు పిలిచి మంచి పనులు చేసి, నేను ముస్లిమ్‌ను అని ప్రకటించే వ్యక్తిమాట కంటే మంచిమాట మరెవరిది కాగలదు" (ఖుర్'ఆన్ 41:33)**

**క్రైస్తవులా?" అని మేము అన్నాము. ఆయన(స) "ఇంకెవరు?" అన్నారు. (సహీహ్ బుఖారీ,** నెం. **7320**, సంపుటి 9)

ప్రస్తుతం చాలామంది ఆ పనే చేస్తున్నారు. ఇలా చేసేవారి గురించి వదిలేద్దాం! **మనం ప్రవక్త(స)గారి సాంప్రదాయం ప్రకారమే సందేశాన్ని అందిద్దాం.**

ఏ మతధర్మానికి చెందినవారైనా వచ్చి, ఇస్లాం గురించి తెలుసుకోవాలనుకున్నా లేదా వారి కున్న సందేహాలను తీర్చుకోవాలనుకున్నా సరే, వారిని ఆహ్వానించి తప్పకుండా విషయాలను తెలియజేయండి. అంతేగాని, వేరే మతధర్మాల వారితో డిబేట్‌లు పెట్టి, వారిచేత పవిత్ర ఖుర్'ఆన్ గ్రంథాన్ని, మానవోత్తముడైన ముహమ్మద్(స) వారిని తిట్టించడం చేయకండి.

**స్వార్థంకోసం, వ్యక్తిగత ప్రతిష్ఠల కోసం ఇలాంటి డిబేట్‌లను ఏర్పరిచేవారికి ఎంతమాత్రం ఏ రూపంలోనూ సహకరించకండి.**

మీ రెప్పుడైనా మస్‌జిద్ గోడలపై ఖుర్'ఆన్ పట్టుకుని ఉన్న వ్యక్తుల ఫొటోలతో గాని (లేదా) ఖుర్'ఆన్‌తో పాటు ఇతరగ్రంథాల పుస్తకాలను పట్టుకుని తీయించుకున్న ఫొటోలతోగాని పోస్టర్‌లను చూసినప్పుడు పై హదీస్‌ను ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి. ఆ హదీస్‌కు ఇక వేరే వివరణ అవసరం ఉండదు.

ప్రపంచానికి సన్మార్గాన్ని చూపిన మానవోత్తముడైన ముహమ్మద్(స) వారి ఫొటో ఎక్కడా కనిపించదు. కాని దైవభీతిగల ప్రతీ ముస్లిమ్‌లోనూ ఆయన(స) యొక్క సాంప్రదాయం(సున్నత్) ఉంది. ఆయన(స) యొక్క ముఖ్య అనుచరులు మరియు ఖలీఫాల యొక్క ఫొటోలుగాని మీరు చూశారా?

బుఖారీ, ముస్లిమ్ మొ॥న ప్రామాణిక గ్రంథాలను అందించిన వారి ముఖాలు మనకు తెలియవు.

ప్రస్తుతం జరుగుతున్న ప్రదర్శనలు మన సాంప్రదాయం కాదు.

ప్రజలను మన దగ్గరికి పిలుపించుకోకుండా, ప్రజల దగ్గరకు మనమే వెళదాం! 'అల్లాహ్' కరుణ కోసం, అల్లాహ్‌కు కృతజ్ఞత చూపడం కోసం, అల్లాహ్ ఆదేశాన్ని పాటించడం కోసం, మన తోటి ప్రజలను నరకం నుండి తప్పించే ప్రయత్నంలో ప్రజలను సన్మార్గం వైపు పిలుద్దాం! మనం బ్రతడానికి, సమాజంలో ఎన్నో హలాల్ అయిన ఉద్యోగాలు, హలాల్ అయిన వ్యాపారాలూ ఉన్నాయి. వాటి ద్వారా మన జీవనోపాధిని పొందుతూ, ధర్మ సందేశాన్ని ప్రజలకందిస్తూ మన బాధ్యతను నెరవేర్చుదాం!

ఈ 'దావా' ఖుర్'ఆన్ మరియు సున్నత్‌ల వెలుగులో ఎలా చేయాలో ప్రపంచవ్యాప్తంగా ఎందరో స్కాలర్స్ చెప్పారు. వారి కృషిని ఇన్షాఅల్లాహ్ వచ్చే నెల నుండి ధారావాహికంగా అందిస్తాము.

## మనకి ఏకైక ఆదర్శం : ముహమ్మద్(స)వారు

**"వాస్తవానికి, అల్లాహ్ యొక్క సందేశహరునిలో మీకు ఒక ఉత్తమమైన ఆదర్శం ఉంది, వారి కొరకు ఎవరైతే అల్లాహ్ మరియు అంతిమదినాన్ని ఆశిస్తారో మరియు అల్లాహ్‌ను అత్యధికంగా స్మరిస్తారో" (ఖుర్'ఆన్ 33:21)**

## ముఖ్య గమనిక

**'దావా'ను తన వృత్తిగానో (లేక) వ్యాపారంగానో స్వీకరించిన ఏ ప్రొఫెషనల్ దాయీ తోనూ 'శాంతిబాట టీమ్'కు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఎటువంటి సంబంధం లేదు.**

**'శాంతిబాట' మాసపత్రికలో అందిస్తున్న పరిశోధనాత్మక విషయాలతో, ఏ 'దాయీ' అయినా ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేయించుకుని, వీడియో సిడిలతో వ్యాపారం చేసుకుంటే, ఆ వ్యాపారానికి శాంతిబాటకు ఎటువంటి సంబంధం లేదని పాఠకులను గమనించమని కోరుకుంటున్నాము.**

**వ్యాపారం కోసం చేసే ఏ డిబేట్లకైనా, ప్రోగ్రామ్స్‌కైనా, వీడియో షూటింగ్‌లకైనా సున్నత్‌కు వ్యతిరేకంగా జరిగే ఏపనికైనా 'శాంతిబాట టీమ్' ఎప్పుడూ వ్యతిరేకమే!**

**శాంతిబాట వ్యాపార పత్రిక కాదు.**

# ఇంటర్‌నెట్‌లో ఇస్లాం కబుర్లు 1

**ఇంట్లో ఇంటర్‌నెట్ సౌకర్యమున్న తల్లిదండ్రులు, తమ పిల్లలకు తమ సమక్షంలోనే ఇంటర్‌నెట్‌ను ఉపయోగించుకునేలా అలవాటు చేస్తే, కొంతైనా మన పిల్లలకు జరిగే కీడునుండి తప్పించిన వాళ్ళ మవుతాము.**

ఇంటర్‌నెట్‌లో ఇస్లాం ధర్మాన్ని బోధించే మంచి వెబ్‌సైట్లు ఉన్నాయి. ఉదాహరణకు www.harunyahya.com, www.usislam.org మొ॥వి. ముస్లిములను తప్పుదారి పట్టించేందుకు వేరే మతధర్మానికి చెందినవారు, ఇస్లాం పేరుతో చాలా వెబ్‌సైట్లను నెట్‌లో ఉంచారు.

కొన్ని సున్నితమైన విషయాలను ఈ వెబ్‌సైట్లలో వక్రీకరించి, అమాయక ముస్లిముల మనస్సులలో సందేహాలను కలుగజేస్తారు. అలాంటి వెబ్‌సైట్లు చాలానే ఉన్నాయి. వాటి వివరాలు ఇక్కడ అందించ దలచుకోలేదు. ఎందుకంటే, ఏవి చూడకూడదని చెబుతామో, ఆతృత కొద్దీ ఆ వెబ్‌సైట్లనే ఓపెన్ చేయడం మానవుని బలహీనత - అందులో తప్పుగా ఏం చెప్పారో తెలుసుకుందామని ఓపెన్ చేస్తే, అలా చేయడం వలన ఆ వైబ్‌సైట్ యొక్క హిట్‌రేట్ పెరుగుతుంది.

హిట్ రేట్ ఎక్కువ అవడం మూలానా ఎవరైనా ఇంటర్‌నెట్‌లో ఇస్లాం గురించి వెతికేటప్పుడు, ఇలాంటి వెబ్‌సైట్లే ప్రారంభంలో కనిపిస్తాయి. అందుకోసమే మంచి వెబ్‌సైట్లను ఎక్కువ సార్లు ఓపెన్ చేసి, క్లోజ్ చేస్తూ ఉండండి.

ఇస్లాం ధర్మంపై కనీస అవగాహన ఉన్న ఇంజినీరింగ్, మెడిసిన్, సైన్స్ చదువుకుంటున్న ప్రపంచంలోని ఎంతో మంది ముస్లిమ్ విద్యార్థులు, తాము తెలుసుకున్న ప్రతీ విషయాన్ని నెట్‌లో ఉంచుతున్నారు.

ఆ విధంగా వీరు సేకరిస్తున్న విషయాలని ఖుర్‌ఆన్ అద్భుతాలుగా వర్ణిస్తూ నెట్‌లో ఉంచుతున్నారు. ఖుర్‌ఆన్ అద్భుత గ్రంథమనే విషయంలో ఎటువంటి సందేహం లేదు. పూర్వం వచ్చిన ప్రవక్తలు చేసినట్లు, మీరు కూడా అద్భుతాలు చేసి చూపండి అని మక్కా అవిశ్వాసుల కోరిన కోరికకు జవాబుగా, ముహమ్మద్(స)వారు, వారి ముందు ఖుర్‌ఆన్ గ్రంథాన్ని ఉంచారు.

ఖుర్‌ఆన్ గ్రంథమే అత్యద్భుతం. అది తప్ప మరి ఏ అద్భుతాన్ని చూపినా అరబ్బులు విశ్వసించరు. 'మేము రోజూ ఖుర్‌ఆన్ గ్రంథాన్ని చదువుతున్నాం కదా! దీనిని అద్భుతం అంటారేమిటి?' అని పాఠకులలో కొందరికి అనుమానం రావచ్చు. అది అర్థం కావాలంటే అరబీ భాష తెలిసి ఉండాలి. ఆ వివరాలు ప్రత్యేక పుస్తకం రూపంలో, ఇన్షాఅల్లాహ్, త్వరలో ప్రచురించ బోతున్నాము.

ఎందుకూ పనికిరారనుకున్న అరబ్బులు, ఖుర్‌ఆన్ అవతరించిన ఒక శతాబ్దకాలంలోనే సగ భూభాగానికి చక్రవర్తులు కావడం చరిత్ర ద్వారా మనం తెలుసుకున్న సత్యం. ఇంతకంటే అద్భుతమేముంది?

చిటికె వేసి లక్షలు, కోట్లు సృష్టించడం కాదు అద్భుతమంటే. పనికి రారనుకున్న వారిని చక్రవర్తులను చేయడమే అసలైన వాస్తవ అద్భుతం!

అద్భుతం అంటే సినిమాలలో గ్రాఫిక్స్‌లో చూపించే ఎఫెక్ట్ కాదు. కనీస జ్ఞానమున్న ఎవరికైనా, ఖుర్‌ఆన్ గ్రంథాన్ని చదివితే, ఆ గ్రంథాన్ని అవగాహన చేసుకుంటే ఆ అద్భుతం గురించి తెలుస్తుంది.

మానవ శరీరంలోనే ఎంతో అద్భుతమైన టెక్నాలజీ నుంచారు అల్లాహుతాలా. అలాంటి మానవునికి ఆశ్చర్యాన్ని కలిగించే అద్భుత గ్రంథం ఖుర్‌ఆన్. అద్భుత గ్రంథం కాబట్టి, ఇందులో సైంటిఫిక్, మేథమెటికల్, సైకలాజికల్ మొ॥న రంగాలకి చెందిన ఎన్నో అద్భుతాలు ఖుర్‌ఆన్‌లో మనం కనుగొన వచ్చేమో! అందులో సందేహ పడాల్సినది కూడా ఏమీ లేదు.

వాటిని గురించి అల్లాహ్ మన జ్ఞానపరిధిలోకి తెచ్చినప్పుడు, వాటిని గురించి మనకు తెలుస్తుంది. అంతే!

అయితే, ఏదో కొత్త విషయం తెలుసుకోవాలనే ఆసక్తి మానవునికి ఉండటం సహజం. అలాంటి సహజ లక్షణంతో కొందరు సోదరులు, ఈ అద్భుత గ్రంథంలో ఆసక్తికరమైన కొత్త విషయాల కోసం వెతుకుతూనే ఉన్నారు. వారికి అవి నిరంతరం దొరుకుతూనే ఉన్నాయి.

ఈ ఆసక్తికరమైన విషయాలను ముహమ్మద్(స)వారు బోధించలేదు కనుక ధర్మసందేశాన్ని అందించే ప్రయత్నంలో వీటి యొక్క అవసరం లేదు. ఈ ఆసక్తికరమైన విషయాలను తెలియజేసేది ఇంజినీరింగ్, మెడికల్ మరియు సైన్స్ విద్యార్థులు. అయితే వీటిని కొందరు సరిగ్గా వివరించలేక పోవచ్చు.

కాని అలాంటి ఆసక్తికరమైన విషయాల గురించి ముహమ్మద్(స)వారు చెప్పి ఉంటే, మనం తప్పకుండా విశ్వసించేవాళ్ళం. అంతేకాకుండా వాటిని మన ధర్మ ప్రచారంలో ఉపయోగించ గలిగేవాళ్ళం.

కాని ఇవి ఈ మధ్యకాలంలో బయటపడుతున్న విషయాలు గనుక వీటిలో తప్పులు దొర్లవచ్చు లేదా ఇవి నిజం కూడా కావచ్చు. వీటిని ఖుర్‌ఆన్ అద్భుతాలుగా వర్ణించకూడదని మా మనవి. సోదరులు కనుగొన్న విషయాలలో, వారికి తెలియకుండా ఏదైనా పొరపాటు జరిగి ఉంటే, వేరే మతధర్మం వారు ఆ తప్పుని ఎత్తి చూపుతూ, అది అద్భుతం కాదని చెప్పవచ్చు.

ఆ విషయాలు తప్పు అయినా, నిజమైనా కూడా, వాటితో ఖుర్‌ఆన్‌కు ఎటువంటి సంబంధమూ లేదు. ఖుర్‌ఆన్ గ్రంథం ఎప్పటికీ అద్భుత గ్రంథమే!

అయితే వాటిని ఆహ్లాదపరిచే విషయాలుగా మాత్రమే తీసుకోదలిస్తే అభ్యంతరం లేదు. కల్పిత జోక్‌లతో జరిగే ఎంటర్‌టైనమెంట్ కంటే, ఇది కాస్త ఫర్వాలేదనేది మా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే సుమా!

సూరహ్‌ల వరుసక్రమానికి సంబంధించి, అలాంటి ఓ ఆసక్తికరమైన విషయాన్ని ఈ నెలలో మీకందిస్తున్నాము. దీనివలన ఖుర్‌ఆన్‌లో ఎన్ని సూరహ్‌లున్నాయి, వాటిలో ఎన్ని ఆయత్‌లున్నాయి మొ॥వి ఓ సారి పాఠకులు మననం చేసుకున్నట్లు కూడా ఉంటుందనే ఉద్దేశ్యంతో మాత్రమే అందిస్తున్నాము.

**ఇంటర్‌నెట్ వలన జరిగిన, జరుగుతున్న మేలు అంతా ఇంతా కాదు. ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిపోయింది. అయితే ఈ ఇంటర్‌నెట్ వలన కీడు కూడా అదే స్థాయిలో భయపెడుతుంది.**

| సూరహ్ నెం. | ఆయత్‌ల సంఖ్య | రెండింటి మొత్తం | సరిసంఖ్య | బేసి సంఖ్య |
|---|---|---|---|---|
| 1 | 7 | 8 | 8 | |
| 2 | 286 | 288 | 288 | |
| 3 | 200 | 203 | | 203 |
| 4 | 176 | 180 | 180 | |
| 5 | 120 | 125 | | 125 |
| 6 | 165 | 171 | | 171 |
| 7 | 206 | 213 | | 213 |
| 8 | 75 | 83 | | 83 |
| 9 | 129 | 138 | 138 | |
| 10 | 109 | 119 | | 119 |
| 11 | 123 | 134 | 134 | |
| 12 | 111 | 123 | | 123 |
| 13 | 43 | 56 | 56 | |
| 14 | 52 | 66 | 66 | |
| 15 | 99 | 114 | 114 | |
| 16 | 128 | 144 | 144 | |
| 17 | 111 | 128 | 128 | |
| 18 | 110 | 128 | 128 | |
| 19 | 98 | 117 | | 117 |
| 20 | 135 | 155 | | 155 |
| 21 | 112 | 133 | | 133 |
| 22 | 78 | 100 | 100 | |
| 23 | 118 | 141 | | 141 |
| 24 | 64 | 88 | 88 | |
| 25 | 77 | 102 | 102 | |
| 26 | 227 | 253 | | 253 |
| 27 | 93 | 120 | 120 | |
| 28 | 88 | 116 | 116 | |
| 29 | 69 | 98 | 98 | |
| 30 | 60 | 90 | 90 | |
| 31 | 34 | 65 | | 65 |
| 32 | 30 | 62 | 62 | |
| 33 | 73 | 106 | 106 | |
| 34 | 54 | 88 | 88 | |
| 35 | 45 | 80 | 80 | |
| 36 | 83 | 119 | | 119 |
| 37 | 182 | 219 | | 219 |
| 38 | 88 | 126 | 126 | |
| 39 | 75 | 114 | 114 | |
| 40 | 85 | 125 | | 125 |
| 41 | 54 | 95 | | 95 |
| 42 | 53 | 95 | | 95 |
| 43 | 89 | 132 | 132 | |
| 44 | 59 | 103 | | 103 |
| 45 | 37 | 82 | 82 | |
| 46 | 35 | 81 | | 81 |
| 47 | 38 | 85 | | 85 |
| 48 | 29 | 77 | | 77 |
| 49 | 18 | 67 | | 67 |
| 50 | 45 | 95 | | 95 |
| 51 | 60 | 111 | | 111 |
| 52 | 49 | 101 | | 101 |
| 53 | 62 | 115 | | 115 |
| 54 | 55 | 109 | | 109 |
| 55 | 78 | 133 | | 133 |
| 56 | 96 | 152 | 152 | |
| 57 | 29 | 86 | 86 | |
| 58 | 22 | 80 | 80 | |

| సూరహ్ నెం. | ఆయత్‌ల సంఖ్య | రెండింటి మొత్తం | సరిసంఖ్య | బేసి సంఖ్య |
|---|---|---|---|---|
| 59 | 24 | 83 | | 83 |
| 60 | 13 | 73 | | 73 |
| 61 | 14 | 75 | | 75 |
| 62 | 11 | 73 | | 73 |
| 63 | 11 | 74 | 74 | |
| 64 | 18 | 82 | 82 | |
| 65 | 12 | 77 | | 77 |
| 66 | 12 | 78 | 78 | |
| 67 | 30 | 97 | | 97 |
| 68 | 52 | 120 | 120 | |
| 69 | 52 | 121 | | 121 |
| 70 | 44 | 114 | 114 | |
| 71 | 28 | 99 | | 99 |
| 72 | 28 | 100 | 100 | |
| 73 | 20 | 93 | | 93 |
| 74 | 56 | 130 | 130 | |
| 75 | 40 | 115 | | 115 |
| 76 | 31 | 107 | | 107 |
| 77 | 50 | 127 | | 127 |
| 78 | 40 | 118 | 118 | |
| 79 | 46 | 125 | | 125 |
| 80 | 42 | 122 | 122 | |
| 81 | 29 | 110 | 110 | |
| 82 | 19 | 101 | | 101 |
| 83 | 36 | 119 | | 119 |
| 84 | 25 | 109 | | 109 |
| 85 | 22 | 107 | | 107 |
| 86 | 17 | 103 | | 103 |
| 87 | 19 | 106 | 106 | |
| 88 | 26 | 114 | 114 | |
| 89 | 30 | 119 | | 119 |
| 90 | 20 | 110 | 110 | |
| 91 | 15 | 106 | 106 | |
| 92 | 21 | 113 | | 113 |
| 93 | 11 | 104 | 104 | |
| 94 | 8 | 102 | 102 | |
| 95 | 8 | 103 | | 103 |
| 96 | 19 | 115 | | 115 |
| 97 | 5 | 102 | 102 | |
| 98 | 8 | 106 | 106 | |
| 99 | 8 | 107 | | 107 |
| 100 | 11 | 111 | | 111 |
| 101 | 11 | 112 | 112 | |
| 102 | 8 | 110 | 110 | |
| 103 | 3 | 106 | 106 | |
| 104 | 9 | 113 | | 113 |
| 105 | 5 | 110 | 110 | |
| 106 | 4 | 110 | 110 | |
| 107 | 7 | 114 | 114 | |
| 108 | 3 | 111 | | 111 |
| 109 | 6 | 115 | | 115 |
| 110 | 3 | 113 | | 113 |
| 111 | 5 | 116 | 116 | |
| 112 | 4 | 116 | 116 | |
| 113 | 5 | 118 | 118 | |
| 114 | 6 | 120 | 120 | |
| **6555** | **6236** | | **6236** | **6555** |

## ఈ నెల ప్రత్యేకం : ఖుర్'ఆన్‌లోని సూరహ్‌ల వరుసక్రమం
## (Serial Order of Chapters in Holy Qur'an)

పాఠకులలో చాలమందికి తెలిసిన విషయమే అయినప్పటికినీ, మరోసారి ఓ విషయాన్ని గుర్తు చేస్తున్నాము. ముహమ్మద్(స)వారికి మొట్టమొదట అందిన సూరహ్ - 'సూరహ్ అలఖ్'. మొట్ట మొదట అందిన ఈ సూరహ్ ఖుర్'ఆన్ అవతరణ సంపూర్ణం అయిన తరువాత, 96వ సూరహ్ స్థానాన్ని పొందింది. ఖుర్'ఆన్ గ్రంథ వాక్యాల అవతరణ సమయంలోని సూరహ్‌ల సీరియల్ మరియు ఖుర్'ఆన్‌లోని వరుసక్రమం ఒకటి కాదు. ముహమ్మద్(స)వారి మరణానికి ముందుగానే, ఆయన(స) స్వయంగా ప్రస్తుత ఖుర్'ఆన్‌లో ఉన్నటువంటి వరుసక్రమాన్ని చివరిగా నిర్ధారించారు.

అంటే ఖుర్'ఆన్‌లోని సూరహ్ (అధ్యాయాల) వరుసను ఏర్పాటు చేసేటప్పుడు వాటి యొక్క మొదటి సీరియల్‌ను అటూ, ఇటూ మార్చారన్నమాట. అంటే విషయాన్ని బట్టి ఏది ముందు ఏది తరువాత ఉండాలి అనే నిర్ణయం అల్లాహ్ యొక్క ఆదేశం ప్రకారమే జరిగింది. అంతే!

ప్రక్క పేజీలోని పట్టికను గమనించండి. పట్టికలో 4 కాలమ్స్ (నిలువు వరుసలు) ఉన్నాయి. మొదటి దానిలో 1 నుండి 114 వరకూ నంబర్స్ ఉన్నాయి. ఇవి ఖుర్'ఆన్‌లోని 114 సూరహ్‌ల యొక్క నంబర్లు. రెండవ నిలువు వరుసలో ఒకొక్క సూరహ్‌లో ఆయత్‌ల సంఖ్య తెలుపబడింది. మూడవ నిలువు వరుసలో సూరహ్ నంబర్‌ని, ఆ సూరహ్‌లో ఉండే ఆయత్‌లతో కలపగా వచ్చిన మొత్తం ఉంది. ఉదాహరణకు సూరహ్ ఫాతిహ్ ఖుర్'ఆన్‌లో మొదటి సూరహ్ కనుక ఆ సూరహ్ నంబర్ 1 అవుతుంది. అందులో 7 ఆయత్‌లున్నాయి కాబట్టి ఈ రెండు నంబర్లను కలిపితే 1+7=8 (ఎనిమిది అవుతుంది). ఈ 8 అనే అంకె సరిసంఖ్య (అంటే 2చే భాగించబడుతుంది). కాబట్టి ఈ '8' అనే అంకెను నాలుగవ నిలువు వరుసలో వేయాలి. అలా కాకుండా అది 'బేసి' సంఖ్య అయితే 5వ నిలువు వరుసలో వేయాలి.

ఇలా వేసిన తరువాత ప్రతీ నిలువు వరుసలోని సంఖ్యలను కలపండి. కలిపితే చివరకు ఇలా వస్తుంది :

| | | | | |
|---|---|---|---|---|
| 6555 | 6236 | | 6236 | 6555 |

(పట్టిక చూడండి)

అంటే,

1. సూరహ్‌ల మొత్తం - బేసిసంఖ్యల మొత్తానికి సమానం అయింది.
2. ఆయత్‌ల మొత్తం - సరిసంఖ్యల మొత్తానికి సమానం అయింది.

చూడటానికి బాగానే ఉంది మరి. ఖుర్'ఆన్ అండ్ సైన్స్ గురించి అందరూ మాట్లాడుతున్నారని, మేథమెటిక్స్ (గణితం) గురించి మర్చిపోయారని అనుకున్నాడో ఏమిటో, Mahir Karaosmanovic అనే సోదరుడు సింపుల్ మేథమెటిక్స్‌తో ఇలా ఆశ్చర్యపరిచాడు.

సోదరుడు చెప్పిన పట్టికను కాస్త విశ్లేషిద్దామని ఓ చిన్న ఎక్సర్‌సైజ్ చేయడం జరిగింది.

ఒకసారి పట్టికలో ఇచ్చిన సూరహ్‌ల ఆర్డర్‌ని మార్చిచూశాము. ఆయత్‌ల సంఖ్యను మార్చలేదు. ఉదాహరణకు 286 ఆయత్‌లున్న 2వ సూరహ్ అయిన 'బఖరా'ను, మొదటి సూరహ్ గానూ, మొదటి సూరహ్ అయిన 7 ఆయత్‌ల సూరహ్ ఫాతిహాను 2వ సూరహ్‌గానూ మార్చి, మరలా కూడితే, క్రింది ఫలితం వచ్చింది.

| | | | | |
|---|---|---|---|---|
| 6555 | 6236 | | 6304 | 6487 |

ఇక్కడ అన్నీ వేర్వేరు నంబర్లే వచ్చాయి. ఏ రెండు నంబర్లూ సమానం కాలేదు.

చివరిగా మరోసారి ప్రయత్నించాము. 43 ఆయత్‌లున్న 13వ సూరహ్ అయిన 'అర్రాద్'ను, 12వ సూరహ్ గానూ, 12వ సూరహ్ అయిన 111 ఆయత్‌ల సూరహ్ 'యూసుఫ్'ను 13వ సూరహ్‌గానూ మార్చి, మరలా కూడిచూస్తే, ఫలితమిలా వచ్చింది:

| | | | | |
|---|---|---|---|---|
| 6555 | 6236 | | 5940 | 6851 |

ఇప్పుడు కూడా వేర్వేరు నంబర్లే వచ్చాయి. పై విషయాలను బట్టి, ఖుర్'ఆన్‌లోని ఆర్డర్‌కు ఓ ప్రత్యేకత ఉందా? ఏమో! అల్లాహ్‌కే తెలుసు. ప్రవక్త(స) చెప్పలేదు కాబట్టి మనం ఏ నిర్ణయానికి రాలేము.

**1400 సం॥లకు పూర్వం జరిగిన సంఘటన :**

అబూ యూనుస్ అనే ఆయన చక్కని దస్తూరితో వ్రాసేవారు. ఆయిషా(రజి)వారు ఆయనచేత తన ఖుర్'ఆన్ ప్రతిని వ్రాయించుకోవడం జరిగింది. ఇరాఖ్‌కు చెందిన వ్యక్తి ఒకరు ఆమెను కలుసుకునేందుకు వచ్చి, "అమ్మా! మీ ఖుర్'ఆన్‌ను కాస్త నన్ను చూడనిస్తారా?" అని ఆమెను అభ్యర్థించాడు (బుఖారీ). ఆమె అందుకు కారణం దర్యాప్తు చేయగా అతడు, "మా వాళ్ళు ఇప్పటి వరకు ఖుర్'ఆన్ గ్రంథాన్ని సరయిన వరుసక్రమంలో పఠించలేదు. నా ఖుర్'ఆన్ ప్రతిని మీ ప్రతితో సరిపోల్చుకుంటాను" అని తెలియజేశాడు.

**"సూరహ్‌లు ముందూ వెనుక అయినంత మాత్రాన నష్టమేమీ లేదు" అంటూ ఆమె తన ఖుర్'ఆన్‌ను తెరచి ప్రతి సూరా యొక్క మొదటి ఆయత్ చదివి అతడి చేత వ్రాయించారు.**
**(సహీహ్ బుఖారీ, నెం. 4993, 66వ పుస్తకం, 6వ అధ్యా., సంపుటి 6)**

కాబట్టి పై ఎక్సర్‌సైజ్‌కి అంత ప్రాముఖ్యత లేదనిపిస్తుంది.

కాని పట్టిక చూసిన తరువాత, చాలామంది పాఠకులు ఖుర్'ఆన్‌ను తెరచి ఆయత్‌ల సంఖ్యను ఖచ్చితంగా ఇచ్చారో? లేదో? నని తప్పనిసరిగా చెక్ చేసి ఉంటారని మా అంచనా. ఈ విధంగా మీ చేత ఎక్సర్‌సైజ్ చేయించిన, ఈ వ్యాసం మీ మెదడుకు మేత మాత్రమే సుమా!

**ముఖ్యగమనిక : ఈ వ్యాసంలో ఇచ్చిన పట్టికకు మరియు ఇస్లాం ధర్మానికి ఎటువంటి సంబంధం లేదు. కాబట్టి దీనిపై ఎటువంటి చర్చనుగాని, అభిప్రాయాలనుగాని కోరడం లేదు.**

**ఈ విషయాలను ధర్మ ప్రచారం కోసం ఉపయోగించ వద్దని కోరుతున్నాము.**

ఇంటర్‌నెట్‌లో ఈ విషయాలు అందరికీ అందుబాటులో ఉండటం వలన, ఇతరులెవరైనా ఇలాంటి విషయాలు మీతో చర్చించబోతే, వీటికి ఇస్లాంలో ఎటువంటి ప్రాముఖ్యత లేదని తెలియజేయండి.

ఏ ధర్మాన్ని కించపరిచే ఉద్దేశ్యం మాకు లేదు. అన్ని ధర్మాలను గౌరవిస్తున్నాం

# టెర్రరిజం

- క్రైస్తవ టెర్రరిజం ?
- సిఖ్ఖు టెర్రరిజం ?
- యూదు టెర్రరిజం ?
- కమ్యూనిస్ట్ టెర్రరిజం ?
- హిందూ టెర్రరిజం ?
- ఇస్లామిక్ టెర్రరిజం ?

తీవ్రవాదానికి, మత ధర్మానికి ఏ విధమైన సంబంధం లేదు. ✓

## టెర్రరిజం అనేది ముస్లిములకే స్వంతమన్నట్లు, మీడియా ఎందుకు ముస్లిములనే టార్గెట్‌గా పెట్టుకుంది?

తీవ్రవాదాన్ని 'ముస్లిము'లుగా మేము ఖండిస్తున్నాం. మానవులకు అపకారాన్ని తలపెట్టే ఏ పనినైనా మేం వ్యతిరేకిస్తాం. మానవులందరూ ఒకే జంట యొక్క వారసులని, ఖుర్'ఆన్ ద్వారా తెలుసుకుని ప్రపంచ ప్రజలందరినీ వారు హిందువులైనా, క్రైస్తవులైన లేక మరే ధర్మానికి చెందిన వారైనా సరే, వారిని మా సోదరులుగానే భావిస్తున్నాం. మా సోదరులపై జరిగే ఎటువంటి హింసనైనా నిర్ద్వందంగా ఖండిస్తున్నాం. కాని మీడియా వారి రెండు నాలుకల ధోరణిని వివరించాలనేది ఈ శీర్షిక యొక్క ప్రధానోద్దేశం కాబట్టి ఈ శీర్షికలో మీడియా భాషనే వాడుతున్నాం. మా భాష మాత్రం కాదు. వేరే ధర్మం వారి ఎవరికైనా బాధ కలిగితే, మీడియా వారి వలన ముస్లిములకు కూడా అంతే బాధ కలిగిందని అర్థం చేసుకుని, కొంత మంది ప్రోద్భలంతో మీ తోటి ముస్లిం సోదరులపై అనాగరికంగా వ్రాస్తున్న మీడియా వ్రాతలను ఖండించమని కోరుతున్నాం.

3

### 20వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన తీవ్రవాద దాడులు
### (1901 నుండి 1950ల మధ్య కాలంలో జరిగిన దాడులు)

**1901 –** సెప్టెంబర్ 6వ తేదీన అమెరికా అధ్యక్షుడైన విలియమ్ మెక్‌కిన్లే హత్య గావించబడ్డారు. హత్య చేసిన వాడు **- Leon Czolgosz**. ఇతనొక **<u>anarchist</u>**. (anarchist అంటే రాచరికానికి వ్యతిరేకంగా పోరాడేవాడు)

**1904** - జూన్ 16వ తేదీన గవర్నర్ జనరల్ Nikolai Ivanovich Bobrikov హెలెసింకీలోని సెనేట్ హౌస్‌లో హత్యగావించబడ్డారు. హత్య చేసినవాడు ఫిన్నిష్ జాతీయుడైన - <u>Eugen Schauman</u>.

**1906** - పువ్వుల బొకేలో బాంబును దాచి, స్పెయిన్ రాజైన Alfonso XIII మరియు బేటెన్‌బెర్గ్‌కు చెందిన ఆయన భార్య Victoria Eugenie కలిసి వెళుతున్న వాహనంపై, వారిద్దరూ పెళ్ళి చేసుకున్న రోజునే ఓ తీవ్రవాది విసిరాడు. ఆ దంపతులకు ఏమీ కాలేదు గాని 24మంది ప్రజలు ఆ దాడిలో చనిపోయారు. ఈ దాడికి పాల్పడినవాడు - Mateu Morral అనే anarchist.

**1908** - ఫిబ్రవరి 1వ తేదీన పోర్చుగీస్ రాజు Carlos ను మరియు అతని కొడుకైన, ప్రిన్స్ Luis Filipeను ఇద్దరు వ్యక్తులు చంపారు. చంపిన వ్యక్తులు పోర్చుగీస్ రిపబ్లికన్ పార్టీతో సంబంధమున్న తీవ్రవాద సంస్థ అయిన Carbonaria కి చెందిన వారు.

**1908** - జూలై 13వ తేదీన జరిగిన Amalthea బాంబింగ్. సమ్మె చేసేవారి స్థానంలో పనిచేయడానికి వచ్చిన వారిపై Anton Nilsson అనే యువ సోషలిస్ట్ చైతన్యకారుడు వేసిన బాంబ్ వలన ఒకరు చనిపోగా, ఈ దాడిలో మరో 23మంది గాయపడ్డారు.

1909 - అక్టోబర్ 26వ తేదీన కొరియన్ స్వతంత్ర్య పోరాట యోధుడు, Jung-geun, జపాన్ ప్రధాని Ito Hirobumi ని హత్య చేశాడు.

1910 - అక్టోబర్ 1వ తేదీన అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలోని లాస్‌ఏంజెల్స్ నగరంలోని 'లాస్‌ఏంజెల్స్ టైమ్స్' అనే వార్తా పత్రిక బిల్డింగ్‌పై బాంబు దాడి జరిగింది. 21మంది కార్మికులు చనిపోయారు.

**1914** - జూన్ 28వ తేదీన Franz Ferdinand లోని Sarajevo లో ఆస్ట్రియా రాకుమారుని మరియు అతని భార్యను హత్య చేశారు. ఇది మొదటి ప్రపంచ యుద్ధానికి దారితీసింది.

**1915** - జనవరి 1న జరిగిన Broken Hill పోరాటం. ఇండియాలోని బ్రిటిష్ కాలనీకు చెందిన తీవ్రవాదులు ఆస్ట్రేలియా పట్టణంపై కాల్పులు జరిపారు. 6 గురు చనిపోయారు.

**1915** - జూలై 2వ తేదీన అమెరికా సెనేట్ రిసెప్షన్ గదిలో, జర్మన్ ప్రొఫెసర్ అయిన Frank Holt బాంబును పేల్చాడు. ఆ తరువాతి రోజు ఉదయం J.P. Morgan, Jr. ని చంపాలని ప్రయత్నించాడు. J.P. Morgan Jr. బ్రిటన్ నుండి ఆయుధ సామాగ్రిని కొనే ముఖ్య అమెరికన్ ఏజెంట్ కుమారుడు. ఈ దాడి చేయడానికి కారణం: జర్మనీకు వ్యతిరేకంగా జరిగే మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికా ప్రవేశాన్ని ఆపడం.

**1920** - సెప్టెంబర్ 16న అమెరికాలో జరిగిన వాల్‌స్ట్రీట్ బాంబింగ్. ఈ బాంబు దాడిలో 38మంది మరణించారు. 300మంది

గాయపడ్డారు.

**1921** - మార్చి నెలలో ఇటలీలోని మిలన్ థియేటర్‌పై రాచరికాన్ని వ్యతిరేకించే వారు చేసిన బాంబు దాడిలో 80 మంది చనిపోగా, 21 మంది గాయపడ్డారు.

**1925** - ఏప్రిల్ 16వ తేదీన బల్గేరియా రాజధాని సోఫియాలో సెయింట్ Nedelya చర్చ్‌పై జరిగిన దాడిలో 150 మంది చనిపోయారు. ఇందులో ఎక్కువమంది ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులే. అంతేకాకుండా ఈ దాడిలో 500 మంది గాయపడ్డారు.

1927 - అమెరికాలోని అలబామాలో Ku Klux Klan విస్తృతంగా రాజకీయ టెర్రర్‌ని ఆరంభించింది.

1933 - అక్టోబర్ 10వ తేదీన నైట్రోగ్లిసరీన్ బాంబ్‌వలన, అమెరికాలో బోయింగ్ 247 విమానం నాశనమైంది. ప్రయాణిస్తున్న 7గురు చనిపోయారు. వాయుయాన చరిత్రలో ఈ తరహా సంఘటన మొదటిది.

1934 - అక్టోబర్ 9వ తేదీన యుగోస్లేవియా రాజు 1వ అలెగ్జాండర్ మరియు ఫ్రెంచ్ విదేశాంగ మంత్రి Louis Barthouలను Marseille లో Ustashas మరియు IMRO (*Internal Macedonian Revolutionary Organization*) హత్య చేశారు.

1940 - 1956 - న్యూయార్క్ నగరంలోని గ్రాండ్ సెంట్రల్ స్టేషన్ మరియు పార్లమెంట్ థియేటర్ మొ॥న పబ్లిక్ ప్రదేశాలలోఈ 16 సంవత్సరాల కాలంలో 30 కంటే ఎక్కువ బాంబులను George Metesky ఉంచాడు. వీటివలన దాదాపు 10 మంది గాయపడ్డారు. స్థానిక విద్యుత్ ఉపయోగించడాన్ని నిరసన నిమిత్తం ఈ పనిచేశాడు. ఇతనిని "Mad bomber" అంటారు. ఇతను భయపిస్తూ ఎన్నో లేఖలను కూడా వ్రాశాడు.

1946 - కింగ్ డేవిడ్ హోటల్ పై బాంబింగ్. జెరూసలెం లోని బ్రిటిష్ మిలటరీ హెడ్‌క్వార్టర్స్ పై Zionist వర్గం Irgun దాడి చేసింది. దీని వలన మిలటరీ వారితో పాటు, సామాన్య ప్రజానీకం కలిసి మొత్తం 91మంది మరణించారు. (Zionist అంటే జెరూసలెంలో యూద పునరుద్ధరణను సాధించడానికి ఏర్పడిన వర్గం)

1948 - మహాత్మగాంధీగారిని హత్య చేశారు. ఇది ఎవరో చేశారో పాఠకులకు తెలిసిన విషయమే!

***Source :*** *Internet [http://en.wikipedia.org/wiki/List_of_terrorist_incidents]*

**తరువాయి 20 సంవత్సరాలలో జరిగిన**

**అసంఖ్యాకమైన తీవ్రవాద దాడులపై ప్రత్యేక వివరాలను, ఇన్షా అల్లాహ్, వచ్చే సంచికలో అందిస్తాము.**



**Source :** http://en.wikipedia.org

**అమెరికాలో Wallstreet లో జరిగిన బాంబింగ్ : తేది 16.09.1920**

**చనిపోయినవారు : 38 గాయపడినవారు : 300**

పైన వివరించిన 19 తీవ్రవాద దాడులలో 7 దాడులు అమెరికాలోనే జరిగాయి. బాంబు దాడులు జరగడం అమెరికాలో కొత్తేమీ కాదని తెలుస్తుంది. ఇస్లాం ఆవిర్భవించిన దగ్గరనుండి 1940 వరకూ, అమెరికాపై ఏ ఒక్కదాడి కూడా ఏ ముస్లిమూ చేయలేదు.

సెప్టెంబర్ 11 (లేదా 9/11) గురించి పదే పదే చెబుతూ, ఇస్లామ్ మతాన్ని అవమానించడానికి ప్రయత్నించే అమెరికన్లు ఓ 80 సంవత్సరాల క్రితం జరిగిన సెప్టెంబర్ 16 (లేదా 9/16)ను కూడా ఓ సారి గుర్తుచేసుకుంటే బావుంటుంది.

ఇవాళ్టికి కూడా 9/11 దాడిని ట్విన్ టవర్స్‌పై ఎవరు చేశారో స్పష్టం కాలేదు. అమెరికాలోని విద్యా వేత్తలు, నిపుణులు, సైంటిస్టులలో చాలామంది ఈ పని అమెరికా ప్రభుత్వ కుట్రగా అభివర్ణిస్తూ ఎన్నో ఆధారాలను ఇంటర్‌నెట్‌లో ఉంచారు. కాబట్టి ఈ దాడి అనుమానాస్పదమైనది. వివేకవంతులైన పాఠకులు ఆలోచించాలి.

అమెరికాలోని ట్విన్ టవర్స్‌పై 2001 సం॥లో దాడి జరిగింది. ఆ దాడి జరుగక ముందు నుండి కూడా అమెరికా 'టెర్రరిస్టులందరూ ముస్లిములే' అంటుంది. ఇరాఖ్‌లో విధ్వంసకర ఆయుధాలున్నాయంటూ అబద్ధాలతో ప్రపంచాన్ని నమ్మించి మోసం చేసి ఇరాఖ్‌పై దాడి చేసిన అబద్ధాల అమెరికాకు, తీవ్రవాదులందరూ ముస్లిములే అని నమ్మించడం పెద్ద పనికాదు కదా!

**పదే పదే అబద్ధాలు చెప్పడం అమెరికాకు అలవాటు. పదే పదే వాళ్ల మాటలను నమ్మడం ప్రపంచ ప్రజలకు అలవాటు.**

**మరి ప్రజలు సత్యాన్నెప్పుడు తెలుసుకుంటారు?**

**ఇప్పటివరకూ అందించిన వివరాలను బట్టి, 1940 సం॥ వరకూ, ముస్లిములకూ తీవ్రవాద దాడులకు ఎటువంటి సంబంధమేమీ లేదు. జరిగిన దాడులన్నింటికీ ఇతరులే కారణం**

- డా. నాగిరెడ్డి శ్రీనివాసరావు

## గెడ్డం మరియు హిజాబ్ - తీవ్రవాదానికి చిహ్నాలా?

ముస్లిమ్‌కి గెడ్డం ఉంటే అతనిని తీవ్రవాదిగా అనుమానిస్తున్నారు. ఇదే గెడ్డం మరి యోగవిద్యను నేర్పే బాబాలకు కూడా ఉంది కదా! యూద మతస్థులు కూడా గెడ్డం పెంచుతారు. నోబెల్ శాంతి బహుమతి పొందిన రవీంద్రనాథ్ ఠాగూర్ గారికి కూడా గెడ్డం ఉండేది. ముస్లిములు పెంచే గెడ్డానికి మరియు ఇతర ధర్మాలవారు పెంచే గెడ్డాలకి ఏమైనా తేడా ఉందా?

ముస్లిమ్ గెడ్డంలోని వెంట్రుకలకు బాంబుల్లా పేలే ప్రత్యేకమైన శక్తి ఏమైనా ఉందా? ఇస్లాం ధర్మం శాంతిని ప్రభోదిస్తుంది. ఇస్లాం ధర్మాన్ని పాటించేవాడు 'తీవ్రవాదాన్ని' నిర్ద్వందంగా వ్యతిరేకిస్తాడు.

ఆ మధ్య ముంబయి హొటల్‌పై దాడి జరిగింది. కసబ్‌ను పట్టుకున్నారు. అతనికి గెడ్డం ఉందా? విధ్వంసం చేయడమే తీవ్రవాదుల లక్షణమైనప్పుడు, వారికి గెడ్డాన్ని తీసివేయడం ఒక లెక్కా?

విధ్వంసాన్ని సృష్టించడానికి తన శరీరాన్నే పేల్చుకోవడానికి, తీవ్రవాది సూసైడ్ బాంబర్‌గా తయారౌతున్నప్పుడు, తన శరీరాన్ని ముక్కలు, ముక్కలుగా మారడానికి సిద్ధమైనప్పుడు, గెడ్డపు వెంట్రుకలని ముక్కలు ముక్కలుగా చేసుకోవడం పెద్ద విషయమా?

గెడ్డం పెంచిన వారిని తీవ్రవాదులుగా అనుమానిస్తున్నారని వాళ్లకి తెలియదా? అలాంటి తీవ్రవాదులు గెడ్డాలతో ఎందుకు కనిపిస్తారు?

ఇది కేవలం ముస్లిమ్‌లపై, ఇస్లాం ధర్మంపై పాశ్చాత్య దేశాలు చేస్తున్న రాక్షసదాడి మాత్రమే! పైశాచిక ఆనందం. అంతే!

కొంతమంది మగవాళ్ళు, స్త్రీలు పెంచినట్లు జడవేసుకుంటే, అది ఈ రోజున ఫ్యాషన్. ఇలాంటి వారు సమాజంలోని వింత రోగులు. వీరిపై ఎటువంటి అనుమానముండదు. ముందువైపు వెంట్రుకలు పెంచితే తీవ్రవాది, వెనుకవైపు వెంట్రుకలు పెంచితే నాగరీకుడు.

విద్య లేనివాన్ని వింత పశువు అని వర్ణిస్తూ తెలుగు సామెత ఉండనే ఉంది. కాని ఈ పాశ్చాత్యులకు విద్య ఉండి కూడా వారు వింత పశువుల్లా ప్రవర్తిస్తున్నారు.

ఇంగ్లీష్ సినిమాలలో, ముఖ్యంగా అమెరికన్ సినిమాలలో, మనిషీ జంతువూ కలగలిపిన వింత ఆకారాలు గల జీవులు వేరే గ్రహం నుండి వచ్చి మన గ్రహంపై విధ్వంసం సృష్టించడం చూపిస్తూ ఉంటారు.

ఇవి చూస్తుంటే ఒకటనిపిస్తుంది. ఇలాంటి జీవులు ప్రత్యేకంగా వేరే గ్రహం నుండి రానవసరం లేదు. అమెరికన్లు వారికేమీ తీసిపోరు. ప్రస్తుతం వీరు మిగతా దేశాలపై చేస్తున్న పని కూడా అదే కదా!

శరీరాకృతి తెలియని విధంగా మరియు తనను చూసిన మగవానికి వేరే భావం కలుగకుండా ముస్లిమ్ మహిళ హిజాబ్‌ను ధరిస్తే, ఆమెను కూడా తీవ్రవాదిగా అనుమానిస్తున్నారు. అదే సమయంలో బట్టలు వేసుకోకుండా, లోదుస్తులతో తిరిగే పాశ్చాత్య మహిళ 'సంఘ సేవిక'గా పొగడబడుతుంది.

శరీరం నిండుగా బట్టలుంటే స్త్రీని అణగద్రొక్కినట్లు, బట్టలూడదీస్తే 'స్వేచ్ఛా మహిళ'.

వంటి మీద గజ్జి, తామర ఉన్నట్లు 'టాట్యూస్' వేయించుకొని, కుక్కలు చింపినట్లు, చిరుగులతో బట్టలేసుకుంటే, అలాంటి ఆడవాళ్ళకి పాశ్చాత్య దేశీయులు గౌరవమిచ్చి, స్వేచ్ఛ పొందిన మహిళలుగా ప్రశంసిస్తారు.

ఇలాంటి వింత జనులిచ్చే గౌరవం, ప్రశంసలు - సభ్యతా సంస్కారమున్న ఏ స్త్రీకి అవసరం లేదు.

నిజంగా మగవాని చెప్పుచేతల్లో ఉండి, వారు చెప్పినట్లు చేస్తూ స్వేచ్ఛను కోల్పోయింది ఎవరు?

తమ కోరికలకు అనుగుణంగా స్త్రీని విలాస వస్తువుగా, సుఖాన్ని అందించే యంత్రంగా భావించబట్టే, కొంతమంది మగవాళ్ళు స్త్రీని బట్టలు వేసుకోకుండా లోదుస్తులతో తిరిగేలా చేస్తున్నారు. వీరు చేసుకుంటున్న వేషధారణ నీతిలేని మగవాళ్ళ కోరికలను తృప్తి పరచడానికే!

అలాంటి మూర్ఖులకు బానిసలుగా బ్రతుకుతూ, దానిని స్వేచ్ఛ అనుకోవడం నిజంగా ఎంత మూర్ఖత్వమో నేటి చదువుకున్న స్త్రీలు ఇప్పటికైనా ఆలోచించాలి.

స్కూటర్ నడిపేవాడు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలి. లేకపోతే పోలీస్‌వారు ఆపి ఫైన్ కట్టించుకుంటారు. మనకి స్వేచ్ఛ లేదా?

**ఎందుకు హెల్మెట్ ధరించాలండి? అని అడిగితే, 'నీ రక్షణే మా బాధ్యత' అంటారు. మరి స్త్రీ హిజాబ్ ధరిస్తే, అది ఆమెకు రక్షణ, గౌరవాన్ని ఇస్తాయని చెబితే, ఆమెకు స్వేచ్ఛ లేదంటారెందుకని?**

మగవాళ్ళను రెచ్చగొట్టే విధంగా అసభ్యకరమైన దుస్తులు ధరించి వెళ్ళే స్త్రీలను ఆపి, వారి చేత ఫైన్ కట్టించే రోజు రావాలి.

గెడ్డం పెంచడం, హిజాబ్ ధరించడం - తీవ్రవాదుల లక్షణాలు కాదు.

సంస్కారం లేని చదువులతో 21వ శతాబ్దపు నాగరీకులుగా పిలువబడే కొన్ని వింతప్రజల వింత అనుమానాలు మాత్రమే ఇవి.

చదువుకున్నవారు కూడా ఇలాంటి వింత అనుమానాలను నమ్మడం హాస్యాస్పదంగా ఉంది.

చదువు ఉంది. ఆలోచించగల మెదడూ ఉంది. కాని వైరస్‌ల వలే 'మీడియా' వాళ్ళు ప్రజల మెదడులోకి చొచ్చుకుపోయి, మెదడుకు కొన్ని విషయాలలో ఆలోచించే శక్తిని తగ్గించేస్తున్నారు.

**ఈ మీడియా వైరస్‌కి చిన్నతనంలోనే వ్యాక్సిన్ వేయాలి. అప్పుడే సామాజిక ఆరోగ్యం బాగుంటుంది.**

కాదంటారా?

## అవినీతి అధికారులను తయారుచేసే ఫ్యాక్టరీలు

ఈ సంచికలోని ఖుర్'ఆన్ మరియు సైన్స్ శీర్షికలో **'మదరసా'** అభివృద్ధి ఎలా జరిగిందో చెప్పడం జరిగింది. ఆధునిక విద్యా వ్యవస్థకు మారుపేరుగా 'మదరసా'ను చెప్పుకోవచ్చు. ప్రపంచంలోని నేటి ఎన్నో ఆధునిక శాస్త్రాలకు పితామహుల నందించినవి ఈ 'మదరసా'లే.

కాని నేడు ఈ 'మదరసా'లను తీవ్రవాదులను తయారుచేసే ఫ్యాక్టరీలంటూ పాశ్చత్య మీడియాతో చేతులు కలిపి, ప్రపంచ మీడియా దుష్ప్రచారం చేస్తుంది.

ఒకవేళ తీవ్రవాదులెవరైనా వైజాగ్‌లో దాక్కుని ఉంటే, వైజాగ్ నగరం టెర్రరిస్టులను తయారుచేస్తుందని చెబుతామా?

ఈనాడు పేపర్లో చూస్తూనే ఉన్నాం. ఎసిబి వలలో ఐ.ఏ.యస్. ఆఫీసర్, ఎసిబి వలలో కమీషనర్, ఎసిబి వలలో .... ఇలా ఎన్నో వార్తాకథనాలు వస్తున్నాయి. అవినీతి నిరోధక శాఖ ఇలా ఎంతో మంది ఉన్నత విద్య నభ్యసించిన అధికారులను గతంలో పట్టుకుంది. పట్టుకుంటూనే ఉంది.

వీరంతా ఉన్నత విద్య నభ్యసించారు కాబట్టి, వారు ఏ స్కూలులో అయితే చదువుకున్నారో, ఏ కాలేజ్, ఏ యూనివర్శిటీలో చదువుకున్నారో తెలుసుకుని వాటినన్నింటిని 'అవినీతి అధికారులను తయారుచేసే ఫ్యాక్టరీలు' గా వర్ణించగలరా?

వర్ణించలేరు! ఎందుకని!

**ఆ స్కూల్‌లోగాని, ఆ కాలేజ్‌లోగాని, ఆ యూనివర్శిటీలో గాని మీడియా వాళ్ళు కూడా చదివి ఉంటారు. అందుకని ఆ విధంగా చెప్పలేరు.**

కాని 'మదరసా' అయితే మీడియా కభ్యంతరం లేదు. ఎందుకంటే 'మదరసా'లో ముస్లిముల పిల్లలే చదువుకుంటున్నారు కాబట్టి.

ఉన్నత విద్య నభ్యసించిన అధికారులు 'నీతి'ని వదిలేయగా లేనిది, మీడియా వాళ్ళు 'నీతి'ని వదిలేస్తే తప్పేమిటి? అని అడిగితే ఏమి సమాధానం చెప్పగలం?

అసలు మీడియాని అలా అడిగేది ఎవరు? మెజారిటీ సభ్యులకు వ్యతిరేకంగా వ్రాయడానికి మీడియా ధైర్యం చేయదు.

మీడియా చెప్పేది పూర్తిగా నిజమని భావించినంత కాలం, ఇస్లాం ధర్మంపై దుష్ప్రచారం జరుగుతూనే ఉంటుంది.

ఇప్పుడిప్పుడే కొన్ని పత్రికలు ఇలాంటి వ్రాతలను ఖండిస్తున్నాయి.

ఇది శుభపరిణామమే!

కాబట్టి మన ఆవేదనని మీడియాకి వినిపించాలి. ఎన్నాళ్లు వినిపించాలి?

ఎంతమంది వినిపించాలి?

మీరు రోజూ ఏ న్యూస్ పేపర్ చదువుతున్నారో, ఆ న్యూస్ పేపర్ ఎడిటర్‌కి, ఓనర్‌కి, ఆ సదరు విలేఖరికి 'ఇస్లామిక్ టెర్రరిజమ్' లేదా 'ఇస్లామిక్ టెర్రరిస్ట్' అనే పదాలను వాడవద్దని సౌమ్యంగా మనవిచేస్తూ లేఖలు వ్రాయండి.

మన శాంతిబాట పాఠకులు ప్రతీ ఒక్కరూ తమ ఇంటిలో పోస్ట్‌కార్డులను సిద్ధంగా ఉంచుకోండి. ఎప్పుడైనా 'ఇస్లామ్'ని టెర్రరిజంతో కలిపి చెప్పినప్పుడు, వెంటనే కార్డుపై వ్రాసి మీ ఆవేదనను తెలియజేయండి.

ఈ పదాలను మీడియాలో నిషేధించే వరకూ వ్రాస్తూ ఉండండి.

**మీడియావారికి మనవి :**

'ఇస్లామిక్ టెర్రరిజమ్' పేరుతో అమాయక ప్రజలలో భయాన్ని కలిగించకండి.

ప్రజలలో భయాన్ని కలిగిస్తున్నందుకు, అందుకు కారకులైన వారందరూ టెర్రరిస్టులే అవుతారు కదా!

కాబట్టి **'మీడియా టెర్రరిజమ్'** అనే సరికొత్త టెర్రరిజాన్ని ప్రోత్సహించకండి.

**దివ్యఖుర్'ఆన్‌లో స్పష్టంగా ఇలా ఉంది:**

"....హత్యకు బదులుగా గాని లేదా కల్లోలాన్ని వ్యాపింప జేసినందుకుగాని కాక, మరే కారణం వల్లనైనా **ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే** ...." (దివ్య ఖుర్'ఆన్ 5:32)

---

"ఒకవేళ మీరు ప్రతీకారం చేస్తే కేవలం మీపై దౌర్జన్యం జరిగిన మేరకే ప్రతీకారం చెయ్యండి. కాని **మీరు సహనం చూపితే, అది నిశ్చయంగా సహనం చూపేవారికే మంచిది.**"
(దివ్య ఖుర్'ఆన్ 16:126)

**"I hope the time is not far off when I shall be able to unite all the wise and educated men of all the countries and establish a uniform regime based on the principles of Qur'an which alone are true and which alone can lead men to happiness."**

*Napolean Bonaparte as Quoted in Cherfils, 'Bonaparte et Islam,' Paris, France, pp. 105, 125.*

**"అన్ని దేశాలలోని మేధావులను మరియు విద్యావంతులను ఒకటిగా కలిపి ఖుర్'ఆన్ యొక్క ప్రకృతి నియమాల ప్రకారం ఒకేవిధమైన పరిపాలనా విధానాన్ని నేను స్థాపించ గలిగే సమయం ఎంతో దూరంలో లేదని నేను నమ్ముతున్నాను. ఖుర్'ఆన్‌లోని నియమాలు మాత్రమే సత్యమైనవి మరియు అవి మాత్రమే మనిషిని సంతోషం వైపు తీసుకెళతాయి"** - నెపోలియన్ బోనాపార్టే

ప్రతీ స్త్రీ లేదా పురుషునికి తొలి బడి అమ్మ ఒడి. గొప్ప గొప్ప జ్ఞానులు, మేధావుల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. తొలి గురువులు తల్లిదండ్రులే. ఆ తరువాతనే, పాఠశాలలో చేరిన దగ్గరనుండి, మిగిలిన గురువులు పరిచయమౌతారు. వీరందరినీ మీరు గౌరవించాలి. అయితే వీరందరికీ జ్ఞానాన్ని ఇచ్చిన సృష్టికర్తే విశ్వమంతటికీ గురువు - ఆయనే 'అల్లాహ్'. ఏ గురువు చెప్పినా అర్థం కాకపోయినా లేక మరేదైనా చెప్పుకోలేని సమస్య మీకొస్తే డైరెక్టుగా అల్లాహ్‌నే అడగండి. ఆయన వింటాడు. మీకు జవాబు కూడా వస్తుంది.

అయితే ఇక్కడ ఓ ముఖ్యవిషయాన్ని మీకు ఓ ఉదాహరణ ద్వారా చెబుతాను. సెల్‌ఫోన్‌లో మాట్లాడేటప్పుడు, మీ వైపు సిగ్నల్ సరిగ్గా లేకుంటే, అవతలి వ్యక్తి మాటలు మీ సెల్‌కు చేరవు కదా! అలాగే 'అల్లాహ్' ఇచ్చిన సమాధానం మీకు అర్థమవ్వాలంటే, మీ సిగ్నల్ బలంగా ఉండాలి. సెల్‌ఫోన్ సిగ్నల్ కాదు. అల్లాహ్‌పై మీ మనస్సులో ఉన్న విశ్వాసం చాలా బలంగా ఉండాలి. ఖుర్ఆన్‌ను, ముహమ్మద్(స) వారి బోధనలను (హదీసులను) అర్థం చేసుకుని, వాటి ప్రకారం మీరు ఆచరిస్తే, క్లాసులో మీరే టాప్ రేంకర్స్. విజయులు మీరే. అలా కాకపోతే అడగండి!

**3**

## భారీ ప్రేలుడు (Big Bang)

బిగ్‌బేంగ్ గురించి సరదా విషయాలు మాట్లాడుకుందాం అని క్రిందటి నెలలో అనుకున్నాం కదా! అయితే ఈ సరదా విషయాలలోకి వెళ్లేముందు ఒకసారి కొన్ని పాయింట్లను జ్ఞాపకం చేసుకుందాం!

1. చాలా చాలా చాలా కాలం క్రితం, అసలు విశ్వం (universe) లేనే లేదు.
2. మనం కంటితో చూడలేని సూక్ష్మమైన అతి చిన్న ప్రదేశంలో శూన్యంలో ఓ భారీ ప్రేలుడు సంభవించింది.
3. ఆ ప్రేలుడు తర్వాత అనూహ్యమైన సంఖ్యలో particles ఉనికిలోకి వచ్చి విశ్వం తయారైంది. ఆ particles ఒకదాని నుండి మరొకటి దూరంగా కదలడం ప్రారంభించాయి.
4. ఆ విధంగా విశ్వం పెరుగుతూ ఉంది. దానిలోని భాగాల మధ్య దూరం పెరుగుతూ వస్తుంది.

ప్రపంచంలోని మానవలందరూ కలిసి అందుబాటులోనున్న మెటీరియల్స్ అంతా ఉపయోగించి ఇటువంటి భారీ ప్రేలుడుతో విశ్వాన్ని తయారు చేయగలరా? అది అసాధ్యం (impossible). ఇటువంటి శక్తి ఒక్క 'అల్లాహ్'కు మాత్రమే ఉంది.

ప్రియమైన బాలలూ! మన విశ్వం ఎంతో సుందరంగా తీర్చిదిద్దినట్లు ఉంటుంది కదా! మరి ఇంత అందమైన విశ్వం ఓ ప్రేలుడు వలనే ఏర్పడిందా? ఆశ్చర్యంగా ఉందే! ఎక్కడైనా బాంబు పడితే, ఆ ప్రాంతంలో అందంగా కట్టబడిన భవనాలు కూడా నాశనమై చెల్లాచెదురై పోతాయి కదా! ప్రపంచంలో శక్తివంతమైన బాంబు ఏది? ఆటమ్ బాంబ్ కదా! ఇలాంటి బాంబ్ వేస్తే మహానగరాలే సర్వనాశనమై పోతాయి కదా! జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై అమెరికా వేసిన బాంబుల వలన ఆ ప్రాంతాలు ఎలా నాశనమయ్యాయో మీకు తెలుసు కదా!

కాని విశ్వం తయారుకావడానికి జరిగిన ప్రేలుడు చాలా చాలా పెద్దది. పైన చెప్పినటువంటి ఆటమ్ బాంబులను కోట్ల కోట్ల కోట్ల-సంఖ్యలో ఒకేసారి వేస్తే ఎలా ఉంటుందో అలాంటి ప్రేలుడు అన్నమాట 'బిగ్‌బేంగ్' అంటే.

ఇలాంటి బిగ్‌బేంగ్ ద్వారా అల్లాహ్ విశ్వాన్ని తయారుచేశాడు.

మనం బీచ్‌కి వెళ్ళాం. అక్కడ ఇసుకలో ఓ బాంబ్ వేశామనుకోండి. ఏం జరుగుతుంది? ఇసుక రేణువులు గాలిలో వెదజల్లబడతాయి గాని, అక్కడ ఇసుకతో చేయబడిన ఓ అందమైన కోట ఏమైనా ఏర్పడుతుందా? ఒకవేళ బాంబు వేయడం వలన, అలాంటి ఇసుక బొమ్మరిల్లు తయారు చేయబడిందని ఎవరైనా చెబితే, అది విన్న వారందరూ నవ్వుతారు. అబద్ధం చెబుతున్నాడు అంటారు.

అలాగే ఈ విశ్వం అందులోని సుందరమైన వ్యవస్థలు, దానికవే ఏర్పడ్డాయని చెప్పినా, అది కూడా అబద్ధమే అవుతుంది. దానంతట అవే ఏర్పడలేదు. అవి అల్లాహ్‌చే సృష్టించబడ్డాయి. ఈ నెలకు ఇది చాలు. ఇన్షా అల్లాహ్, వచ్చే నెలలో మరిన్ని విశేషాలు చెప్పుకుందాం! అంతవరకూ శలవా మరి! (హారున్-యహ్యా వారికి కృతజ్ఞతలతో)

**(మిగతా భాగం వచ్చే సంచికలో)**

### మీకు స్కూలులో ఇలా నేర్పి ఉంటారు

1. ఆధునిక ఎనస్థీసియాను 19వ శతాబ్దంలో హంప్రీ డేవీ మరియు హొరేస్ వెల్స్ అనే వారు కనుగొన్నారు.

### కాని మీరు తెలుసుకోవల్సిన అసలు నిజం ఏమిటంటే..

1. డేవీ మరియు వెల్స్ రాకకు 900 సంవత్సరాల ముందే ఆధునిక ఎనస్థీసియాను కనుగొనడమే కాకుండా, దానిపై పట్టు సాధించి, దానిని పరిపూర్ణం చేసినవారు ముస్లిమ్ ఎనస్థీసియా నిపుణులే! వారు నోటిద్వారా మరియు ముక్కుద్వారా పీల్చే ఎనస్థీసియాను ఉపయోగించారు.

*Modern anesthesia was invented in the 19th century by Humphrey Davy and Horace Wells.*

*Modern anesthesia was discovered, mastered and perfected by Muslim anesthetists 900 years before the advent of Davy and Wells. They utilized oral as well as inhalent anesthetics.*

2. ముక్కు ద్వారా పీల్చే ఎనస్థీసియాను ఉపయోగించి మొదటి శస్త్ర చికిత్సను 1845లో అమెరికా జాతీయుడైన సి.డబ్ల్యూ. లాంగ్ చేశారు.

2. లాంగ్ కంటే 600 సంవత్సరాల ముందుగానే, ఇస్లామిక్ స్పెయిన్‌కి చెంది అజ్జహ్రావి మరియు ఇబ్నెజుహ్ర మిగిలిన ముస్లిమ్ శస్త్ర చికిత్స నిపుణులతో వందల సంఖ్యలో శస్త్రచికిత్సలు (ఆపరేషన్లు) ముక్కుతో పీల్చే ఎనస్థీసియాను ఉపయోగించి చేశారు.

మత్తును కలిగించే పదార్థంలో ముంచిన స్పాంజిలను రోగి ముఖంపై ఉంచేవారు.

*The first surgery performed under inhalation anesthesia was conducted by C.W. Long, an American, in 1845.*

*Six hundred years prior to Long, Islamic Spain's Az-Zahrawi and Ibn Zuhr, among other Muslim surgeons, performed hundreds of surgeries under inhalation anesthesia with the use of narcotic-soaked sponges which were placed over the face.*

3. శస్త్ర చికిత్స (ఆపరేషన్)లో ఏంటిసెప్టిక్స్‌ను సైంటిఫిక్‌గా ఉపయోగించడాన్ని 1865లో జోసెఫ్ లిస్టర్ అనే బ్రిటిష్ సర్జన్ కనుగొన్నాడు.

3. 10వ శతాబ్దం దాదాపు ప్రారంభంలోనే, ముస్లిమ్ ఫిజిషియన్లు మరియు సర్జన్లు శుద్ధి చేయబడిన ఆల్కహాల్‌ను గాయాలకు ఏంటీసెప్టిక్ ఏజెంట్‌గా పూసేవారు. ఆపరేషన్ జరుగుతున్నప్పుడు, జరగడానికి ముందుకూడా ఏంటిసెప్సిస్‌ను మెయిన్‌టైన్ చేయడానికి ప్రత్యేక పద్ధతులను ఇస్లామిక్ స్పెయిన్‌లోని సర్జన్లు ఉపయోగించేవారు.

ఆపరేషన్ జరిగిన తరువాత 'శుభ్రత'ను మెయిన్‌టైన్ చేయడానికి నిర్దిష్టమైన ప్రోటోకాల్స్‌ని ప్రారంభించారు.

ఆపరేషన్ల సక్సెస్ రేట్ ఎంత ఎక్కువగా ఉండేదంటే, యూరప్‌లోని పలుప్రాంతాల నుండి ఉన్నతాధికారులు మధ్య యుగానికి చెందిన "*Mayo Clinic*" గా పోల్చే స్పెయిన్‌లోని కార్డోబాలో ట్రీట్‌మెంట్ కోసం వచ్చేవారు.

*The scientific use of antiseptics in surgery was discovered by the British Surgeon Joseph Lister in 1865.*

*As early as the 10th century, Muslim physicians and surgeons were applying purified alcohol to wounds as an antiseptic agent. Surgeons in Islamic Spain utilised special methods for maintaining antisepsis prior to and during surgery. They also originated specific protocols for maintaining hygiene during the post-operative period. Their success rate was so high that dignitaries throughout Europe came to Cardoba, Spain, to be treated at what was comparably the "Mayo Clinic" of the Middle Ages.*

---

**ప్రైమరీ స్కూలులో చదివే పిల్లల కోసం ఓ రైమ్ (Rhyme)ను ఈ సంచికలో స్థలం లేక అందించలేక పోతున్నాము. క్రిందటి సంచికలో అందించిన రైమ్ 'అల్-ఖాలిఖ్ (సృష్టికర్త)'లో ఓ చిన్న స్పెల్లింగ్ మిస్టేక్‌ను ప్రెస్‌కి పంపేముందు గుర్తించలేక పోయాము. సవరణను ఇక్కడ అందిస్తున్నాము. సెప్టెంబర్, 2009 కాపీలో ఇచ్చిన వాక్యాన్ని తదనుగుణంగా కరెక్ట్ చేసుకోమని మనవి చేసుకుంటున్నాము - శాంతిబాట టీమ్.**

సవరణ

*~~La illaha Ill Allah~~*

*La ilaha Ill Allah* ✓

# ఖుర్'ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువుదాం

**"(ప్రవక్తా!) మేము ఎంతో శుభవంతమైన ఈ గ్రంథాన్ని నీ పై అవతరింపజేశాము, ప్రజలు దాని వాక్యాలను గురించి ఆలోచించాలనీ, బుద్ధిమంతులూ, ఆలోచనాపరులూ దానినుండి గుణపాఠం నేర్చుకోవాలనీని'' (దివ్య ఖుర్'ఆన్ 38:29)**

**ముహమ్మద్ (స) ఇలా చెప్పారు: "మీలో శ్రేష్ఠులు ఎవరంటే ఖుర్'ఆన్‌ని నేర్చుకునేవారు మరియు నేర్పించేవారు" (బుఖారి)**

ఖుర్'ఆన్‌లో దాదాపుగా 77,800 పదాలున్నాయి. అందులో దాదాపు 83 శాతం అంటే 64,282 పదాలను తీసుకుంటే, అందులోని కొన్ని పదాలే మాటి మాటికి వస్తూ ఉంటాయి. కాబట్టి ఈ 83 శాతం పదాలను నేర్చుకోగలిగితే, మీరు చదువుతున్నప్పుడే దాని అర్థం కూడా మీ పఠనంతో పాటుగా అర్థమైపోతూ ఉంటుంది.

ఒక సంవత్సరంలో 83శాతం పదాలను నేర్చుకునే విధంగా ప్రతీ నెల కొన్ని పదాలను అందించాలని ఈ శీర్షిక ప్రారంభించాము. కాని పాఠకుల సౌలభ్యం కోసం ఈ శీర్షికను 30 నెలలకు మార్చడమైనది.

ఈ శీర్షికకు సంబంధించిన ఇతర ముఖ్య వివరాలను మొదటి సంచికలో వివరించాము.

ఇక్కడ ముఖ్యంగా మీరు గమనించవలసింది ఏమిటంటే, అరబీ పదాలకు సర్వసామాన్యంగా ఉండే అర్థాన్ని మాత్రమే ఇవ్వడం జరిగింది. వాస్తవానికి ఆ పదానికి ఇంకా ఎక్కువ అర్థాలు ఉండవచ్చు. సందర్భాన్ని బట్టి ఇతర అర్థాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కాని అటువంటి పదాల సంఖ్య తక్కువే. పదాలను అక్షరాల క్రమంలో (alphabetical order) ఇవ్వడం వలన అర్థాలు వెతకడం సులభమౌతుంది.

**అరబీ పదాలకు సరిపోయే ఖచ్చితమైన ఉచ్చారణను తెలుగులో ఇవ్వడం చాలా కష్టం. అందుకని ఈ పదాలను ఉచ్ఛరించడం కోసం మేమిచ్చిన ఉచ్ఛారణను కాకుండా, మీ దగ్గరలోని హాఫిజ్, మౌలానాలను లేదా అరబీ చదువగలిగిన వారిని సంప్రదించమని మనవి చేసుకుంటున్నాం.**

### ఎక్కడ?

| | | | |
|---|---|---|---|
| **పైన** | = | (ఫౌఖ) | فَوْقَ |
| **క్రింద** | = | (తహ్‌త) | تَحْتَ |
| **ముందు** | = | (బయ్‌నా అయదీ) | بَيْنَ أَيْدِي، بَيْنَ يَدَيْ |
| **వెనుక, తరువాత** | | (ఖల్‌ఫ) | خَلْفَ |
| **ముందు** | = | (అమామ) | أَمَامَ |
| **వెనుక** | = | (వరాఅ) | وَرَاءَ |
| **కుడి, ఒట్టు** | = | (యమీన్) | يَمِيْن (أَيْمَان pl) |
| **ఎడమ** | = | (షిమాల్) | شِمَال (شَمَائِل pl) |
| **మధ్య** | = | (బయ్‌న) | بَيْنَ |
| **చుట్టూ** | = | (హౌల) | حَوْلَ |
| **ఎక్కడైనా** | = | (హయ్‌సు) | حَيْثُ |
| **ఎక్కడైనా** | = | (అయ్‌నమా) | أَيْنَمَا |

### ప్రశ్నలు?

| | | | |
|---|---|---|---|
| **ఏమిటి, అదే** | = | (మా) | مَا |
| **ఎవరు? అతనే** | = | (మన్) | مَنْ |
| **ఎప్పుడు? అప్పుడు** | = | (మతా) | مَتٰى |
| **ఎక్కడ?** | = | (అయ్‌న) | أَيْنَ |
| **ఎలా?** | = | (కయ్‌ఫ) | كَيْفَ |
| **ఎన్ని?** | = | (కమ్) | كَمْ |
| **ఏది?** | = | (అయ్యు) | أَيٌّ |
| **ఎక్కడ నుండి? ఎందుకు?** | | (అన్నా) | أَنّٰى |
| **ఏమిటి?** | = | (అ, హల్) | أَ، هَلْ |
| **ఏమిటి?** | = | (మాజా) | مَاذَا |
| **ఎందుకు?** | = | (లిమ, లిమాజా) | لِمَ، لِمَاذَا |
| కాకపోతే, ఎందుకు కాదు? | = | (లవ్ లా) | لَوْ لَا |

**కొంతమంది సోదరులు, తమకు అరబీ చదవడం రాదని, కాబట్టి అరబీ అక్షరాల దగ్గర నుండి మొదలు పెడితే వారికి ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్నవారికి అరబీ చదవడం నేర్చుకోవడానికి 7 రోజులు చాలు. అరబీ మొదటి నుండి నేర్పడం ఈ శీర్షిక యొక్క ఉద్దేశ్యం కానప్పటికిని, సోదరుల కోరికను కొంతమేరైనా తీర్చాలనే సంకల్పంతో 2వ సంచికలో అరబీ అక్షరాలను, వాటి గుణింతాలను ఇచ్చాము.**

## భార్యాభర్తలిద్దరూ సమానమేనా?

(భార్య < భర్త ?    భార్య = భర్త ?    భార్య > భర్త ?)

భార్యాభర్తలు ఒకరికొకరు దుస్తులు లాంటివారని క్రింది ఖుర్ఆన్ వాక్యం ద్వారా తెలుస్తుంది.

**"వారు మీకు దుస్తులు. మీరు వారికి దుస్తులు"** (ఖుర్ఆన్ 2:187)

దుస్తులు మన శీలాన్ని కాపాడుతూ మనకి గౌరవాన్ని ఎలా కలుగ జేస్తాయో, అలాగే భర్త శీలాన్ని భార్య, భార్య శీలాన్ని భర్త కాపాడుతూ ఒకరి వలన మరొకరు గౌరవం పొందే అవకాశముందని కూడా అర్థమౌతుంది.

బిడ్డ జన్మకు తల్లిదండ్రులిద్దరూ కారకులే. కాబట్టి వీటినిబట్టి స్త్రీ, పురుషులిద్దరూ సమానమనే భావన కలుగుతుంది కదా!

కాని ఖుర్ఆన్‌లోని మరో వాక్యాన్ని బట్టి పురుషుడు, స్త్రీ కంటే అధికుడని తెలుస్తుంది.

**"పురుషులు స్త్రీలకు అధికులు (ఖవ్వామ్), ఎందుకంటే అల్లాహ్ వారిలో ఒకరికి మరొకరిపై ఆధిక్యతలను ప్రసాదించటం వల్ల, ఇంకా పురుషులు తమ సంపదను వారి కొరకు ఖర్చు చేస్తున్నందువల్ల. కనుక సుగుణవతులైన స్త్రీలు విధేయత కలిగి ఉంటారు. పురుషులు లేనప్పుడు అల్లాహ్ రక్షణలో ఉంటూ వారి హక్కులను కాపాడుతారు."** (దివ్య ఖుర్ఆన్ 4:34)

క్రింది హదీస్‌ను గమనించండి:

**"హ్జత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు. "ఒక వ్యక్తి ప్రవక్త (స) సమక్షంలో హాజరయి అడిగాడు. 'దైవ ప్రవక్తా! నా అనురాగానికి ఎక్కువ అర్హులు ఎవరు?" ఆయన, 'నీ తల్లి' అని పలికారు. అతను మళ్లీ అడిగాడు 'ఆ తరువాత ఎవరు?' అని. 'నీ తల్లి', తర్వాత ఇంకెవరు? 'నీ తల్లి', 'ఆ తర్వాత' 'నీ తండ్రి' అని ఆయన (స) అన్నారు."**

అంటే 3 సార్లు తల్లి, 4వసారి తండ్రి అని చెప్పడాన్ని బట్టి, తల్లికి 4వ వంతులలో 3 వంతులు మరియు తండ్రికి 4 వంతులలో ఒక వంతు మాత్రమే అంటే, ఇక్కడ స్త్రీ, పురుషుని కంటే అధికురాలని అన్పిస్తుంది.

తల్లి కాళ్ల క్రిందే స్వర్గముందని, తండ్రి ఆ స్వర్గానికి ద్వారమనే ఉల్లేఖనం బాగా ప్రాచుర్యంలో ఉన్నదే!

తల్లి కాళ్ల క్రింద స్వర్గాన్ని వెతికారు సరే, మరి ఆ స్వర్గంలోకి ప్రవేశించాలి కదా! ఆ స్వర్గానికి ద్వారము తండ్రి కాబట్టి, స్వర్గంలోకి ప్రవేశించాలంటే ఇద్దరూ అవసరమే!

ఇక్కడ ఆధిక్యత తెలియడం లేదు కదా!

కొన్ని విషయాలలో స్త్రీ ఎక్కువ కావచ్చు, మరికొన్ని విషయాలలో పురుషుడు అధికం కావచ్చు.

క్రింది పట్టిక చూడండి. పట్టికలో ఓ పరీక్షకి సంబంధించి భార్యా భర్తల మార్కులను ఇవ్వడం జరిగింది.

| సబ్జక్ట్ | భార్య | భర్త |
|---|---|---|
| ఇంగ్లీష్ | 70 | 80 |
| తెలుగు | 80 | 75 |
| ఫిజిక్స్ | 100 | 85 |
| కెమిస్ట్రీ | 95 | 95 |
| మేథ్స్ | 90 | 100 |
| మొత్తం | 435 | 435 |

ఇద్దరికీ మార్కులు సమానంగా వచ్చాయి. ఇద్దరిలో ఏ ఒక్కరూ మరొకరిపై అధికం కాదు. కాని సైన్స్‌లో భార్య అధికమయితే, గణితంలో భర్త ఆధిక్యత చూపించారు. మొత్తం మీద ఇద్దరికీ సమానంగానే మార్కులు వచ్చాయి.

ఇదే విధంగా స్త్రీ పురుషులు తమ జీవితాలలోని ఎన్నో దశలలో వేర్వేరు హోదాలలో ఉన్నప్పటికీ చివరికి ఇద్దరూ సమానమే!

భర్త 500గ్రాముల ఆహారాన్ని తింటే, భార్య కూడా ఖచ్చితంగా 500 గ్రాముల ఆహారాన్నే, ఒక గ్రాము అటూ ఇటూ కాకుండా తినాలంటే సాధ్యమౌతుందా? అలా గనుక చేస్తే వారి జీవితమంతా కొలతలతోనే సరిపోతుంది.

ఈ విధమైన సమానత్వ పోటీ మూర్ఖత్వంగా అన్పిస్తుంది కదూ!

స్త్రీ తను కోరినంత ధనాన్ని మహర్‌గా ఇస్తేనే, అతనితో పెళ్లికి ఒప్పుకుంటుంది. పెళ్లయిన తరువాత కుటుంబాన్ని పోషించే బాధ్యత భర్త తీసుకుంటే, ఆ కుటుంబాన్ని చక్కదిద్దే బాధ్యత భార్య తీసుకుంటుంది.

కాని నేటి విద్యావేత్తలు, కుటుంబాన్ని చక్కదిద్దే సుగుణవతులైన స్త్రీలని వంటింటి కుందేలుగా వర్ణిస్తున్నారు. వంట చేయడం, కుటుంబానికి తినిపించడం తక్కువ స్థాయిగా కన్పించిందా వీరికి?

**"చదవక ముందు కాకరకాయ, చదివిన తర్వాత కీకరకాయ"** అన్నాడట వెనుకటికి ఎవడో! నేతి బీరకాయలో 'నేయి' ఎంత ఉంటుందో నేటి విద్యావేత్తలలోని చాలామందిలో అంత విద్య ఉంది అని నిస్సందేహంగా చెప్పవచ్చు. మనిషిలో సంస్కారమనేది పెంపకం ద్వారా, పరిసరాల ద్వారా, ఇంకా కొన్ని ముఖ్య విషయాల ద్వారా వస్తుంది. అయితే చదువు ద్వారా సంస్కారం తప్పనిసరిగా రావాలి. చదువుతో పాటు సంస్కారం రాలేదు అంటే, వారి వద్ద డిగ్రీ సర్టిఫికెట్స్ ఉన్నాయి గాని, వక్తిత్వ వికాసానికి అవసరమైన చదువు లేదని చెప్పవచ్చు.

చదువు వ్యక్తిత్వ వికాసానికే గాని, ఉద్యోగానికి కాదని ముందుగా తెలుసుకోవాలి. చదువుకున్నంత మాత్రాన స్త్రీ ఉద్యోగం చేయడం తప్పనిసరి కాదు. చదువుద్వారా పొందిన వ్యక్తిత్వ వికాసంతో స్త్రీ మరింత మెరుగ్గా తన కుటుంబాన్ని చూసుకోగలుగుతుంది.

స్త్రీ చదువుకుంటే, ఆ చదువు సమాజమంతా వ్యాపిస్తుందని ప్రవక్త(స) చెప్పారు. కాబట్టి చదువుకున్న స్త్రీ, వంట చేయడాన్ని నామోషీగా భావిస్తే, అంతకంటే దౌర్భాగ్యం మరొకటి లేదని తెలుసుకోవాలి.

ఎంత గొప్ప చదువు చదివినా, పళ్ళు తోముకోకుండా, స్నానం చేయకుండా ఉండగలరా? వీరి ఆలోచన ప్రకారం, ఇవన్నీ తక్కువ స్థాయి పనులే కదా! తమను తాము స్వయంగా మేధావులుగా భావించేవారు, ఇలాంటి పనులను నామోషీగా అనుకుని మానివేస్తే ఏమవుతుంది?

వారి దగ్గర చెడు వాసన వస్తుంది. కాదంటారా?

ఉదాహరణకు ఓ స్త్రీ ఆఫీస్‌లో టైపిస్ట్‌గా ఉద్యోగం చేస్తున్నారనుకుందాం. ఆమె చేసే పని ఏమిటి? తన వ్రేళ్ళతో టైప్ మిషన్ యొక్క కీస్‌ని నొక్కడమే కదా!

మరి వంట చేయడానికి గృహిణి అంతకంటే ఎక్కువే కష్టపడాలి కదా! భర్తకు, పిల్లలకు ఇష్టమైనవి వండిపెట్టడం కంటే, టైపిస్ట్ చేసేపని ఎక్కువా? ఎంతమాత్రం కాదు.

టైపిస్ట్ అని ఇక్కడ ఒక ఉదాహరణగా మాత్రమే చెప్పడం జరిగింది. అంతేగాని టైపిస్ట్‌లను చులకన చేసే ఉద్దేశ్యం ఏ కోశానా లేదు.

ఉద్యోగం చేసి సంపాదిస్తే, భర్తతో సమానం కాగలిగానని అనుకోవడం అవివేకమే అవుతుంది. **భార్యాభర్తలు పోటీ పడవలసింది సంపాదనలో కాదు. ఒకరికొకరు ప్రేమను పంచుకోవడంలో, ఒకరి గురించి ఒకరు శ్రద్ధ తీసుకోవడంలో పోటీ ఉండాలి.**

స్త్రీకి స్వేచ్ఛ ఉండాలని, మగవాడికి బందీగా ఉండకూడదనే మూర్ఖపు ఆలోచనలతో కూడా చాలామంది స్త్రీలు ఉద్యోగాలు చేస్తున్నారు. సంపాదన వలన స్వేచ్ఛ వస్తుందా?

భార్యాభర్తలిరువురూ ఉద్యోగాలు చేస్తూ సంపాదించడం ముందుగా పాశ్చాత్య దేశాలలో ప్రారంభమైంది. అక్కడ పెరుగుతున్న విడాకుల సంఖ్యకు కారణం ఈ ఆర్థిక స్వేచ్ఛే. కుటుంబాలు నాశనమౌతున్నాయి. మహిళా ఉద్యోగాలు ఎన్నో పచ్చని కాపురాలలో చిచ్చు పెడుతున్నాయి. పిల్లల మీద చెడు ప్రభావం పడుతుంది.

ఇద్దరూ ఉద్యోగస్తులు అయినప్పటికీ కూడా, ఇలాంటి వారి ఏ ఇంట్లో కూడా భార్యాభర్తల యొక్క సంపాదనలు సమానంగా ఉండవు. ఇద్దరి సంపాదనలో ఒక్క రూపాయి తేడా లేకుండా సమానంగా ఉండదు. అలాగే ఇంటి బాధ్యతలను ఖచ్చితంగా సగం సగం పంచుకోవడం కూడా వారికి సాధ్యం కాదు.

ఇద్దరూ ఉద్యోగాలు చేసే చాలా కుటుంబాలలో వంట ఎవరు చేస్తున్నారు? భర్త? లేక భార్య?

**స్త్రీకి స్వేచ్ఛ పెరిగిందా? శ్రమ పెరిగిందా?**

మరి సమానత్వాన్ని ఏ విధంగా సాధించగలిగారు?

స్వేచ్ఛ ఏదైనా నేటి స్త్రీలలో చాలామంది పొందగలిగారంటే, అది వారు వేసుకున్న బట్టలలోనే దర్శనమిస్తుంది. పూర్తిగా శరీరాన్ని కప్పుకునే బట్టల నుండి మాత్రమే వారికి స్వేచ్ఛ లభించింది. పురుషులు పూర్తిగా డ్రెస్ చేసుకుంటున్నారు. ఫ్యాషన్ పేరుతో స్త్రీ వస్త్ర ధారణలో చాలా తేడా వచ్చింది. **బాధ్యతలు తగ్గలేదుగాని బట్టల సైజు రోజు రోజుకీ తగ్గిపోతుంది.**

ఇక స్వేచ్ఛ విషయానికొస్తే, బాధ్యతగల పురుషునికి ఎంత స్వేచ్ఛ ఉంది? కుటుంబ పోషణ కోసం సంపాదించవలసిన బాధ్యత పురుషునిదే కదా! మరి ఆ బాధ్యతను వదిలేసి స్వేచ్ఛగా పురుషుడు ఎగిరిపోగలడా? బాధ్యతలతో పురుషుడు కూడా బందీయే కదా!

**'పొరుగింటి పుల్లకూర రుచి'** అని అంటారు. చక్కగా కాపురం చేసుకునే స్త్రీలు కూడా, పాశ్చాత్య స్త్రీని అనుకరించి సంతోషంగా గడపవలసిన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తారు. ఎన్నో సౌకర్యాలను ఏర్పరచుకున్నా సరే, వారిద్దరూ సరదాగా గడిపి, వారి ముద్దూముచ్చట్లను తీర్చుకోగలుగుతున్నారా?

కుటుంబ వ్యవస్థ పూర్తిగా పతనం కావడానికి కారణం వారి మధ్య నెలకొన్న మూర్ఖత్వపు పోటీయే!

భార్యాభర్తల మధ్య ఎక్కువ లేదా తక్కువ అనే భావన రాకుండా, ఒకరినొకరు ప్రేమించుకుంటూ, ఎల్లప్పుడూ సంతోషంగా జీవించేలా చేయడానికి ఇస్లాం ధర్మం భార్యాభర్తల హక్కులను, బాధ్యతలను స్పష్టం చేసింది. భార్యకు భర్తపైగల హక్కులను, అలాగే భర్తకు భార్యపైగల హక్కులను గురించి తెలుసుకుని ఇస్లామీయ జీవన విధానం ప్రకారం జీవిస్తే, **బెస్ట్ కపుల్ (ఉత్తమ జంట) మీరే అవుతారు!**

వివాహం చేసుకోవడానికి గల మరో ముఖ్య కారణాన్ని క్రింది ఖుర్‌ఆన్ వాక్యం తెలియజేస్తుంది.

**"ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు - మీరు వారి వద్ద శాంతిని పొందటానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ సృష్టించాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి."** (దివ్య ఖుర్‌ఆన్ 30:21)

శాంతిని పొందటం కంటే ఎక్కువ ఏముంది ప్రపంచంలో? అలాంటి శాంతిని వివాహ వ్యవస్థ ద్వారా భార్య ద్వారా పొందాలంటే, ధర్మ పరాయణురాలైన స్త్రీని భార్యగా పొందాలి. ఈ విషయం క్రిందటి సంచికలో వివరించబడింది.

మా శాంతిబాట పాఠకులు, తమ జీవిత భాగస్వాములతో ఒకరికొకరు ప్రేమను పంచుకోవడంలో పోటీపడాలని కోరుకుంటున్నాము.

**- శాంతిబాట టీమ్**

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** '*Akash Industries*', G-14, Industrial Estate, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Title Code APTEL11019

## శాంతిబాట పాఠకులకు ఓ శుభవార్త

రాబోయే 3వ లేదా 4వ సంచికతో పాటు క్రింది పుస్తకాన్ని ఇన్షాఅల్లాహ్ ఉచితంగా అందిస్తాము

మానవ చరిత్రలోనే మహోన్నతుడుగా నిరూపించబడిన దైవసందేశహరులు

# ముహమ్మద్(స) వారిపై

# ప్రపంచవ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం

(సుమారు 200 పేజీలు, 1/8 డమ్మీ సైజ్, వెల: ఉచితం)

పబ్లిషర్స్: ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ (వైజాగ్) మరియు వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ (సామర్లకోట)

ఈ మహనీయున్ని ప్రముఖ చరిత్రకారులు, విమర్శకులు ఎంతో కొనియాడారు. అమెరికాలో మైఖేల్ యెచ్. హార్ట్ జరిపిన పరిశోధనాత్మక సర్వేలో ప్రపంచ మానవులలో మొదటి ఉన్నత స్థానం ముహమ్మద్(స) వారికి దక్కింది. ఈయన జీవిత చరిత్ర ముస్లిములలోనే ఎక్కువ శాతం మందికి తెలియనప్పుడు, ఇతర మతధర్మాల వారికి ఎలా తెలుస్తుంది?

ఓ వర్గం వారు ప్రతీ గంటకు ఇస్లాంకి వ్యతిరేకంగా ఓ పుస్తకాన్ని ప్రచురిస్తున్నారంటే, ఈ దుష్ప్రచారం కోసం ఎంత ఖర్చు చేస్తున్నారో అర్థమవుతుంది. ఇంటర్‌నెట్‌లో, ప్రింట్ మీడియాలో ఎంతో విద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారు. ఆవేదన కలిగించేలా, తట్టుకోలేని స్థాయిలో నీచమైన పదజాలాన్ని ఉపయోగిస్తున్నారు.

బురద చల్లుతున్న ఇలాంటివారిపై మనం కూడా బురద జల్లితే, వారికి మనకూ తేడా ఏముంటుంది? అందుకే బురద జల్లేవాని చేతికంటిన బురదను కడిగి, వారికి సంస్కారాన్ని నేర్పవలసిన బాధ్యత మనపైనే ఉంది. ముహమ్మద్(స) వారికి నిజంగా విధేయులైన వారి బాధ్యత ఇదే!

ఈ సంవత్సరం జనవరి నుండి ఆగష్టు వరకూ ఈ పుస్తకం కోసమే పూర్తి సమయాన్ని కేటాయించి అందరికీ అర్థమయ్యే తెలుగులో వ్రాయడం జరిగింది. ఈ పుస్తకం చదివాక, ఇక ఎవరికీ ఎప్పుడూ ముహమ్మద్(స) వారిపై చెడుగా మాట్లాడే అవకాశం, ఇన్షా అల్లాహ్ రాదు అని పూర్తి విశ్వాసంతో చెప్పగలుగుతున్నాము.

ఏ ధార్మిక కార్యక్రమం ప్రారంభించినా, సున్నత్ ప్రకారం, అందరితో కలిసి చేయాలనేదే మా కోరిక. ఈ పనిలో మాతో భాగస్వాములు కావాలను కుంటున్నారా? మీరు కూడా వేరొకరికి ఉచితంగా ఈ పుస్తకాన్ని పంచాలనుకుంటున్నారా? అయితే 100 రు॥ల నుండి మొదలుకొని, మీకు వీలైనంత అందించండి. పోస్టల్ ఖర్చుతో కలిపి మీరు పంపిన మొత్తానికి సరిపడా పుస్తకాలను పంపుతాం.

పుస్తకాన్ని ప్రింటింగ్ కొరకు ప్రెస్‌కు ఇచ్చేలోపునే తెలియజేయమని కోరుతున్నాము.

రాష్ట్రమంతటా వేల కాపీలు ఉచితంగా పంచాలనుకున్నాము. మా రెండు సొసైటీల తరపున మరియు ఈ మహాకార్యంలో మాతో భాగస్వాములైన కొందరి సోదరుల తరపున సుమారు 3000 కాపీలను 'ఇన్షాఅల్లాహ్' ఉచితంగా అందిస్తాం.

రండి! మాకు చేయూత నివ్వండి! మనందరం కలిసి

ప్రపంచ శాంతిదూత "ముహమ్మద్(స)" వారి గొప్పతనాన్ని ప్రజలందరికీ తెలియజేద్దాం.

ఉత్తమ భర్తగా, ఉత్తమ తండ్రిగా, ఉత్తమ స్నేహితుడుగా, ఉత్తమ బోధకుడిగా, ధైర్యశాలిగా, నిరాడంబరుడుగా, సహనశీలుడుగా, నిజాయితీ పరుడుగా, అనాథలకు ఆశ్రయంగా, ఆత్మాభిమానిగా, ఇంకా ఎన్నో మహోన్నత లక్షణాలను ఏకకాలంలో ఒకే వ్యక్తిలో కలిగి ఉండటం ఒక్క ముహమ్మద్(స) వారికే సాధ్యమైంది. ఈ మాట అన్నది మేము కాదు. ముస్లిమేతరులే తీర్పునిచ్చారు.

పూర్తి సాక్ష్యాధారాలతో, ప్రామాణిక గ్రంథాల ద్వారా వివరణ మరియు విశ్లేషణలతో రాబోతుంది.

దుష్ప్రచారాన్ని ఖండించే విషయంలో, పూర్తి వివరాలతో ప్రపంచంలోనే దీనిని తొలి పుస్తకంగా తీర్చిదిద్దాలనే మా ధృడ సంకల్పాన్ని అల్లాహ్ సమ్మతించి ఉంటారని మా విశ్వాసం.

SAANTHIBAATA MONTHLY OCTOBER 2009 Samalkot-533440 (East Godavari Dist.)
RNI Title code APTEL11019, Dt. 31.03.09

